

ఆంధ్ర
సచిత్ర
వార
పత్రిక
29.3.61
వెల 25 నయాపైసలు



'మధురా బృందవన్'లో దక్షిణాది దేవళం

—చిత్రం: శ్రీధర రామకృష్ణమూర్తి

నికో

సంపూర్ణ చర్మ ఆరోగ్యమునకు
నివారణము – సౌందర్యమునకు
మొదటి మెట్టు

ఇది మీ చర్మమును శుభ్రపరచుటయేగాక, మీ చర్మమునకు సౌందర్యమును కూడ నిచ్చును. నికో నురగ, రోమాంకురములకు చెంది శుభ్రపరచెడి గుణము, మరియు క్రిమి అభివృద్ధి నివారణ గుణము కలిగినదియై, అది మీ చర్మమును శుభ్రపరచి మొటిమలు, కురుపులు మొదలైన అంటు వ్యాధులను రాకుండ కాపాడును.

పదిహేను దినములకొక పర్యాయము నికో సబ్బుచే మీ తలను రుద్దుకొనిన యెడల, అది చుండును రాకుండా కాపాడును. నికోను దిన సరి క్రమముగా వాడిన సౌందర్యమున కత్యావశ్యమగు, శుభ్రమైన, మృదువైన మరియు ఆరోగ్యవంతమైన చర్మమును మీకు నొసగును.

ప్రతిదినము నికోను వాడండి మీ యొక్క...
మీ కుటుంబీకుల యొక్క...
చర్మ ఆరోగ్యమునకు అనుగుణ్యమైన సబ్బు

నికో దినసరి వాడకకు స్వచ్ఛమైన క్రిమిహరణ సబ్బు



తెలుగు వెలుగులు

15—3—61 వ తేదీ సంచికలో "తెలుగు వెలుగుల" శీర్షిక మృదుమధురంగా ఉన్నది. మీరు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారిని గురించి "హైదరాబాద్ శాసన సభలో ఎవరు ఏ భాషలో ప్రశ్నిస్తే ఆ భాషలో సమాధానం చెబుతూ, ఇంతింతై వటుడింతయై లాగ చూస్తూ చూస్తూ ఉండగానే త్రివిక్రము లయ్యేవా"రని వ్రాసిన వాక్యం చాల సమంజసముగా నున్నది. కాని ఈ సారి మీ (మా) పత్రికలో ఇచ్చిన గమనిక ద్వారా ఇంతటి రసవత్తరములైన వ్యాసములు వెలువడే తెలుగు వెలుగులు శీర్షిక వచ్చే సంచికతో ముగియబోతుందని తెలిసి చాల విచారిస్తున్నాను. ఇకముందు రాబోయే పత్రికలో ఇటువంటి శీర్షిక లేవైనా ప్రవేశపెట్టి ఆంధ్ర సచిత్ర వారపత్రికకు శోభను చేకూర్తురని ఆశించుచున్నాను.

గోపాలన్ వేంకట సుబ్రమణ్యం
(విశాఖపట్టణము—4)

* * *

మహామేధావిగా, న్యాయశాస్త్ర విజ్ఞతుడుగా, ప్రతివాది భయంకరుడుగా, ప్రజాహితంకరుడుగా జాతీయవాదిగా, బహు భాషా వాదిగా, రాష్ట్రమంతటా మాత్రమేకాదు, దేశమంతటా కీర్తి చంద్రికలు విస్తరించిన బహుముఖ ప్రజ్ఞాశాలి,తెలుగు తల్లికే గర్వకారణమయిన బిడ్డ శ్రీ బూర్గుల. ఇన్నాళ్ళూ ఉపేక్షించి, ఈనాటికైనా తెలుగు వెలుగుగా ఆయనను గుర్తించగలిగినందుకు నా ధన్యవాదాలు

కె. వి. ఆర్ శర్మ (వాల్తేరు)

* * *

తెలుగు వెలుగులు వ్రాయుటంలో తమరు కొంత పక్షపాతం చూపుతున్నట్లు కనబడుతుంది. 74 నెం. తెలుగు వెలుగు చూసింతరువాత ఇది నిజం అనిపిస్తుంది.

ఇంతవరకు అన్ని కులాలవారు వచ్చారుగాని మా వైశ్యులు రాలేదు. ఇది అన్యాయం.

టి. కేశవరామారావు (హైదరాబాదు)

* * *

"తెలుగు వెలుగులు" శీర్షిక ముగింపునుగూర్చి మీరు ప్రకటించినారు. ఇది నాకు ఆశాభంగం కల్గించినది. ఎందరో మహానుభావుల వెలుగు నీడలను చక్కగా ప్రతిబింబింపజేసిన ఈ శీర్షిక ఇంతటితో ఆపు చేయుట పెక్కు పాఠకులకు నిరుత్సాహజనకం.

తెలుగు మాగాణిలో తీయని పంటల పండించి దేశమాత కనుంగు బిడ్డలగు వారిని ఇంకెందరినో పరిచయము గావించవలసి ఉన్నది.

బి. ఆర్. (చిలకలపూడి)

* * *

మీ (మా) ఆంధ్ర సచిత్ర వార పత్రికయందు "తెలుగు వెలుగులు" అత్యున్నత భావ గర్భితమగ శీర్షిక. 15—3—61 నాటి పత్రికయందు మాననీయ ఉత్తర ప్రదేశ పాలక శేఖరులగు శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారిని గూర్చి వ్రాసినందులకెంతో ఆనందపడుచున్నాను. ఈ పత్రిక ద్వారా నా హృదయ పూర్వక అభివందనము లర్పించుచున్నాను. దయచేసి తెలుగు వెలుగుల శీర్షిక ఉంచ ప్రార్థన.

డి. నారాయణరావు (మెదక్)

* * *

ముఖచిత్రం

ఈవారం (15—3—61) శ్రీ కేతినీడి భాస్కరరావు (విజయనగరం)గారి "జలజ సుందరి" ముఖ చిత్రంతో పత్రిక చాలా అందంగా తయారయినది. కనీసం నెలకు రెండు వార పత్రికలనైనా, ముఖ చిత్రాలు, ఇలాంటి వర్ణ చిత్రాలను ప్రచురించడము, అటు చిత్రకారులకు ప్రోత్సాహకరంగాను, ఇటు నాలాటి పాఠకులకు ఆనందదాయకంగాను వుంటుందని మనవి చేస్తున్నాను. చిత్రకారులు

శ్రీ కేతిసిడి భాస్కరరావుగారికి నా ప్రత్యేక అభివందనములు

కుమారి సి. రాధ (అనంతపురం)

* * *

వర్షము వెలసిన పిమ్మట విరిల ఆకాశము నిర్మలముగా గోచరించినట్లు, సినీతారల ముఖబింబాలను విసర్జించిన 15—3—61 తేదీ పత్రిక ముఖచిత్రం పాఠకుల మనోఫలకాలపై ప్రశాంత వాతావరణాన్ని సృష్టించగల్గింది. సినిమా తారల అందచందాలకంటె, కేతిసిడి భాస్కరరావుకుంచెనుండి వెలువడిన పూహాసుందరి — జలజసుందరి—స్వతస్సిద్ధ రూపురేఖలు పాఠకుల్ని ఆకర్షించలేదా ?

కె. పార్వతీశ్వరరావు (ఉర్లాం)

* * *

15—3—61 తేదీ పత్రిక చూసి పున్నమి నాటి పాలకడలి పొంగులా నా మనస్సు సంతోషంతో పెల్లుబికింది. సినిమా తారల చిత్రాలు చూసి చూసి విసిగి వేసారిన మాకు మీ 'జలజ సుందరి'ని చూసి ఎట్లా అనిపించిందంటే, రోజంతా కాయకష్టం చేసి కొలనులో స్నానం చేస్తే ఎట్లాఉంటుందో అట్లా అనిపించింది.

యస్. చరణదాస్ (చిలుపూరు)

* * *

15—3—61 తేదీ పత్రిక మమ్ములనెంతో ఆనందపరచినది. ముఖ్యముగా ముఖ చిత్రం చాలా బాగున్నది. సినీ కళాకారుల ముఖ చిత్రములతో విసుగెత్తిన మాకు ఈవారం చాలా ఆనందమును చేకూర్చినది ముఖచిత్రము వేసిన వారికి మా ధన్యవాదములు. ఇకమీదట కూడా ఇటువంటి ముఖ చిత్రములనే వేయుదురని ఆశించుచున్నాను.

ఎం. రామశాస్త్రి (ఏలూరు)

* * *

కరూనులు

కార్టూన్లు చూడాలంటే మీ పత్రికనే చూడాలి. అందులో పూమెన్ కార్టూన్లు నాకు నచ్చుతుంటాయి ముఖ్యంగా''బడ్జెట్ ప్రతిపాదనలు—ప్రజలు'' అన్న కార్టూన్ మమ్మల్ని కడుపుబ్బ నవ్వించింది. వాడకం వస్తువులమీద పన్నులు పెంచినందువల్ల, సామాన్య ప్రజలు ఏలా బాధపడ్తారో సూచించేందుకు యీ కార్టూన్ ఒక ప్రతిబింబం.

ఎర్గోని నాగేంద్రప్రసాద్ (గుత్తి)

* * *

ఈవారం 15—3—61 పత్రికలో వేసిన పూమెన్‌గారి కార్టూను చాలా బాగుంది. బడ్జెటుపై మరికొన్ని కార్టూనులు కూడా వేస్తారని ఆశిస్తాం. ఇటువంటి వ్యంగ్య చిత్రరచనకు పూమెన్‌గారిని, ప్రచురించిన మిమ్ము అభినందింపక తప్పదు.

వి. రామారావుగుప్త (విశాఖపట్నం)

* * *

8—3—61 ఆంధ్ర సచిత్ర వారపత్రికలోని శంకర్‌గారి "ఎప్పుడూ యింతే" ఏమంతగా నమ్మదగ్గట్లు లేదు. భర్తలచేత వంట వండించుకొనే స్త్రీలున్నారేమోగాని పూజలు చేయించుకొనేందుకు శాసించే స్త్రీ లుండబోరని నా ఉద్దేశ్యము. అలాగే భార్యను లొంగదీసుకొనలేక ఆమెకు దాసుడై పూజించే భర్త కూడ (శంకరుగారు తప్పితే) వుండడు. ఇది బహుశా వారి యింటి ఆచారమని వూహించుకొనుచున్నాము. అందుచేత యింతటినుంచి ఇటువంటి కార్టూనులు పంపకుండా నలుగురికి నచ్చే కార్టూనులు చిత్రించమని కోరుతున్నాను.

ఉపాధ్యాయుల కామేశ్వరి (శ్రీరాంపురము)

* * *

కవితా కింకిణి

ఈవారము 15—3—61 .ఆంధ్ర సచిత్ర వార పత్రికలోని కవితా కింకిణి శీర్షిక క్రింద ప్రచురించిన 'గడియారపు ముడి' పద్యము చాలా బాగున్నది. ఈ పద్యమునకు 'హెడ్డింగ్' బాగా సరిపోయినది. ఇట్టి మంచి రచనను ప్రచురించినందుకు సంపాదకులకు నా మనఃపూర్వక అభివందనములు.

వి. శేషసాయి (పొందూరు)

* * *

కథలు

ప్రతివారము మీ పత్రికలోని అన్ని కథలలోనికి 80 రోజుల్లో భూ ప్రదక్షిణము చాలా బాగుంటోంది. నిజంగా పార్థసారధిగారు జూల్స్‌వెర్న్ నవలను చాలా బాగా అనువదించారు. ముఖ్యంగా ఈ నవలలో ఫిలియస్‌ఫాగ్ పట్టుదల ప్రశంసింపదగినది.

ఎస్. వి. కె. ఎన్. మూర్తి (నాగపూర్)

* * *

ఈమధ్య మీ (మా) పత్రికలో ప్రచురించే కథలన్నీ చాలా బాగుంటున్నాయి. ముఖ్యముగా 15—3—61 వ తేదీ పత్రికలో శ్రీ హవిస్‌గారు రచించిన "పిక్నిక్" కథ చాలా బాగుంది. నిత్య జీవితంలో సామాన్యముగా ఇలాటి సంఘటనలు జరుగుట ఈ రోజులలో మనము చూస్తున్నాం, వింటున్నాం.

జేమ్సు క్లయివు (రాయఘడ్(

* * *

15—3—61 తేది ఆంధ్ర సచిత్ర వార పత్రికలో శ్రీ శ్రీనివాస్‌గారు వ్రాసిన ప్రతిక్రియ చదివాను. ఆ కథ చదువుచున్నంతసేపు నా జీవితంలోని పూర్వస్మృతులు జ్ఞాపకానికొచ్చాయి. వాస్తవిక కథను వ్రాసిన రచయితకు నా హృదయ పూర్వక అభివందనములు.

మలిసెట్టి శ్రీనివాస్ (పుత్తూరు)

* * *

ఈవారం సంచిక (15—3—61)లో ప్రచురించిన శ్రీ శ్రీనివాస్‌గారి కథ 'ప్రతీకారం' చాలా బాగుంది. నిజంగా జీవితంలోని కష్టసుఖాలు సుఖ దుఃఖాలు అందులో విశదీకరించారు. మా (మీ) ఆంధ్ర సచిత్ర వార పత్రిక ద్వారా శ్రీ శ్రీనివాస్ గారికి నా శుభ సందేశాలు అందచేయుమని అర్థిస్తున్నాను.

ఐ. వి. ఎస్. రాజు (శ్రీకాకుళం)

* * *

ఈ సంవత్సరాంత సంచిక చక్కనై, చిక్కనైన నవరసము లొలుకుచూ, మిక్కిలి చక్కని

కథలతో వెల్వడినందుకు గర్వించవచ్చు. 'ప్రతిక్రియ' అను కథ మొదటిస్థానము వహించినది. రచయితకు నా అభివందనలు.

నేలబొట్ల అప్పయ్య (విడవలూరు)

* * *

ఈ వారం పత్రికలో 8—3—61 కథలు చాలా బాగున్నవి. బాలసాహితిలో కథ "చిత్రమైన చెవిటివాడు" (ఎస్. ఎన్. కుమారి) చదువుకున్నంతసేపూ నవ్వు వచ్చింది. బాటసారి చెవిటివానిగా నటించినది చాలా బాగున్నది.

ముండ్ల సత్యము (బలపాల)

* * *

ఈ వారం పత్రికలో (8—3—61) కథలన్నీ చాలా బాగున్నాయి. ముఖ్యంగా శ్రీ గణేశ్ చంద్రగారు వ్రాసిన "దొరికిన దొంగ" గుండెకి హత్తుకుపోయింది. మరచినా మరపురాని నన్ని వేశాన్ని చిత్రీకరించారు. సమాజంలో సాధారణంగా జరుగుతుండే అఘాయిత్యాలు ఈ మాదిరిగా ఉంటాయని చాటి చెప్పారు. వారు ఇంకా ఎన్నో సంఘ

ఉత్తరాలు

సంస్కరణ నుద్దేశించిన కథలు వ్రాస్తారని ఆశించుచున్నాను.

—రామకృష్ణ రావు, (అసన్‌సోల్.)

* * *

ఈ వారపత్రిక (8—3—61) లో శ్రీ గణేశ్ చంద్రగారు వ్రాసిన "దొరికిన దొంగ" కథ నవీన పద్ధతిలో నడిచింది. రచయితకు నా ధన్యవాదాలు. దినదిన శోభాయమానముగా వెలుగొందుతున్న మీ పత్రికకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు.

—"పొందూరు కృష్ణ" (కమ్మవారిపాలెం)

* * *

ఈవారం (15—2—61) ప్రచురించు బడ్డ శ్రీ హవిస్‌గారి కథలో చాలాసార్లు క్రియ ఏకవచనంలో, అంతమైతే నామవాచకం బహువచనంలో అంతమవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఉదాహరణకి "అన్నా'డు' 'శాస్త్రి' గారు,", "అన్నా'డు' లక్ష్మినారాయణ'గారు'." ఈవిధంగా క్రియాంతాన "డు" రాసి పేరుకి చివర మాత్రం "గారు" అని పెట్టడం చాలా వెగటుగా ఉంటుంది. అంతేగాక రాజు అన్న పేరుని ప్రతిచోటా ఇన్‌వర్టెడ్ కామాలలో బంధించారు. ఆ పేర్లో అంత ప్రత్యేకత ఏముంది ?

—యం. యల్. పతి, మంచిర్యాల.

అలా వ్రాయటంలో దోష మేమీ లేదు.

కథ కాని కథ పోటీ

"కథకానికథ" పోటీలో పాఠకులెవరైనా సరే పాల్గొనవచ్చునా? లేక చందాదారులే పాల్గొనవచ్చా?

—ఎం. కృష్ణమూర్తి (కడప)

ఎవరైనాసరే పాల్గొనవచ్చు.

* * *

అందరి హృదయాలను ఆహ్లాదపరిచే మీ (మా) ఆంధ్ర సచిత్ర వార పత్రికలోని కార్టూనులు చాలా బాగుంటున్నాయి. ముఖ్యంగా ఊోవెన్‌గారి కార్టూనులు మమ్మల్ని తెగ నవ్విస్తున్నాయి.

—యం. వీరభద్రం (మద్రాసు)

* * *

మగవారికి మాత్రమే

మీ మగవారికి మాత్రమే (?) ప్రశ్నావళి మమ్ము చాల నిరాశ పరచింది. మేము 40 సంవత్సరాల లోపు వయస్సు కలవారమైనా (మా వయస్సు 24 సం.) అది మా కోసం నిర్దేశింపబడలేదు. 'సచిత్ర వార పత్రిక, (మగ) పాఠకులంతా వివాహితులను కోటం చాలా హాస్యాస్పదం. ఇప్పటికైనా (అవివాహితలైన 'మగవారికి మాత్రమే) ఒక ప్రశ్నావళి ప్రచురించి ఈ తప్పు సవరించుకోవటం ఉత్తమం! ఏమంటారు?

—యస్. యం. బాషా, యం. యస్. రావు (శ్రీకాకుళం రోడ్డు)

వేచివుండండి.

* * *

8—3—61 వ తేదీగల ఆంధ్ర సచిత్ర వార పత్రికయందు కొంగ్రొత్తగా ప్రవేశపెట్టిన "మగవారికి మాత్రమే" అనే శీర్షిక నన్నెంతగానో ఆకర్షించింది. నిజానికి పత్రికకు క్రొత్త అందాన్నిచ్చింది. పేరుకుమాత్రమే ఆ శీర్షిక "మగవారికి మాత్రమే." నిజానికి ఆడవారికి కూడా లాభదాయకంగా ఉంది. ప్రతి యువకుడు మనస్సాక్షిగా చూచుకుంటే తమ తమ భార్యలకు ఎంతవరకు న్యాయం చేకూరుస్తున్నామనేది ఋజువు కాగలదు. ఇటువంటి శీర్షికను పత్రిక ద్వారా ఆంధ్ర ప్రజానికానికి అందించిన రచయితలకు నా ధన్యవాదాలు.

సి. హెచ్. గోవర్ధనరావు (మచిలీపట్నం)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 29

29-3-61
బుధవారం

ప్లవసంవత్సర చైత్ర శుద్ధ ద్వాదశి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి,
మదరాసు-1.


విషయానుక్రమణిక

ముఖచిత్రం: ఎన్. టి. రామారావు.

రచయితలకు విజ్ఞప్తి

"ఆంధ్ర సచిత్ర వారపత్రిక" ప్రతి సంచికను సర్వాంగసుందరంగా అలంకరించి పాఠకులకు అందజేయాలని మా సంకల్పం. ఇందుకు రచయితల సంపూర్ణ సహకారం అర్థిస్తున్నాం. రచయితలు తమ కథానికలను, వ్యాసాలను, ఇతర రచనలను పంపేటప్పుడు "సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, మద్రాసు-1" అని స్పష్టంగా వ్రాయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

సంపాదకుడు.




★

ముఖచిత్రం వ్యాసం

ఈ వారం ముఖచిత్రం కథను 13 వ పేజీలో చూడండి.

★



రోజల్లా సర్వ పరిశుభ్రత కోసం

ఆకర్షణీయమైన సువాసన, ఎహామెత్తని పొడి-మరే టాయిలెట్ పౌడరులోనూ లేనట్టి-చమట దుర్గంధమును, చర్మవ్యాధులను గలిగించు క్రిములను నిర్మూలించే లోకప్రసిద్ధయిన జి-11* వీటిని గలిగియున్నప్పటికి గోద్రెజ్ సింథాల్ టాయిలెట్ పౌడరు ఎక్కువ ఖరీదేమీ లేదు.

స్నానానంతరముగాని, క్షౌరానంతరముగాని, గోద్రెజ్ టాయిలెట్ పౌడరును చల్లుకుంటే మీరు చాలా ఉత్సాహముగాను, ఎక్కడకు వెళ్లినా ఆదరణీయంగాను వుంటారు.

బట్టల మీద చల్లితే చర్మ ఉష్ణమును నిరోధించును.

ఉక్కపోతనుండి చిలకడైన శీఘ్ర విముక్తి గలిగించి, చెమట వల్ల చర్మము రేగుటను పోగొట్టును. ఇది పసిబిడ్డలకు వరప్రసాదము!



సంపూర్ణ రక్షణకు సింథాల్ తో స్నానము చేసిన పిదప వాడండి.

* "జి-11 ఏమిటి?" అనే ఉచిత సచిత్ర పుస్తకము కోసం గోద్రెజ్, బొంబాయి-12 కు వ్రాయండి.

గోద్రెజ్

సింథాల్

టాయిలెట్ పౌడరు


హైదరాబాదులో ఇటీవల అఖిల భారత పశుప్రదర్శనం జరిగింది. అయితే దెబ్బ తిన్న మన గిత్తనెట్లా ప్రదర్శించడం?
ఆంధ్ర కాంగ్రెస్
ప్రథమ ప్రణాళిక మొదలు బరువు తగ్గిపోతోంది. మూడో ప్రణాళిక అయ్యేనాటికి బరువుతోపాటు నేనూ కరువైతే?
కన్నబిడ్డకు దిక్కులేదు. పరాయి వాళ్ల గొడవ కూడానా? ఇదేం అన్యాయం!
వివేచన
దేశీయ సమస్యలు
కాంగో
OOMMEN

లావోస్ సమస్య

నేడు లావోస్‌లోని అస్థిరమైన పరిస్థితి 1960 ఆగస్టులో ప్రారంభమయింది. లావోస్ రాజు సిసావాంగ్ అంతకు కొన్ని నెలల ముందే చనిపోయినా దహనక్రియకు కావలసిన కొయ్య దొరకకపోవడంచేత భూస్థాపితం చేయకుండా భద్రపరిచారు.

ముఖ్యమంత్రి తియావోసామాసింతు ఈ సందర్భంలో వియంటియాన్ నుంచి లువాంగ్ ప్రబాంగ్‌కు విమానంలో వెళ్లాడు. ఆ సమయంలో కాంగ్‌లె అనే ఒక చిన్న సైనికాధికారి ప్రభుత్వానికి ఎదురు తిరిగి స్వంత ప్రభుత్వ స్థాపనకు నిర్ణయించి ప్రకటించాడు. ఈ కాంగ్‌లె అంతవరకు పశ్చిమ బలాలకు అణచడానికి నియమింపబడ్డ సైన్యంలో అధికారిగా ఉన్నాడు. అంతర్యుద్ధం దేశానికి క్షేమకరం కాదనీ, అప్పటి వరకూ ఉన్న ప్రభుత్వపు విధానం దానికి దారితీస్తున్నదని వెంటనే ఈ ప్రభుత్వాన్ని తొలగించి పాథెట్ లావ్‌తో సంధి చేసుకుంటే గాని శాంతి ఏర్పడదని కాంగ్‌లె అన్నాడు.

అప్పటికి లావోస్‌లో 125 మంది పని చేస్తున్న అమెరికన్ సైనికుల శిక్షణ దళం ఒకటి ఉంటే దానిని దేశంనుంచి వెళ్లగొట్టాలని కాంగ్‌లె కోరాడు. కాని వియంటియాన్ తప్ప మరెక్కడా కాంగ్‌లె బలంగా లేకపోవడంవల్ల ఈ మాటన మాటనగానే ఉండిపోయింది.

లువాంగ్ ప్రబాంగ్‌లోని సైన్యమంతా ప్రధాన మంత్రి సోమాసింత్ పక్షమే ఉండిపోయింది. అందుచేత కాంగ్‌లె ప్రభుత్వం దేశాన్ని వశపరచుకోలేదు. ఇంతలో కాంగ్‌లె సువన్నఫూమా ప్రధాన మంత్రిగా క్రొత్త ప్రభుత్వాన్ని ఏర్పరచాలన్నాడు. అమెరికాకు ఇది నచ్చలేదు. దీనికి కారణం సువన్నఫూమా తటస్థ విధానాన్ని అవలంబిస్తాడన్న భయమే. ఈ పరిస్థితులలో ప్రభుత్వం పడిపోవడం అంత ఆశ్చర్యకరమైన విషయం కాదు. సువన్నఫూమా నాయకత్వాన ఒక క్రొత్త మంత్రివర్గం ఏర్పడింది. కాని దీనికి లావోస్ రాజు సావంగ్‌వత్తనా సుముఖంగా లేకపోవడమే కాక సైన్యంలో చాలా భాగం ఎదురు తిరిగారు.

సువన్నఫూమా కాంగ్‌లె ఇద్దరూ పాథెట్‌లావ్ వర్గాలకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వాలని మొదటి నుంచీ చెప్తూ వస్తున్నారు. వీరికి ప్రతిపక్షంగా ఉన్న వారిలో ప్రముఖుడు ఫూమీ నోసవాన్. ఇతని నాయకత్వం క్రింద ఒక 'కమిటీ' ఏర్పడి దక్షిణంవైపు నున్న సవన్నాఖేట్ నగరాన్ని వశపరచుకున్నది.


ఈ యుద్ధం తర్వాత ఫూమా పాథెట్‌లావ్ వారిని వెంటనే ప్రభుత్వంలోకి తీసుకురాను ప్రకటించాడు. అంతేకాక, కావలసి అవసరమైతే పాథెట్‌లావ్ వర్గానికి మంత్రివర్గంలో స్థానం ఇవ్వగలనన్నాడు. నోసవాన్‌ను సైన్యాధిపతిగా చేస్తానని కూడా అన్నాడు. కాని ఫూమీ నోసవాన్ వీటికి దేనికీ ఒప్పుకోలేదు.

సెప్టెంబర్ నెలలో మరొక క్రొత్త పరిణామ మేర్పడింది. సవన్నాఖేట్ నగరానికి చెందిన బౌన్‌వూమ్ అనే ఒక మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ తను ఫూమాకు ఎదురుగా నిలుస్తున్నానని రేడియో ద్వారా ప్రకటించాడు. ఫూమా తన అలవాటు ప్రకారం బౌన్‌వూమ్‌తో కూడా సంప్రదించటం ప్రారంభించాడు. కాని దేశంలోని అల్లరి తగ్గలేదు. పాథెట్‌లావ్ సైన్యాలు లావోస్ ఉత్తరం వైపున్న సామ్‌నువా నగరాన్ని ముట్టడించడానికి సిద్ధమయ్యారు. ఈ అంతర్యుద్ధంవల్ల బలపడేది పాథెట్‌లావ్ తప్ప ఎవరూ కారని 'సీటో' రాజ్యాలు (Seato) నిశ్చయించి ఫూమీ, సువన్నఫూమాల మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నాలు చేశారు. మొదట ఫూమీ నోసవాన్ రాజీకి ఒప్పుకోలేదు. కాని అమెరికా సహాయమంతా సువన్నఫూమాకు పోవడం చూసి సరే నన్నాడు. (అమెరికా ద్రవ్య సహాయం ప్రభుత్వ పక్షానికే వెళ్లాలనే ఒక నియమం. దానికి కారణమని 'టైమ్స్' పత్రిక వ్రాసింది. దానికి తోడు కాంగ్‌లె సేనలు ఫూమీ సేనలను ఒకసారి సునాయాసంగా ఓడించ గలిగింది). ఇప్పటి జరిగిన వారంలో అమెరికా ద్రవ్య సహాయాన్ని కూడా నిలిపివేసింది.

అక్టోబర్ రెండవవారంలో అమెరికా ఉప రాజ్యాంగ కార్యదర్శి పార్సన్స్, రష్యా రాయబారి అబ్రమోవ్ ఇద్దరూ లావోస్‌కు వెళ్లారు. (కాంగ్‌లె అబ్రమోవ్‌కు స్వాగత మిచ్చాడు కాని పార్సన్స్‌ను కలుసుకోవడానికి విమానాశ్రయానికి కూడా ముఖ్యాధికారు లెవరూ రాలేదు.) మొదట అబ్రమోవ్‌కు ఘనస్వాగతం లభించినా పై వారం అమెరికా వద్ద నుంచి సహాయం రాగానే వస్తే ఫూమా, వత్తనా ఇద్దరూ అబ్రమోవ్ పట్ల విముఖత్వం చూపారు. ఈ సహాయం కేవలం సైనికుల జీతాలకు కావలసి వచ్చింద కాబట్టి అమెరికా అయిష్టంగానే ఒప్పుకున్నది.

డిసెంబర్ వరకూ పెద్ద మార్పు ఏమీ రాలేదు. కాని వివిధ పక్షాల మధ్య తీవ్రమైన పోట్లాటలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నెలలోనే కుప్రాసిత్ అభై అనే సైనికాధికారి కాంగ్‌లెతో యుద్ధానికి సన్నద్ధు డవటంతో సువన్నఫూమా కాంబోడియాకు పారిపోయాడు.

ఆతని స్థానే జనరల్ సోంఫానీ నస్సవాంగ్ అనే అధికారి ఒక "మిలిటరీ ప్రభుత్వాన్ని" తాత్కాలికంగా ఏర్పరచారు. ఫూమా పారిపోయినప్పటికీ దేశంలో అస్థిరత్వం అధికమయింది. వియంటియాన్‌లోనే కాక తక్కిన ప్రాంతాల్లో కూడా చిన్న చిన్న యుద్ధాలు జరగటం మొదలు పెట్టాయి. చివరకు కాంగ్‌లె వెనక్కు తగ్గవలసి వచ్చింది. ప్రధాన మంత్రి అయిన బౌన్‌వూమ్ అమెరికాను ద్రవ్య సహాయం కోరాడు. ఇది వెంటనే లభించింది. కాంగ్‌లె [illegible] గెరిల్లా దళాలలో కలిసిపోయాడు.



లావోస్

- లావోస్ వైశాల్యం 90,000 చదరపు మైళ్లు.
- లావోస్ జనాభా సుమారు 20 లక్షలు.
- లావోస్ సైన్యబలం 28,000.
- లావోస్ కంతా 8 మైళ్ల రోడ్డు మాత్రమే ఉన్నది.
- లావోస్‌కు అమెరికా 1955 నుంచి చేసిన సహాయం సుమారు 150 కోట్ల రూపాయలు.
- లావోస్‌లో ఏవిధమైన పరిశ్రమలూ లేవు.
- లావోస్ ప్రజలు బౌద్ధులు.




వ త్తనా మహారాజ

లావోస్ పైన దండు ఎత్తాయని ఒక ఫ్రెంచి రేడియో వార్త ప్రకటించింది. కాని ఇది కేవలం పుకారు మాత్రమే నని అందరూ గ్రహించారు.

ఇంతలో కాంగ్‌లె సైన్యాలు మళ్లీ దక్షిణం వైపుకు చొచ్చుకురాసాగాయి. బౌన్‌ఉమ్ ఈ సందర్భంలోనే రాజీకి ఒప్పుకుంటానని ప్రకటించాడు. పాథెట్‌లావ్ నాయకుడు సుఫన్నవోంగ్ అమెరికా థాయ్‌లాండ్‌లు దేశాన్ని వదిలి తీరాలనే షరతు పెట్టాడు.

కాంబోడియారాజు లావోస్ అన్ని ఒప్పందాలనూ వదులుకుని ఒక తటస్థ ప్రదేశంగా ఏర్పడాలని సూచించారు. బ్రిటన్ ఒక 'సమీక్ష సంఘం' ఏర్పరచాలని ప్రతిపాదించింది.


జనవరి 19 వ తేదీన శ్రీ నెహ్రూ 'అంతర్జాతీయ కమిషన్' లో భారతదేశం 'మెంబర్' గా ఉండాలంటే రష్యా కోరికపైనే జరగాలని అన్నారు. (జెనీవా సమావేశానికి రష్యా సహాధ్యక్ష స్థానం వహించింది కాబట్టి అమెరికా మొదటినుంచీ లావోస్ ... ంగా ... ఉం.



ఫూమీ నోసవాన్

అప్పటికే రష్యా, అమెరికాలు రెండూ ఒక్కొక్కరు ఒక పక్షానికి విరివిగా ఆయుధాలను ఇస్తూ ఉన్నారు ఇది మరొక కొరియాగా మారుతుందన్న భయంతో బ్రిటన్ మొదలైన దేశాలు వెంటనే పోరాటాలు ఆపాలని కోరారు. వెంటనే అంతర్జాతీయమైన కమీషన్‌ను మళ్లీ ఏర్పరచి అన్ని పక్షాల వారినీ కలిపి ఒక ఐక్య మంత్రివర్గం ఏర్పరచాలని సూచించారు. రష్యా దానికి సమ్మతించింది కాని, అమెరికా ఒప్పుకోలేదు. దేశం కమ్యూనిస్టుల స్వాధీన మవుతుందని వీరి భయం

ఇండో చైనాను ఒకప్పుడు పరిపాలించిన ఫ్రాన్సు కూడా లావోస్ వ్యవహారాలలో జోక్యం చేసుకొనడం ప్రారంభించింది వియట్‌మిన్ దళాలు



సువన్న ఫౌమా

లావోస్: ఇండో-చైనా

లావోస్ జనసంఖ్య సుమారు మద్రాసు పట్టణమంత ఉంటుంది. వైశాల్యం 90,000 చదరపుమైళ్లు. అంటే, కాంగో కన్నా అరవై డెబ్బైరెట్లు చిన్నదన్నమాట. అయినప్పటికీ ఇంచుమించు కాంగో వ్యవహారాలకు లభించే ప్రాముఖ్యం ఈ దేశంలోని అల్లర్లకు కూడా లభిస్తోంది వార్తాపత్రికలలో. దీనికి కారణం, లావోస్ రాజకీయాలకూ చుట్టూ ఉన్న దేశాల రాజకీయాలకూ గల సంబంధమే నని చెప్పవచ్చును.

1893 లో లావోస్ ఫ్రెంచివారి అధీనంలోకి వచ్చింది. వలసరాజ్య మనకపోయినా 'ప్రొటెక్టరేట్' పేరు పెట్టి ఫ్రెంచివారు దీనిని పరిపాలిస్తూ వచ్చారు. 1949 లో 'ఫ్రెంచి యూనియన్'లో భాగమై పోయింది. కాని లావోస్‌లో స్వాతంత్ర్యోద్యమాలు లేకపోలేదు.

'లావ్ ఇస్సారల్' అనే పేరుతో ఒక ఉద్యమం 1940 లో బయలుదేరడమే కాక రెండవ ప్రపంచ యుద్ధంలో జపానువారీ ప్రదేశాన్ని ఆక్రమించినప్పుడు 'లావ్ ఇస్సారల్' ఒక ప్రభుత్వాన్ని కూడ ఏర్పరిచింది. ఈ లావ్ ఇస్సారల్ ఉద్యమంలో ప్రముఖులు, పెడోసారన్ సువన్నఫౌమా, సుఫాన్‌వాంగ్ అనేవారు ముగ్గురు. యుద్ధానంతరం ఫ్రెంచివారు మళ్లీ అధికారంలోకి రాగానే వీరు ముగ్గురూ పారిపోవలసి వచ్చింది.

ఇండో— చైనాలోని స్వాతంత్ర్యోద్యమంలో ముఖ్యమైనది వియట్‌మిన్. దీని నాయకుడే కమ్యూనిస్టుపార్టీ నాయకుడు హోచిమిన్. ఫ్రెంచివారు 1949 లో వియట్‌నామ్ అనే దేశాన్ని సృష్టించి ఈ వియట్‌మిన్ ప్రభావాన్ని తగ్గించ



కాంగ్‌లీ

అందువల్ల ఏవిధమైన సూచననూ ఎవరూ అవలంబించే అవకాశం కనుపించలేదు వత్తనా కూడా చివరకు లావోస్‌కు మూడు రాజ్యాల ఆధ్వర్యం క్రింద కమిషన్ ఒకటి ఏర్పడవచ్చునని అన్నారు. పాథెట్‌లావ్ దానికి అసలు సమ్మతించలేదు. ఈ పరిస్థితిలో సువన్నఫౌమా పాథెట్‌లావ్ పక్షంతో సంప్రదించడానికని లావోస్‌కు వెళ్లి, కాంగ్‌లెతో కలిసి ఉన్నట్లు తెలిసింది. నిర్బంధాలేమీ లేనంత సేపూ ఎవరు సహాయం చేసినా స్వీకరించడానికి తమ సంసిద్ధతను తెలిపారు.

భారత జాతీయ గ్రంథ వివరణముల పట్టీ

భారత జాతీయ గ్రంథ వివరముల పట్టీ ఇటీవల ఇండియాలో ప్రచురించిన గ్రంథములకు అధికారపూర్వకమైన పత్రము

ఇండియాలో ఇంగ్లీషు, మరియు యీ క్రింది భాషలలో ప్రచురింపబడిన గ్రంథముల పూర్తిపట్టి చరిత్రలో మొట్టమొదటిసారిగా, రోమన్ అక్షరములలో లభించుచున్నది.

అస్సామీ, బెంగాలీ, గుజరాతి, హిందీ, కన్నడ, మలయాలం, మరాటి, ఒరియ, పంజాబి, సంస్కృతము, తమిళము, తెలుగు, ఉర్దూ.

పంచవర్ష ప్రణాళికల కాలములందు అనేక ముఖ్యప్రభుత్వ ప్రచురణలు వెలువడినవి. ఇవి ఎకనమిక్స్,పాలిటిక్స్,సోషియాలజీ విద్యార్థులకు మిక్కిలిముఖ్యమైన మూలగ్రంథాలు.ఇవన్నీ యుకూడా పైగ్రంథాలపట్టీలో చేర్చబడియున్నవి.

పుస్తక పరిమాణము : డెమ్మిక్వార్టో $8\frac{3}{4}'' \times 11\frac{1}{4}''$ ప్రింటుభాగం$6\text{-}5/6'' \times 9''$

ప్రచురణ వివరము : మూడునెలల కొకమారున సాలుకు నాలుగు ప్రచురణలు మరియు ఒక వార్షిక సంపుటి.

ధర : వార్షిక సంపుటి కాపీ 1 టికి,రు 50 పోస్టేజీ ప్రత్యేకం మూడునెలలసంపుటి కాపీ 1టికి రు15-50పోస్టేజిఅధనం

వెల తగ్గింపు : మూడునెలల సంపుటములు ఒకొకటి ప్రతికి కనీసము 6 ప్రతులున్నూ, వార్షిక సంపుటి ఒక్కటికి కనీసము 3 ప్రతులున్నూ ఒక దఫా కొన్నవారికి 15%రేటుతగ్గును

లభ్యమయ్యేవివరాలు : మొదటి సంపుటి ప్రచురింపబడినది 1957-అక్టోబరు-డిసెంబరు.ముందు కాపీలన్నీ యుచందాధరలకివ్వబడును

లభించు ప్రదేశము : గవర్నమెంటు ఆఫ్ ఇండియా, సెంట్రల్ రెఫరెన్సు లైబ్రరీ, C/o నేషనల్ లైబ్రరీ,బెల్వడీర్,కలకత్తా-27

కొన్ని అభిప్రాయములు :

'భారతజాతీయగ్రంథ వివరముల పట్టీ, ప్రపంచగ్రంథవివరణములపట్టీకి స్వతంత్రభారత్ సమర్పించు ప్రథమకానుక'
ప్రొఫెసర్ హుమయూన్ కబీర్,
జులై 9, 1958.

'భారత జాతీయ గ్రంథ వివరణ పట్టీకి, మా హృదయపూర్వక అభినందనలు! ఇది అద్భుత కార్యసాధనము. మనమంతా గర్వింపదగినది.'
ఎఫ్. సి. ఫ్రాన్సిస్, సి.బి.డైరెక్టర్, బ్రిటిష్ మ్యూసియమ్,ఆగస్టు 26, 1958

'ఎంత అద్భుత కార్యము చేసియున్నారు!...ఇంత గొప్ప కార్యము ఆలోచించి చేసినందుకు ప్రతిఒక్కరు అభినందనీయులు'
ఎ. జె. వెల్స్, జనరల్ ఎడిటర్, ది బ్రిటిష్ నేషనల్ బిబ్లియాగ్రఫీ, అక్టోబరు 8, 1958.

'...భారతజాతీయగ్రంథ వివరణముల పట్టీ, ప్రశస్తమైన జాతీయగ్రంథ వివరణములపట్టీల స్థాయినందుకొనును.
పి. ఎం. బొగచెవ్, డైరెక్టర్, లెనిన్ స్టేట్ లైబ్రరీ, మాస్కో సెంటర్, యు.ఎస్.ఎస్.ఆర్. నవంబరు6, 1958

'ఈ గొప్ప కార్యము సర్వస్వతంత్రమైనది - ప్రతిభావంతంగా చేయబడినది - పన్నెండుభాషల ప్రశస్త గ్రంథముల పట్టీప్రచురించినందుకు యీ పట్టీ ప్రకటనకర్తలకువిద్యావేత్తలుఋణపడివుండగలరు.
ది స్టేట్స్‌మేన్, కలకత్తా. ఆగస్టు 24, 1958.

'...ఐ.ఎన్.బి. కమిటీయు - జనరల్ ఎడిటరున్నూ-ఒక గొప్ప విలువైన ఘన కార్యమును విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందనీయులు.'
ఎస్. సి. సుట్టన్, ది జర్నల్ ఆఫ్ డాకుమెంటేషన్ వాల్యూమ్ 15, నెం. 3, సెప్టెంబరు 1959.

'భారతజాతీయగ్రంథవివరణముల పట్టీ వెలువడుట...ఒక గొప్ప కార్యము సాధించినట్లే. 14 భాషలనుండి సేకరించి అనువదించి, కూర్చి, ప్రచురించుట, మిక్కిలి చిక్కులతోకూడినపని. కానీ విజయవంతంగా సాధింపబడింది. ఇట్టి చిక్కులలో తగులుకొనివున్న యితర దేశములవారు కలకత్తాలోని అనుభవములను తెలుసుకొనుట మంచిది.'
ఫ్రాంక్ ఎం. గార్డనర్, యు.ఎన్.ఇ.ఎస్. సి.ఒ. లైబ్రరీస్ బులిటెన్ వాల్యూము XIV, నెం. 4, జులై-ఆగస్టు, 1960.

DA 60-752

డానికి ప్రయత్నించి విఫలు లయ్యారు. ఆ సందర్భంలో వియత్‌నామ్‌కు అధిపతిగా బావ్‌డాయ్ అని తమ చెప్పు చేతలలో నున్న ఒకతనిని నియమించి లావోస్, కంబోడియాలు వియట్‌నామ్‌తోబాటు ఫ్రెంచి యూనియన్‌లో ఉండేటట్లు ఏర్పాటు చేశారు. ఇది ఎవరికీ సంతృప్తికరంగా లేదన్న విషయం చరిత్రాంశాలలో ఒకటి. వియట్‌నామ్, వియట్‌మిన్ కలహాలు అట్లా ఉండగా లావోస్‌లో (1949 లో) సువన్న ఫౌమా క్రింద ఒక ప్రభుత్వము ఏర్పడింది. ఆ సందర్భంలో లావ్ ఇస్సారల్‌లో అభిప్రాయ భేదాలు వచ్చి చీలికలు ఏర్పడ్డాయి. సువన్నఫౌమా సవతితమ్ముడైన సుఫానువాంగ్ వైపు పార్టీకి పథెట్‌లావ్ అనే పేరు పెట్టారు.

ఈ పథెట్‌లావ్ వియట్‌మిన్‌తో సంబంధాలు ఏర్పరచుకుని లావోస్‌లోని ప్రభుత్వాన్ని పడగొట్టేటందుకు ప్రయత్నిస్తూ ఉన్నది.

ఇండోచైనా—అంటే వియట్‌మిన్, వియట్‌నామ్‌లు—లోని అంతర్యుద్ధాలు జెనివా సమావేశంతో కొంచెం తగ్గాయి. అప్పుడు జరిగిన ఒప్పందాలలో లావోస్ ఉత్తరం వైపున్న రెండు జిల్లాలు పథెట్‌లావ్‌కు వెళ్ళేట్లుగా తీర్మానించారు (వీటి పేర్లు—ఫాంగ్‌సాలీ, సాయ్‌నీయా.)

అక్టోబరు 1957 వరకూ సువన్నఫౌమా ప్రభుత్వానికీ, పథెట్‌లావ్‌కీ పడ లేదు గాని ఆ నెలలో ఎలాగో సంధి చేసుకున్నారు నవంబరులో పథెట్‌లావ్ వారికి మంత్రివర్గంలో స్థానాలు లభించాయి.

అప్పటినుంచి పోయిన సంవత్సరం ఆగస్టు వరకూ లావోస్ పరిస్థితి కొంచెం స్థిమితంగానే ఉండేది. అమెరికా కావలసినంత ద్రవ్యం సహాయం చేయడంవల్ల ఆర్థికంగా 'త్రోసుకు' రాగలిగింది కాని లావోస్ చాల బీద దేశం. దేశానికంతా ఒకటే ఒక్క రైలుస్టేషన్ ఉన్నది—రైలుబండి కాని, పట్టాలు గాని లేవు. ఉన్న ఎనిమిది మైళ్ల సిమెంటు రోడ్డు ఒక మాజీమంత్రి టెన్నిస్ కోర్టు నానుకొని ఉందని ప్రతీతి. ★


సెన్సస్ ఉద్యోగి-మీ పేరు?

పెద్దమనిషి-దశరథుడు.

సె. ఉ-మీకు పిల్లలు ఎంత మంది?

పె. మ.- దశరథునికి పిల్లలు ఎందరో కూడా తెలియకపోతే ఈ ఉద్యోగం ఎందుకయ్యా?

ఎస్. శ్రీనివాసరావు (హైదరాబాదు)



అమెరికా విమాన బలానికి చెందిన గ్లోబ్ మాస్టర్ విమానంలో ఐక్యరాజ్యసమితి పక్షాన కాంగోలో శాంతి భద్రతలరక్షణకు ఈ నెల రెండవ వారంలో ఢిల్లీనుంచి వెళ్ళిన భారత పదాతి సైనికులు.

న్యూ ఢిల్లీ లేఖ — **శ్రీ కృష్ణ**

పార్లమెంటు కాంగ్రెసుపార్టీ ఉపనాయకపదవి కోసం కీచులాట: ఢిల్లీలో మశూచి ఉపద్రవం

ఇకనేం అప్పుడే కీచులాట ప్రారంభమైంది! స్వర్గీయ పండితపంత్ స్థానంలో కాంగ్రెస్‌పార్టీ ఉపనాయకుడుగా ఎవరు ఉండాలన్న సమస్య ఈ కీచులాటకు దారితీసింది అన్నీ మామూలుగానే జరిగిపోతే ఈ పదవికి శ్రీ మొరార్జీ దేశాయ్ ఎన్నిక కావాలి బ్రిటిష్‌వారు అనుసరించే సంప్రదాయం ప్రకారం ఆర్థిక మంత్రి అంటే కాబోయే ప్రధాన మంత్రి అన్నమాట ఎవరో కొందరిని మినహాయిస్తే, బ్రిటన్‌లో ఆర్థికమంత్రులు అంతా ప్రధాన మంత్రులు అయ్యారు దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉన్నదో ప్రధాన మంత్రికి తెలిసి ఉండాలి కనుక ఇది చాలా మంచి సంప్రదాయం

మన దేశంలో ఈ సంప్రదాయం అమలులోకి రాలేదు ప్రథమ కారణం మన పరిస్థితులు పండిత నెహ్రూ ప్రధాన మంత్రి అవందే, ఆర్థిక మంత్రి అయ్యే సదుపాయం లేకపోయిందికదా అంతేకాక, 1947 నుంచి శ్రీ నెహ్రూ ప్రధాని గానే ఉంటున్నారు కనుక, ఆయన తరువాత ఎవరు అన్న ప్రశ్నే ఉదయించలేదు ఇది రెండవ కారణం. అందువల్ల కాంగ్రెసుపార్టీ అధికారుల ఎన్నిక ప్రధానంగా సంస్థలో వారికున్న హోదాను బట్టి జరిగింది కాని, కాబినెట్ మంత్రి హోదాని బట్టి జరుగలేదు. శ్రీ టి టి కృష్ణమాచారి ఆర్థిక మంత్రిగా నియుక్తు లయ్యేవరకు, ఆ పదవిలో "బయటవారు" ఉండేవారు కనుక, వారు ఉప ప్రధాని గాని, కాంగ్రెసుపార్టీ ఉపనాయకుడుగాని అయ్యే వీలు లేకపోయింది. కాంగ్రెసు సంస్థలో

శ్రీ కృష్ణమాచారి చాలా జూనియర్ సభ్యుడు. అందుచేత ఆ హోదా పొందే అవకాశం కలుగలేదు. శ్రీ మొరార్జీదేశాయ్ ఆర్థిక మంత్రి అయ్యే నాటికే పండిత పంత్ పార్టీ ఉపనాయకుడుగా వ్యవహరిస్తున్నారు.

ఇంతకుమునుపే చెప్పినట్లు కాంగ్రెసు అధికారుల ఎన్నిక పార్టీలో వారికి గల ప్రతిష ననుసరించి జరిగింది. సర్దార్ పటేల్ దేశీయ వ్యవహారాల మంత్రిగా ఉన్నా ఉపప్రధాని అయ్యారు. వారు మరణించడంతో ఉపప్రధాని పదవే రద్దు అయింది. సర్దార్ పటేల్ అనంతరం మౌలానా ఆజాద్ కాంగ్రెసుపార్టీ ఉపనాయకు డయ్యారు. వారి తరువాత పండిత పంత్ ఆ పదవికి ఎన్నికయ్యారు. అనేక కారణాలను పురస్కరించుకొని ఈ ఎన్నిక జరిగింది. ప్రథమ కారణం పండిత పంత్ శ్రీ మొరార్జీ కంటే వయస్సులో పెద్దవారు, కాంగ్రెస్ సంస్థలో సీనియర్ సభ్యుడు. భారత ప్రభుత్వం 1935 సంవత్సరం చట్టాన్ని అమలులోకి తెచ్చినప్పుడు పండిత పంత్ సంయుక్త పరగణాలకు (నేటి ఉత్తర ప్రదేశ్) ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు శ్రీ మొరార్జీ దేశాయ్ ప్రప్రథమంగా బొంబాయి రాష్ట్రం ఆంతరంగిక శాఖ మంత్రి పదవిని నిర్వహించారు కేంద్ర మంత్రి వర్గంలో కూడా శ్రీ మొరార్జీ పండిత పంత్ కంటె జూనియర్. ఇంతవరకు ఉపనాయకులుగా వ్యవహరించినవారు ముగ్గురు. వీరిలో సర్దార్ పటేల్, పండిత పంత్ దేశీయ వ్యవహారాల శాఖ మంత్రులుగా పనిచేశారు. మూడవ వ్యక్తి విద్యా మంత్రి మౌలానా ఆజాద్. ఇకనైనా పార్టీ ఉపనాయకుడుగా ఎల్లప్పుడూ ఆర్థిక మంత్రినే ఎన్నుకునే సంప్రదాయాన్ని అమలు జరుపుకోవలసిన సమయం ఆసన్నమైనదా ? లేదా ? అనే సమస్యను పరిశీలించాలి.

కులతత్వాన్ని నిర్మూలించి, వర్గరహితమైన సమాజాన్ని నెలకొల్పాలని కాంగ్రెసు పార్టీ కంకణం కట్టుకున్నప్పటికీ, బ్రిటిష్‌వారి హయాంలోకంటే ఈనాడు ప్రాంతీయ దురభిమానం, కులతత్వం బాగా వ్రేళ్లు తన్ని, పాతుకుపోయాయి. హిందీ భాష పేరుతో, కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బీహార్, ఉత్తరప్రదేశ్ కంటే కూడా అధికంగా ప్రాకులాడుతోంది. కాంగ్రెసు అధికారులు ఎన్నికయ్యారు గాని, ఎవరిచేత నియమింపబడినవారు కాదని అంటున్నారు. శ్రీ జగ్జీవన్‌రాం 1946 నుంచి కేంద్ర మంత్రిగా ఉంటున్నారనీ, పార్టీకి సంబంధించినంతవరకూ శ్రీ నెహ్రూ ఎంత సీనియరో, ఆయన కూడా అంత సీనియరేననీ వాదిస్తున్నారు. శ్రీ జగ్జీవన్‌రామ్‌కు నిమ్నజాతులవారి 140 ఓట్లు భద్రంగా దక్కుతాయి. వీటికి తోడు బీహారీ—హిందీ వాదుల మద్దతుతో ఏ అభ్యర్థినైనా ఆయన ఓడించగలరు. ద్విసభ్య నియోజక వర్గాలను రద్దు చేయటంతో కాంగ్రెసుపార్టీ మళ్లీ మతం ప్రాతిపదికగా కల నియోజకవర్గాలను ప్రవేశపెట్టింది. ఈ విషయంమీదనే మహాత్మాగాంధి తమ జీవితాన్ని ఒడ్డడానికి సిద్ధపడ్డారని జ్ఞాపకం చేయటం అప్రస్తుతం కాదు. నిమ్నజాతులవారు హిందువులే నని, వారికోసం ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయరాదనీ మహాత్మాజీ వాదించినందువల్లనే గాంధి—అంబేద్కర్ ఒప్పందంమీద సంతకాలు జరిగాయి.

దేశంలో కులతత్వాన్ని రెచ్చగొట్టారని బ్రిటిష్ వారిని నిందించాం. కాని వారుకూడా ఉద్యోగుల ప్రమోషన్ విషయంలో కులతత్వాన్ని ప్రవేశపెట్టేందుకు నిరాకరించారు. ఇప్పుడు శ్రీ నెహ్రూ అనుమతితో శ్రీ జగ్జీవన్‌రామ్ ప్రమోషన్లలో కుల ప్రాతినిధ్యం ప్రవేశపెట్టారు. వీరి నిర్ణయం మద్రాసు హైకోర్టులో సవాలు చేయబడింది. ప్రభుత్వం ఓడిపోయింది. ఇప్పుడు మద్రాసు హైకోర్టు తీర్పును త్రోసిపుచ్చవలసిందని కోరుతూ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దరఖాస్తు పెట్టుకున్నది. శ్రీ జగ్జీవన్‌రామ్ తాము మరింత బలపడటానికి యింకా ఏమేమి పనులు చేస్తున్నారో, ఆయన కేంద్రం నుంచి తప్పుకున్న తరువాత గాని తెలియవు. ఉదాహరణకు రైల్వేలను ఆయన హరిజనులమయం చేశారు. ఈ పెద్దమనిషినే కాంగ్రెస్ పార్టీ ఉపనాయకుడుగా ఎన్నుకోవాలని ఇప్పుడు ప్రచారం జరుగుతోంది. అయితే శ్రీ మొరార్జీదేశాయ్ మాత్రం ఈ కీచులాటలో ప్రవేశించరని లాబీ వర్గాలద్వారా తెలుస్తోంది. పోటీలేకుండా తమను ఎన్నుకుంటేనే ఆయన ఆ పదవిని స్వీకరిస్తారట.

శ్రీ నెహ్రూ తమ ఆక్స్‌ఫర్డ్ ఉపన్యాసంలో సూచించినట్టుగా, నిర్ణయాలు చేయటంలో వారికి నమ్మకంలేదు. మౌలానా ఆజాద్ మరణించిన తరువాత ఆరు నెలలకు గాని పండిత పంత్ కాంగ్రెసుపార్టీ ఉపనాయకుడు కాలేదు. ఇప్పుడు కొత్త పార్లమెంటు ఏర్పడిన తరువాత గాని, ఉపనాయకుని ఎన్నిక జరుగకపోవచ్చు. అట్లా కాకపోతే, ఉపప్రధాని పదవి రద్దు అయినట్లుగానే, ఉపనాయకుని పదవి కూడా రద్దు కావచ్చు.

కీచులాటకు స్థానం కల్పించిన రంగం ఇది ఒక్కటే కాదు. వాణిజ్య, పరిశ్రమల శాఖలో కూడా ఇలాంటి కీచులాటే సాగుతోంది శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి దేశీయ వ్యవహారాల శాఖ మంత్రిగానే ఉండిపోతే, వాణిజ్య పరిశ్రమలు శాఖలో ఖాళీ ఏర్పడుతుంది. కాబినెట్ మంత్రులను మార్చకుండా ప్రస్తుతం ఆ శాఖలో సహాయ మంత్రులుగా ఉన్నవారిని వాణిజ్య పరిశ్రమల మంత్రులుగా చేస్తే సరిపోతుందని కొందరు సూచిస్తున్నారు. లాబీలోని మంరొక వర్గంవారు, సర్దార్ స్వరణ్ సింగ్ వాణిజ్య, పరిశ్రమల శాఖకు బదిలీ అవుతారని, పండిత మాలవియ సర్దార్ స్వరణ్ సింగ్ స్థానంలో కాబినెట్ మంత్రిగా నియుక్తులవుతారనీ వూహాగానం చేస్తున్నారు.

సేవ, సమర్థత ఈనాటి ఆశయాలు కావు. పరిస్థితులు యిలా ఉన్నాయి కాబట్టి మిగతా సహాయ మంత్రులు కూడా, కాబినెట్ మంత్రులయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, కాబినెట్ మంత్రి కావాలని ఉవ్విళ్లూరుతున్నారు. శ్రీ గోపాలరెడ్డి, శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి స్థానంలో వాణిజ్య పరిశ్రమల మంత్రి కావాలని ఆశిస్తున్నట్లు లాబీలోని వేరొక వర్గంవారు వూహిస్తున్నారు. అయితే శ్రీయుతులు మనూభాయ్‌షా, కనుంగోల మాట ఏమిటో ఎవ్వరూ చెప్పటంలేదు. శ్రీ సత్యనారాయణ సిన్హాకు ఏ శాఖ యిస్తారో కూడా తెలియలేదు.

ఇవన్నీ కూడా వూహాగానాలు మాత్రమే. నాయకుడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నారు. వారు ఢిల్లీకి తిరిగి వస్తేగాని ఏ నిర్ణయాలు జరుగవు.

* * *

తృతీయ పంచవర్ష ప్రణాళికాకాలంలో, 21 వైద్య కళాశాలలు నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు తయారు చేశాయని కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ తమ శాఖతాలూకు పార్లమెంటు ఇష్టాగోష్ఠి సలహా సంఘానికి తెలియజేశారు. అయితే రాష్ట్రాలు తమ సవరణ పథకాలను అందజేసిన తరువాత గాని, వీటి సంఖ్య ఇదమిత్థంగా తెలియదు

గ్రామసీమలమంచినీటి సరఫరా పథకాలను గూర్చి జరిగిన చర్చ సందర్భంలో ఈ పథకాలకు తృతీయ ప్రణాళికలో మరికొంత ధనం ప్రత్యేకించబడే సూచన తమకు అందినదని మంత్రి చెప్పారు

సమాజాభివృద్ధి కేంద్రాలు గ్రామాలలో అమలుచేస్తున్న ఆరోగ్య పథకాల ప్రయోజనాన్ని శంకిస్తూ కొందరు సభ్యులు విమర్శించారు. మంత్రి ఈ విమర్శలకు సమాధానం చెబుతూ, వివిధ ప్రాంతాలలో ఆరోగ్యాభివృద్ధి సంఘాలను ఏర్పాటు చేసుకోవలసిందిగా తాము ప్రజలకు సూచిస్తున్నామనీ, ఈ సంస్థలు ఏర్పడినట్లయితే పారిశుధ్యం, పరిశుభ్రత, రోగ నిరోధం మొదలైన విషయాలపై వ్యక్తులు ఇతోధికశ్రద్ధ చూపే అవకాశం కలుగుతుందనీ అన్నారు ఈ సంఘాలకు ప్రభుత్వం కూడా సహాయం చేయవచ్చు.

చౌక ధరకు లభ్యమయ్యే వైద్య గ్రంథాలను ప్రచురించే విషయాన్ని ప్రస్తావించి, ఈ విషయం ప్రస్తుతం విద్యాశాఖ పరిశీలనలో ఉన్నదనీ,సాధ్యమైనంత త్వరలో తగు చర్యలు తీసుకోవలసిందిగా ఆ శాఖను కోరుతున్నామనీ ఆరోగ్యమంత్రి తెల్పారు.

అంటువ్యాధిగా ప్రబలే నేత్రరోగ నిరోధక పథకాన్ని గూర్చి ముచ్చటిస్తూ, ఈ వ్యాధి దేశంలోని ఏఏ ప్రాంతాలలో ఎంత తీవ్రంగా ఉన్నదీ సూచించే "మ్యాప్" తయారైందని మంత్రి

(60 వ పేజీ చూడండి)

భర్త—నిన్ను కట్టుకుని రెండేళ్ళు అయింది. ఎప్పుడు చూచినా కోపంతో మండి పోతూనే ఉంటావేం?

భార్య—అదేమిటి, మీరే కదండీ చెప్పారు, కోపంగా ఉంటేనే అందంగా ఉంటానని.

ఎస్. ధర్మారావ్ (తులసివలస)

ఎవరైనా చిత్రకారుడు నందమూరి తారక రామారావు బొమ్మ వేయాలంటే రంగులూ, కుంచెలూ వలసిన కాగితం వీటితోపాటు అందం, పొందిక, నాటుతనం, హుందా, గుంభన, సౌమ్యం చేతులో వచ్చిమిర్చి పకోడీపొట్లం ఇవన్నీ తోడు వుంచుకోవాలని తెలిసిన వాళ్లంటారు

అలాగే ఎన్ టి రామారావును చిత్రించాలను కుంటే వాటితోపాటు సాత్వికత, (అన్ని వేళలాకాదు) వ్యక్తిత్వం, వ్యాపారదక్షత, సహకారం, మౌనం, కార్య శూరత్వం గాంభీర్యం, సంఘసేవ, పురాణ కథాభి మానం, నిదానమైన నటన కూడా అవసరమని చెప్పుకుంటారు

అయితే వీటన్నిటితో అతని రేఖాచిత్రమేగాని, పంచరంగుల స్ఫూర్తి చిత్రం కావాలంటే పితృ భక్తి, సోదరప్రేమ, కొత్తవాళ్లకు చేయూతనివ్వాలనే లక్ష్యం, ఆచరణ కూడా చాలా ముఖ్యమని ఎరిగిన వారు అంటారు

ఎన్ టి రామారావు మోము చందమామ వంటిది అందం వెన్నెల వంటిది అతని సాన్ని హిత్యం ఒక వెన్నెలవాడ చిరునవ్వు వెన్నెలజాలు అసలు ఎన్ టి రామారావు అనే నామ వాచకానికి నిర్వచనం కళ సందర్భాన్నిబట్టి అది నాటక కళ, వ్యాపార కళ, కథా సంవిధాన కళ, ఉపన్యాసకళ, దర్శకత్వ కళ ఇలా అనేక రకాలుగా టూకీగా మారుతూ ఉంటుంది రామారావు ఈనాడు తెలుగు తెరకు వెలుగు పొరలనదగిన చిత్రాలు ఎన్నో నిర్మిం చాడు మరెన్నింటిలోనో నటించాడు రాణించాడు





'రాజమకుటంలో'

ముఖచిత్రం కథ

నయనానంద తారక రామారావు

వేటి మేటి నటుల్లో దీటుగా నిలిచి 'భళీ' అని పించుకున్నాడు

నందమూరి తారక రామారావు జననం కృష్ణా తీరంలో — గుడివాడ తాలూకా నిమ్మకూరులో చదువు సంధ్యలు అవీ బెజవాడలో, కాని ఎన్ టి రామారావు జన్మించింది మాత్రం బెజవాడ ఎస్ ఆర్ ఆర్ కళాశాల రంగస్థలంమీద 'రాచమల్లుని యుద్ధ శాసనం' అనే నాటకం అతని జన్మ నక్షత్రం ఈ నాటక రచయిత కవి సామ్రాట్ విశ్వ నాథ సత్యనారాయణ

ఆనాటినుండీ, తరువాత గుంటూరుతోసూ కాలేజీ ద్రామారావుగా రామారావు నటనాభిలాషు లకు ప్రేమారావుగా పేరుపొంది ధీమారావుగా వెలి గాడు ఆటు తర్వాత మళ్లీ జీవితంలోకిదిగి విజయ వాడ లో సబ్—రిజిస్ట్రారుగా కొలువు తీర్చాడు

1950 వ పదిలో ఒక ఏడెనిమిది సంవత్సరాలు అతన్ని సబ్—రిజిస్ట్రార్‌చేసి అలాగే ఉంచేశాయి ఉద్యోగం చూసుకోమన్నాయి కాని 48, 49 సంవ త్సరాలు అతన్ని ప్రేరేపించి ఉత్తమయోగం ఉద్యోగంకాదని, వెండితెరకు వెళ్లమని కనుసైగలు చేశాయి తత్ఫలితమే అతను తొలిసారిగా నట, దర్శక ప్రసాదుడైన ప్రసాద్‌గారిని చూడడం, 'మన దేశం' చిత్రంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా దర్శనమివ్వడం జరిగింది డి వి ఎస్ మణ్యంవంటి మిత్రుల ప్రోద్బ లంతో రామారావు ఆనాడు ప్రసాద్‌గారిని చూశాడు తత్ఫలితంగానే మనం ఇప్పు డతన్ని చూస్తున్నాం.

ఈ ద్వాదశాబ్దాలూ రామారావుకు 'ఉచ్చ దశా' బ్దాలే ఈ అనతికాలంలో అతను సాధించినది చాలావుంది ప్రముఖంగా నటుడయినా, నిర్మాతగా, దర్శకుడుగా కూడా అతను సాహసాలు చేశాడు సాధకుడైనాడు ఇక వ్యక్తిగా ప్రజాహిత కార్యాలలో అతను పాల్గొన్నాడు ఉచితసమయంలో ఉడిగి కూర్చోకుండా పరహితంకోసం పాటుపడతాడనే మంచి మాట ముక్కోటి తెలుగుల నోటిమాటగా చేసు కున్నాడు 1950 లో రాయలసీమను భయంకర క్షామంపట్టి పీడించినప్పుడు, నడుంకట్టి ముందుకు దూకి, అభ్యుదయభావ వరలక్ష్మితో కూడా వూరూరా తెలుగునాటకాలు ఆడి లక్షల రూపాయలు సేకరించి ఇచ్చిన ఘట్టం రామారావు జీవితానికి విజయవైజయంతిక

'కళ కళకోసం కావచ్చు విజానికి అవును కూడా. అది మనం చెప్పనక్కరలేదు నేను నా కోసమే బ్రతుకుతాను అంటే ఎంత సమంజసమో కళ కళ కోసమే అనటం అంత సబబుగా వుంటుంది నేన,



డి. బి. యన్. వారి 'పెండ్లి పిలుపులో' దేవికతో

నాకోసం, నా వాళ్లకోసం అనేకులు నాకు సంబంధించిన వాళ్లకోసం బ్రతుకుతాను అలాగే కళ కూడా తనకోసమే అని తూర్పేదు సజీవమయిన కళ దానిని ఆదరించే సంఘంకోసం బ్రతుకుతుంది తనను పోషించే సంఘం చల్లగా ఉంటేనే కళ రాణిస్తుంది జీవిస్తుంది కళ కొవ్వత్తిలాటిదికాదు తన ఆధారాన్ని తనే చంపుకోదు తను జీవిస్తూ, తన సంఘాన్ని జీవింపచేస్తుంది

కనుక కళ సంఘంకోసమే పుట్టింది కళద్వారా సాధించలేనిదిలేదు అసలు మన బ్రతుకే ఒక కళ కళాత్మకంకాని అణువు ఈ బ్రహ్మాండంలో ఎక్కడా లేదు, అని రామారావు నిశ్చితాభిప్రాయం దానినే ఆ రోజుల్లో అతను ప్రతి సభావేదికపైన చాటి ఒప్పించాడు నాటికి నేటికీ అందులో విశ్వాసం కలవాడు

కడిపెడు బిడ్డలతో, కన్నులపండువైన సంసారంతో, రామానుజునివంటి తమ్ముడు త్రివిక్రమరావుతో రామారావు జీవితం రామాయణంలా మధురంగా వుంటుంది ఆ జీవితకావ్యాన్ని అతనూ చదువుకుని ఆనందిస్తూ ఉంటాడు

వినయ విభూషితుడయిన రామారావు ఒకసారి విజయవాడలో వేదికమీద నిలబడి గంభీరంగా ఉపన్యసిస్తున్నాడు ఇంతలో అతని దృష్టి సభాసదులను వీడి ద్వారం వైపు మళ్ళింది ఎవరో వృద్ధు ఒకాయన మెల్లిగావచ్చి అక్కడ నిలబడి శ్రద్ధాళువై వింటున్నాడు రామారావు ఒక్కసారి పరుగునవెళ్ళి ఆయనకు నమస్కరించి 'మా మాస్టారు ఇదంతా వారి చలవే' అంటూ తీసుకువచ్చి సుఖాసీనులను చేశాడు అతని అభిమానానికి గురుభక్తికి అదొక మచ్చుతునక

'దస్తూరి గుణాల కస్తూరి' అన్నది 'రమణీయ'మైన మాట దస్తూరి ముత్యాలు ప్రోవులు పోసినట్లువుంటే ఆదస్తూరీ తిలకుని మనోభావాలూ అంత మురువు లొలుకుతాయని పెద్దలంటారు రామారావు ఎంత పొందికగా వుంటాడో అతని అక్షరాలూ అలాగే వుంటాయి అతనొక 'దస్తూరీ తిలకం'!

పదహారణాల ఆంధ్రత్వం అందులో కృష్ణాతీరపు చక్కెర అక్కరలేని చిక్కని పాలూ పెరుగూ ఇవన్నీ పోషించి మంచితనం మిళాయించినట్లు కనిపిస్తాడు నందమూరివారి చందమామ

పచ్చిమిర్చి బజ్జీలంటే తెలుగు మాగాణంలో చాలా మందికి పంచదార చిలకలు ఎన్ టి రామారావుకు అవి చాలా యిష్టమని కథలుగా చెప్పుకుంటారు మిత్రులు కారంతిని హరాయించుకోగలవారు కష్టాలెన్నైనా ఎదుర్కొగలరని చెబుతారు. పరిశ్రమలో శ్రమలెన్నో రామారావు నిర్మాతగా ఎదుర్కున్నాడు ఎందరి కష్టాలో తీర్చాడు ఇది పచ్చిమిర్చి చలవేనేమో

మొత్తంమీద చిత్రజీవితం కష్టావధానమే అయినా ఇష్టంగా స్వీకరించాడు

రామారావు సినీ సోపానగోపుర అధిరోహణలో తొలి మెట్టు విజయవారి 'షావుకారు', మలిమెట్టు 'పాతాళభైరవి'—మూడో మెట్టు బి ఎ ఎస్. వారి 'పల్లెటూరి పిల్ల' ఈ మూడు మెట్లతో వామనుడు మూడడుగులతో త్రివిక్రముడైనట్లు రామారావు కూడా తమ్ముడు త్రివిక్రమరావు అండదండలతో చిత్రలోక నాయకత్వం చేబట్టాడు నేషనల్ ఆర్ట్ థియేటర్ నిర్మించి మంచి చిత్రాలు తీశాడు కళ ఆదర్శాలుకలల్లో కరిగిపోకుండా చిత్రీకరించి ఆర్థికంగా నష్టపడినా 'తోడుదొంగలు' వంటి ఉత్తమ చిత్రాలు నిర్మించి ప్రభుత్వ గౌరవాలు పొందాడు ఆ చిత్రంతో రామారావు నటన ఉత్తమప్రమాణం అందుకున్నది శ్రీ పాకాల వెంకటరాజమన్నారువంటివారు రామారావు ఆ చిత్రంలో ధరించిన పాత్రా, చేసిన అభినయం మెచ్చుకున్నారు

అఖిల భారత చిత్రరంగంలోనే రామారావువంటి సుందర విగ్రహం లేదని చెప్పవచ్చు అతని పేరు

వాలిటే, హీరో పాత్రకు తగిన సామగ్రి చేకూర్చింది. సునాయాసంగా ఏ భావమైనా పలికించగలడు. ఒలికించగలడు. అయినా శ్రుతిమించిన అభినయాలు అతనికి గిట్టవు. కేవలం ముఖ కవళికల వరవళ్ళ అత నికి పట్టవు.

నాడు జానపదాలైన పాతాళభైరవి, చంద్ర హారం, జయసింహాలలో ధరించిన పాత్రలవంటివే తిరిగి రాజమకుటం, భట్టివిక్రమార్క, మొదల యిన చిత్రాలలో ధరించాడు. జానపదాలలో తోట రాముడు పాత్ర (పాతాళభైరవి) ప్రజలను బాగా ఆకర్షించింది. ఇక సాంఘికాలలో షావుకారు, పెళ్ళిచేసిచూడు, మిస్సమ్మ, పిచ్చిపుల్లయ్య, మంచి మనసుకు మంచి రోజులు, శభాష్ రాముడు అతనికి పేరు తెచ్చిన చిత్రాలు. కాగా 'అగ్గిరాముడు'వంటి జానపద సాంఘికంలో అగ్గిరాముడుగాను, అబ్దుల్ రహీంగాను అతని ద్విపాత్రాభినయం విశేష జనా దరణ పొందింది. రామారావు పౌరాణికాలలో దిగిన తర్వాత అవుననిపించుకున్నవి రెండు పాత్రలు. ఒకటి కృష్ణుడు. రెండవది రావణ. 'భూకైలాస్' (ఎ. వి. యం.) లో రావణుడుగా అతను మంచిపేరు పొందా డు. దానిని పురస్కరించుకుని 'సీతారామకల్యాణం' లోనూ అదే పాత్రను వరించాడు. ఉత్కృష్టమైన ఆ పాత్రను పాత్రోచితంగా నటించి ప్రస్తుతం తెలుగు నాట దీవన అందుకుంటున్నాడు.

విజయవారి 'మాయా బజార్'లో కృష్ణుడుగా ఒప్పి, కడు చక్కగా నటించాడు రామారావు.

భక్తిరసం పోషించి, జాలి కురిపించుకొనడం నటుల కొక పరీక్ష. ఆ పరీక్షలో కడతేరిన పెద్ద శ్రీ వేమూరి నాగయ్య. తరువాత విప్రనారాయణలో నాగేశ్వరరావు, దానినే విశిష్టంగా నిర్వహించిన గౌర వం రామారావు పొందాడు. భరణీవారి 'చింతామణి' తన స్వంత చిత్రం 'పాండురంగ మాహాత్మ్యం' 'సీతారామ కళ్యాణం' వీటిలో భక్తిరసం విభిన్న పాత్రల దృక్కోణాలనుంచి చిక్కగా పోషించి రామా రావు ఎంతో ప్రజాదరణ పొందాడు.

ఇచ్చినపాత్రను మనసిచ్చి మెచ్చి తనను దానిగా మలచుకునే విద్య పరకాయప్రవేశం వంటిది. కాకపోతే కామరూపమే అనాలి. ఇది క్లిష్టమని, కొంత జీవితం పణంగా ఒడ్డినప్పుడే సాధ్యమనీ శాస్త్ర జ్ఞులు అంటారు. ఇటువంటి ఉత్తమ కళలో రాణిం చడం చాలా కష్టం. ఆ కష్టమే పడాలిగాని 'కష్టేఫలీ' తథ్యం. తారాపథంలో వెలుగొందే ఏ తారకయినా ఇది వర్తిస్తుంది. ఎన్. టి. రామారావు వర్ధిల్లడానికి అతని నిరంతర కృషే కారణం.

దర్శకులయిన యోగానంద్, తాతినేని ప్రకాశ రావు, కమలాకర కామేశ్వరరావులకు సమ్యగవకాశం కల్పించిన సంస్థ నేషనల్ ఆర్ట్స్ థియేటర్. అలాగే టి. వి. రాజువంటిసంగీత దర్శకులు, గుమ్మడి, వహిదా రెహమాన్, బి. సరోజాదేవివంటి అగ్ర శ్రేణి తారలను తొలిసారి తెరకు పరిచయం చేసింది ఆ సంస్థే. ఇటీవల మణి, స్వర్ణలను, ఇప్పుడు తీస్తున్న 'గులేబకావళి' చిత్రంలో సి. నారాయణ రెడ్డివంటి కవిని పరిచయం చేస్తూ, గాలిపెంచల నరసింహారావువంటి సంగీత విద్వాంసులకు తిరిగి

(59 వ పేజీ చూడండి)



వసంతలక్ష్మి

బి. యస్. యల్. పి. దేవి

పతిత పత్రము లూడ శిశిరంబు వెడల
శాఖశాఖోపశాఖలుఁ జివురుదాల్చి
నవ్య సుమశోభ లోకాల నిండుకొనఁగ
వచ్చె వాసంతి కేళికోద్యానమునకు'
ప్రోడుబాఱిన జీవాల కాసఁ గొల్ప
వచ్చు నీరాక కోయమ్మ స్వాగతమ్ము
అంచు పంచమరాగాన కోయిలమ్మ
కమ్మకమ్మని గీతికల్ బాడదొడగె!
పచ్చపచ్చని ప్రకృతి యంబరముదాల్చి
రంగు పూవుల జలతారురైక దొడిగి
బాలభాస్కరు కిరణాల పసిమిలోన,
బిలుచు పికశారికాకీరభృంగతతుల!
మలయపవనుఁడు వీవఁ గోయిలలుబాడ
చైత్రివైశాఖ వాద్యముల్ మేళవింపఁ
దరుణభామలు పుష్పాంజలులు ఘటింప
మరలె రంగమునకు మత్తమయూరివోలె!
శుకపికాదులు శ్రావ్యగీతములు బాడ
ఝుమ్మటంచును తుమ్మెదల్ జోడుగలుప
ముగ్ధమోహిని నవ్యవసంతరాగ
మాలపించుచు వెడలె వయ్యాళినేడు!

కవితా కింకిణి

బహుమతి పొందిన కవిత



దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు

వీరి 23 వ పుణ్యవర్ధంతి చైత్ర శు ౧౩ మంగళవారం, మార్చి 28, 1961.

నేరసామ్రాజ్యం

ఉదయం ఆరు గంటల వేళ. ఇంకా సూర్యు డుదయించనైనా లేదు. స్టేషనుకు వెళ్లే దోవలో పేవ్‌మెంట్ మీద అప్పుడే 'మూడు ముక్కలాట' జోరుగా సాగుతున్నది. దాదాపు ఇరవైయేళ్లవాడొకడు అడుపక్కని చేతి రుమాలు మీద మూడు పేకముక్కలను అటూ యిటూ మారుస్తున్నాడు. ఆ చుట్టూ దాదాపు పది పదిహేను మంది చేరివున్నారు. వా రిలో కొందరి చేతుల్లో సంచులున్నాయి. అంటే వారు రైలుకు వెళ్లవలసిన ప్రయాణికు లన్నమాట. అక్కడివారిలో కొందరు ఒక ముఠా. వారు ముందు పందెం పెట్టడం ప్రారంభిస్తారు. ఆ ఆట ఆడేవాడికీ వీరికీ

పెద్దిభొట్ల సుబ్బరామయ్య



సంబంధం ఉన్న విషయం ఎవరికీ తెలియకుండా చాలా నేర్పుగా ప్రవర్తిస్తారు. ప్రయాణికుల్లాగా కనిపించేందుకు చేతుల్లో సంచులు కూడా ఉంచుకుంటారు. వారు పందెం వేసినప్పుడల్లా రూపాయకు మూడేసి రూపాయల చొప్పున వస్తూనే ఉంటుంది. ఇలా కొద్దిసేపు జరిగేసరికి మిగిలినవారిలో కొందరు రైలుకు వేళ అవుతున్నా సందేహించక పందెం వెయ్యటం ప్రారంభిస్తారు. సాధారణంగా ఉన్నవూరి వా రెవరూ యిలా మోసపోరు కాని, యితర వూళ్ల నుంచి ఏవో పనుల మీద వచ్చినవారు ఈ మోసంలో వెంటనే పడిపోతారు. అలా చేతిలో ఉన్న డబ్బంతా పోగొట్టుకుని, రైలు ఛార్జీలకు కూడా లేని దీనస్థితిలో ఆ అమాయకులు బాధపడుతూ ఉండటం సామాన్యమైన విషయమే.

ఆ గుంపుల్లోనుంచి ఒక మధ్య వయస్కుడు చేతిలో సంచితో బయటికి వచ్చాడు. అతని ముఖం నిర్విణ్ణమై ఉంది. అతని దుస్తులూ, వాలకమూ చూస్తే కాయకష్టం చేసి జీవించే వ్యక్తిలా ఉన్నాడు. మాటిమాటికీ పై పంచెతో

ఆ యువకుడు భవిష్యత్తును గురించిన ఆశలతో ధైర్యంగా నిగ్రహంతో అడుగులువేస్తూ నడిచి వెడుతున్నాడు. అతని గత చరిత్ర ఏమిటి? ఈ ఆశలను నిగ్రహాన్ని అతనిలో చిగురింపం జేసిందెవరు?

ముహం తుడుచుకుంటున్నాడు. సిగ్గుపడుతున్నాడు. అతని వెంటనే మరొక వ్యక్తి బయటికి వచ్చి కొద్ది గజాలు నడిచి నెమ్మదిగా "ఎంత అమాయకులండీ మీరు! ఇరవై రూపాయలు ఐదు నిమిషాల్లో గంగపాలు చేసుకున్నారు. ఏవూరు మీది?" అని అడిగాడు. ఆ వ్యక్తి సిగ్గుపడుతూ వూరిపేరు చెప్పాడు.

కొద్ది క్షణాల్లోనే గుంపులో కలవరం బయలుదేరింది. ఆ యిరవైయేళ్లవాడు జేబురుమాలును విదిలించి భుజంమీద వేసుకుని పేకముక్కలను జేబులో దాచుకుని నడవటం ప్రారంభించాడు. దాదాపు అయిదారుగురు వ్యక్తులు అతన్ని అనుసరించారు. వారి ప్రవర్తన చిత్రంగా మారిపోయింది. ఏదో రైలు దిగి వస్తూన్న ప్రయాణీకులవలె మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

ఎదురుగా మోటారు సైకిల్‌మీద నెమ్మదిగా వస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ పార్థసారథి. అతడీ గుంపును వీధి చివరినుంచి చూశాడు. అతడు నెమ్మదిగా ఆ పరిసరాల్లోకి వచ్చాడు. ఆ జూదరుల గుంపు అతన్ని దాటి ముందుకు పోయింది. పార్థసారథి చూపులు ఆ యిరవైయేళ్లవాడి మీద నిలిచాయి. వాడు ఎర్రగా పొడుగ్గా ఉన్నాడు. మాటిమాటికీ నుదుటిమీద పడుతున్న జుట్టును తల విదిలించి పైకి తోస్తున్నాడు. కాకీ నిక్కరూ, తెల్లని చొక్కా తొడుక్కుని ఉన్నాడు.

పార్థసారథి యిక వాణ్ణి మరిచిపోడు. ఎంత మందిలో కలిసి నుంచున్నప్పటికీ వాణ్ణి యిట్టే గుర్తు పట్టగలడు. అతడు పేవ్‌మెంట్ పక్కగా మోటారు సైకిల్ ఆపి చేతిలో సంచితో దీనంగా నిలబడివున్న ఆ వ్యక్తిని చూశాడు. అతని అనుమానం నిజమైంది. ఆ వ్యక్తి కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

పార్థసారథి అతన్ని "ఎంతపోయిం దేమిటి?" అని అడిగాడు. ఆ వ్యక్తి మాట్లాడలేదు. ప్రక్కనే నిలబడిఉన్న సానుభూతిపరుడు "ఇరవై రూపాయలు పోగొట్టుకున్నాడండీ. అతనిది తెనాలి దగ్గర ఏదో వూరట. పొలం కౌలుకు చేస్తూ యీ వూళ్లో ఉన్న కామందులకు డబ్బు యిచ్చి పోదామని వచ్చి తిరిగి వెడుతూ యీ మోసంలో పడ్డాడు. రైలు ఛార్జీకి కూడా డబ్బు మిగల్లేదు" అని జవాబు చెప్పాడు.

పార్థసారథి నిట్టూర్చి "బాగానే వుంది. ఇంకేం? మళ్లీ ఆ కామందుల యింటికే వెళ్లి, రైలు ఛార్జీలకు డబ్బు అడిగి తెచ్చుకో. నువ్వు చిన్నవాడివి. కష్టపడి జీవించేందుకు అలవాటుపడ్డవాడివి. అయిదు నిమిషాల్లో అయిదు పైసలు

నేరనిరోధం

సంపాయించేందుకైనా ఎంత కష్టపడవలసి ఉంటుం ఉంటుందో నీకు తెలుసు. ఇలా అసలు కష్టపడకుండా సులభంగా బ్రతక నేర్చినవారు కొందరుంటారు. నీబోటివారు కాస్త నిగ్రహంతో ప్రవర్తిస్తేకానీ వారి ఆట కట్టదు. ఇకమీదట ఎప్పుడీ వూరికి వచ్చినా నీ పనేదో నువ్వు చూసుకుని వెళ్లిపో" అన్నాడు.

ఆ వ్యక్తి తలవూపి వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు. పార్థసారథి వేగం హెచ్చించి స్టేషనుకు వెళ్లిపోయాడు.

* * *

మూడు రోజుల తర్వాత ఒకనాడు సాయంకాలం ఆరు గంటల సమయంలో పార్థసారథి మామూలు దుస్తులతో స్టేషను వెనకవైపు నడుస్తున్నాడు. ఆ రోడ్డుమీద అంతగా రద్దీలేదు. చెదురు చెదురుగా మాత్రం జనం నడుస్తున్నారు. పార్థసారథికి అనాటి రాత్రి ఒక సినిమా హాలు దగ్గర డ్యూటీ పడింది. అదేదో కొత్త సినిమా. ఆనాడే విడుదల అయింది.

పార్థసారథి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. అతనికి సినిమాహాళ్ల దగ్గర డ్యూటీ అంటే చిరాకు. ఆ సినిమాను మొదటినాడే చూసే కోరికతో జనం విచ్చలవిడిగా ప్రవర్తిస్తారు. తమ తమ అంతస్థులనూ, చదువు సంస్కారాలనూ కూడా మరిచిపోయి ఒకరి నొకరు తోసుకుంటూ, కుమ్ముకుంటూ టిక్కెట్లకోసం కొట్లాడుకొనే ఆ జనాన్ని చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది. ఒకసారి యిలా క్రమం తప్పిన జనాన్ని అదుపులో పెట్టేందుకు అతడు చేతిబెత్తం ఉపయోగించవలసి వచ్చింది. కాని ఆ రాత్రి అంతా అతనికి నిద్ర పట్టలేదు. వెనక వున్న వ్యక్తులు మూర్ఖంగా తోసుకుని వచ్చేస్తూ ఉండగా "అబ్బే! యింక లాభంలేదు. ఇంటికి వెళ్లిపోదాం" అనుకుంటూ యివతలికి వచ్చే ప్రయత్నం చేస్తున్న ఒక నలభైయేళ్ల స్కూలు టీచరుకు పార్థసారథి చేతిబెత్తపు దెబ్బ తగిలింది. ఆయన రుద్రుడైనాడు. ఆయన కళ్లు క్షణంలో ఎర్రబడ్డాయి. పార్థసారథి చలించిపోయాడు. అయితే మరుక్షణంలో ఆయన ఎందుకో తగ్గిపోయి ఏమీ మాట్లాడకుండా తల వంకించి వెళ్లిపోయాడు. పార్థసారథి మేనగోడలు పదేళ్లపిల్ల ఆయన పనిచేస్తున్న స్కూల్లోనే చదువుతున్నది. అతడు మర్నాటి ఉదయమే మేనగోడలి వెంట స్కూలుకు వెళ్లి ఆయనను ఒంటరిగా కలుసుకుని క్షమాపణ చెప్పుకున్నాడు. ఆయన నవ్వి "అబ్బే! మీ రంతగా బాధపడవలసిన అవసరం లేదు. తప్పు నాది. అలా విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న గుంపులో ఉండటమే నేను చేసిన తప్పు. 'ఏదో పౌరాణిక చిత్రం కదా, చూద్దా'మని వచ్చాను. తగిన శాస్తి అయింది. మీరేమీ బాధపడకండి" అన్నాడు.

అప్పటినుంచి పార్థసారథికి సినిమాహాళ్ల దగ్గర డ్యూటీ అంటే తగని అసహ్యం. అయినా ఇవాళ తప్పలేదు.

ఆలోచనలోపడి నడుస్తున్న పార్థసారథి ఆగిపోయాడు. కొన్ని గజాల దూరంలో ఒక చిత్రం జరుగుతున్నది. మూడునాళ్ల క్రిందట 'మూడుముక్కలాట' ఆడిన కుర్రవాడు పార్థసారథికి గుర్తే. వాడు మరో మనిషితో మాట్లాడుతున్నాడు. అవతలి వ్యక్తి చేతులలో ఒక బంగారపు కడ్డీ ఉన్న పొట్లం ఉంది. వా డంటున్నాడు. "నేనూ, మీరూ ఒక్కసారే చూశాం కదా, దాన్ని? ఎవరో కొనుక్కుని వెడుతూ పారేసుకుని ఉంటారు. కనీసం యిరవై నవరసులైనా ఉండకపోదు. నేను బీదవాణ్ణి. చదువుకుంటున్నాను. అంతా మీరే తీసుకుపోయేట్టయితే నేను కేకలువేసి నలుగుర్నీ పిలుస్తాను. మీరు వూరికి వెళ్లిపోతున్నారు కదా! నాకేమో రేపటినుంచే పరీక్షలు. అందువల్ల మీ దగ్గర ఎంత ఉంటే అంత యివ్వండి. నా దారిన నేను పోతాను."

అవతలి వ్యక్తి ఆలోచించి జేబులో నుంచి కొన్ని పది రూపాయల నోట్లు తీసి లెక్కపెట్టి "ఇదిగో ఇవి యాభై రూపాయలు. ఈ అయిదు రూపాయలు నాకు రైలు ఖర్చుకు ఉంచుకుంటున్నాను. ఈ మొత్తం తీసుకుపో" అన్నాడు.

వా డా నోట్లు అందుకుని జేబులో ఉంచుకుని "యాభై రూపాయలేనా? నాకు వీలుంటే మీ వెంటనే వచ్చి అందులో సగం భాగం తీసుకునేవాణ్ణి. మీరు అదృష్టవంతులు. అంత బంగారమూ యాభై రూపాయలకే సంపాయించారు" అంటూ కదిలిపోయాడు. ఆ వ్యక్తి చుట్టూ చూచి ఆ పొట్లాన్ని సంచిలో ఉంచుకుని త్వర త్వరగా స్టేషనువైపు వెళ్లిపోయాడు.

పార్థసారథి శిలాప్రతిమ వలె నిలబడిపోయాడు. అతని కేమీ తోచలేదు. తనేమో డ్యూటీలో లేడు. పైగా మామూలు దుస్తుల్లో ఉన్నాడు. ఆ వ్యక్తి అప్పుడే కనుచూపుమేర దాటిపోయాడు. ఆ యిరవైయేళ్ల కుర్రవాడు వీధి మలుపు తిరిగి అదృశ్యమై పోయాడు.

పార్థసారథికి జాలి వేసింది. అనాయాసంగా బంగారం స్వంతం చేసుకునే ప్రయత్నంలో ఆ వ్యక్తికి బుద్ధి పనిచేయడం మానివేసిందన్నమాట. అత్యాశకు పోయి ఒక యిత్తడి ముక్కను బంగారమని నమ్మి యాభై రూపాయలను చేతులారా వదులుకున్న ఆ వ్యక్తి యింటికి వెళ్లి అసలు విషయం తెలుసుకుని ఎంతగా బాధపడతాడో!

పార్థసారథి నెమ్మదిగా నడిచి యింటికి వెళ్లి భోజనంచేసి కాస్సేపు విశ్రాంతిగా కూర్చున్నాడు.

దాదాపు తొమ్మిది గంటల సమయంలో లేచి డ్రెస్ వేసుకుని కాలినడకను బయలుదేరి సినిమాహాలు దగ్గరికి వచ్చాడు. అప్పటి కింకా మొదటి ఆట వదలలేదు. అయినా హాలు బయట ఇసకవేస్తే రాలనంతగా జనం క్రిక్కిరిసి ఉన్నారు. అప్పటికే ఆడవాళ్ల 'బుకింగ్' దగ్గర కలవరం బయలుదేరింది. ఎవరో ఒకామె కూతురి మెడలో ఉన్న గొలుసు పోయిందని గోల పెడుతున్నది. పది పన్నెండేళ్ల కుర్రవాడొకడు అందరి జేబుల వంకా పరిశీలనగా చూస్తూ జనం మధ్య తిరుగుతున్నాడు. అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసులు జనాన్ని 'క్యూ' లో ఉంచేందుకు శ్రమ పడుతున్నారు. పార్థసారథి గేటు దగ్గర ఒక పక్కగా నిలబడి ఉన్నాడు.

మొదటి ఆట అయిపోయి రెండో ఆటకు టిక్కెట్లివ్వడం ప్రారంభించారు. అప్పటికి అక్కడి వ్యవహారం పూర్తిగా మారిపోయింది. జనం తోసుకోవటం ప్రారంభించారు. ఆ తొక్కిడికి నిలవలేని వారు కొందరు "పోన్లే, వెధవ సినిమా! ఇవాళ కాకపోతే మరోనాడు చూడవచ్చు" అనుకుంటూ వెనక్కు తిరిగి వచ్చేస్తున్నారు. పోలీసులు చేతుల్లో బెత్తాలు ఉంచుకుని జనాన్ని అదుపులో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది యి[illegible] ఉండగా కొందరు బొత్తులు బొత్తు లు[illegible] టిక్కెట్లు తీసుకుని బయటికి వచ్చి 'బ్లాకు' లో అమ్మటం ప్రారంభించారు. అక్కడ "[illegible] ఒక్కొక్క టిక్కెట్టు మాత్రమే" అని ప్ర[illegible]ది అయినా యీ బ్లాకులో అమ్మే వా[illegible]న్ని టిక్కెట్లు ఎలా దొరుకుతున్నాయో ఎవ[illegible]తెలీదు. వారు టిక్కెట్టు ధరకు రెండింతలు, మూడింతలు చేసి అమ్ముతున్నారు. ఒత్తిడి జాస్తిగా ఉండటంవల్ల దొరకవేమోనని, ఆ రద్దీలో ముందుకు పోలేకనూ, చాలామంది ఆ టిక్కెట్లు కోసం ఎగబడుతున్నారు. పార్థసారథి పక్కనే ఒకడు "కుర్చీ టిక్కెట్టు రెండున్నర" అని నెమ్మదిగా అంటూవుండటం వినిపించింది. అతడు పక్కకు తిరిగి చూశాడు. ఆ యిరవైయేళ్ల వాణ్ణి అతడు మరచిపోలేదు. కొద్దిసేపటి క్రితమే దొంగ బంగారంతో యాభై రూపాయలు కాజేసి మళ్లీ సినిమా టిక్కెట్లు 'బ్లాకు' లో అమ్మేందుకు తయారైనా డన్నమాట.

వాడు పార్థసారథిని చూచి హఠాత్తుగా ఆగిపోయాడు. చేతిలో ఉన్న టిక్కెట్లను లాగు జేబులో దాచేసి యేమీ యెరగని వాడిలా దిక్కులు చూడటం ప్రారంభించాడు. అయితే పార్థసారథి వాణ్ణి వదలలేదు. వాడి వెంటనే ఉండి కని పెట్టడం మొదలుపెట్టాడు. వాడికేమీ తోచలేదు. టిక్కెట్లన్నీ అలాగే ఉండిపోయాయి. సినిమా మొదలుపెట్టేవేళ అయింది. జనం 'బ్లాకు' లో ఎంత అయినా సరే టిక్కెట్లు కొనెయ్యటానికి సిద్ధంగా ఉన్నారు. వాడు పార్థసారథి చూపుల నుంచి తప్పించుకుపోయే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. అయినా అతని తీక్షణమైన చూపులు వాణ్ణి వెంటాడుతూనే ఉన్నాయి.

రెండో ఆట ప్రారంభించారు. టిక్కెట్లు దొరకనివారు నెమ్మదిగా యిళ్లకు తరలిపోతున్నారు. వాడి ప్రాణం ఉసూరు మన్నది. వాడీ టిక్కెట్ల మీద మొత్తం యిరవై రూపాయలదాకా పెట్టుబడి పెట్టాడు. ఇక అదంతా గంగపా లయినట్లే. ఈ టిక్కెట్లింక పనికిరావు.

పార్థసారథి వాడి వంక ఓరవోరగా చూశాడు. వాడి కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. అలా ఎవరి దృష్టిలోనూ పడకుండా చాటుగా బ్లాకులో టిక్కెట్లమ్ముకుని వచ్చిన మిగిలినవారు కొందరు డబ్బు లెక్కపెట్టుకుంటున్నారు. హాలు ముందు జనం బాగా తగ్గిపోయారు. వాడు నెమ్మదిగా నడవటం ప్రారంభించాడు. వాడి స్నేహితులు ముగ్గురు ఒక్కొక్కడు పదేసి రూపాయల లాభం సంపాయించారు.

పార్థసారథి ఒక పోలీసును సైగచేసి పిలిచి "అలా చూడు. ఆ గళ్ల బనీను వేసుకుని నడుస్తున్నాడే. వాడికి తెలియకుండా వెంట వెళ్లి యిల్లెక్కడో కనుక్కుని రా. మేము స్టేషనులో ఉంటాము" అని చెప్పాడు. ఆ పోలీసు "అలాగేనండి" అంటూ వేగంగా నడిచి చిటికెలో అంతర్థానమై పోయాడు.

* * *

మర్నాటి ఉదయం పార్థసారథి కాఫీ, టిఫినూ ముగించి వరండాలో కూర్చుని దినపత్రిక చదువుతూ ఉండగా ఆ పోలీసు వచ్చి "నమస్కారం సార్" అన్నాడు. పార్థసారథి "అలా కూర్చో! నేను అయిదు నిమిషాల్లో తయారై వస్తాను. అక్కడికి ఒకసారి వెళ్లి వద్దాం" అంటూ లోపలికి వెళ్లి కొద్దిసేపట్లోనే పంచలోకి వచ్చాడు. ఇద్దరూ నడవటం ప్రారంభించారు.

దాదాపు పదిహేను నిమిషాలసేపు నడిచి అక్కడికి చేరుకున్నారు. ఆ వీధి అంతా నిర్మానుష్యంగా ఉంది. అదొక పెంకుటిల్లు. చాలా పాతది. ఒకవైపు కప్పు కుంగిపోయి ఉంది. వాకిట్లో కొద్దిగా ఖాళీ స్థలం ఉంది. అక్కడ ఒక చిక్కుడుపాదుకు చిన్నచిన్న కర్రలతో పందిరి వేస్తూ అరవైయేళ్ల ముదుసలి కనిపించాడు. పార్థసారథి అంచనా వేసుకున్నాడు. ఇది వాడు యింట్లో ఉండే సమయంకాదు. తను వచ్చిన పని త్వరగా పూర్తిచేసుకుని మళ్లీ స్టేషనుకు వెళ్లిపోవాలి. తను చెయ్యగలిగింది చేస్తే యిక వాడి రాత ఎలా ఉంటే అలా అవుతుంది.

అతడు వాకిట ఉన్న చిన్న తలుపును తోసుకుని లోపలికి అడుగు పెట్టాడు. అలికిడి విని వెనుదిరిగి చూసి ఆ వృద్ధుడు 'ఎవరు ?' అంటూ దగ్గరగా వచ్చి చూసి నివ్వెరపోయాడు. మళ్లీ ఒక్కక్షణంలో తేరుకుని "రండి. ఎవరికోసం వచ్చారు ?" అన్నాడు. పార్థసారథి నవ్వుతూ "మీరేమీ కంగారు పడకండి. ఒక చిన్న సహాయం కావలసిఉండి వచ్చాను. ఈ చుట్టుపక్కల 'నాగభూషణం' అనే ఆయన ఎవరైనా ఉన్నారా ?" అని అడిగాడు.

ముసలాయన ఆలోచనలో పడ్డాడు. పార్థసారథి ఆయనను పరిశీలించాడు. ఆయన సన్నగా బలహీనంగా ఉన్నాడు. ఆయన కళ్లు గాజుబిళ్లల వలె కాంతివిహీనములై ఉన్నాయి. జుట్టు పండి

పోయి ఉంది. ఆయన కొద్దిక్షణా లాలోచించి, "ఆ చివరి యింట్లో ఒకాయన ఉండేవాడండీ. ఆయనపేరు నాగభూషణమే. అయితే యిప్పుడాయన యీ వూళ్లో లేడు" అన్నాడు. మళ్లీ "మీరు నిలబడే ఉన్నారు. యిలా కూర్చోండి" అన్నాడు వంచలో ఉన్న చాపను చూపిస్తూ.

నేరనిరోధం

పార్థసారధి కూర్చుంటూ "సరే. కనుక్కుంటాము లెండి. మీరు .... " అన్నాడు. ఆ మునలాయన నవ్వి "నా పేరు రామమూర్తి. నేను ఒక ప్రయివేటు కంపెనీలో క్యాషియర్‌గా దాదాపు యిరవై అయిదేళ్లు పనిచేశాను. రెండు సంవత్సరాల క్రితమే క్యాష్‌లో ఒక వంద రూపాయలు 'మిస్' అయిన కారణంగా నన్ను పనిలోనుంచి తీసివేశారు. ఆ డబ్బు ఎలా పోయిందో నిజంగా నా

కిప్పటికీ తెలియదు. అంత అనుభవంలోనూ ఎన్నడూ ఒక్క కానీ అయినా ఆవిధంగా లెక్క తేలకుండా పోలేదు. అది నా ఖర్మ అనుకున్నాను. అప్పటినుంచీ యింట్లోనే పడివున్నాను. పైగా పెద్దతనం వచ్చింది. ఇప్పుడిక ఏ పనీ చేసే ఓపిక లేదు. నాకు ముగ్గురు మగపిల్లలు పుట్టి, పెద్దవాళ్లిదరూ పోగా చివరివాడు మాత్రం నా కాధారంగా ఉన్నాడు. స్కూల్ ఫైనల్ పరీక్షలో ఒకసారి తప్పి మళ్లీ చదవటం మానేశాడు. వాడేదో ప్రెస్‌లో పనిచేస్తున్నాడు. రోజూ పొద్దున్నే పోయి, రాత్రి పొద్దుపోయిన తర్వాత యింటికి వస్తాడు. ఒక్కొక్కరోజు 'నైట్ డ్యూటీ' ఉందని రాత్రల్లా యింటికి రానే రాడు. మొత్తానికి కష్టపడి యింట్లో ఏ లోపమూ రాకుండా చూస్తున్నాడు. నా భార్య అన్నగారికి ఒక్కతే కూతురు. ఆయన భార్య రెండేళ్ల క్రితం పోయింది. అప్పటినుంచి ఆ పిల్ల నిక్కడే ఉంచాడు. ఏదో మంచి ముహూర్తం చూసి ముడిపెట్టెయ్యాలని అనుకుంటున్నాం" అన్నాడు.

పార్థసారథి మవునంగా విన్నాడు. ఆ వును, ఈ యిరవైయేళ్ల కుర్రవెధవ చేసే ఉద్యోగం ఏమిటో తనకు తెలుసు. ఇంట్లో మాత్రం వాడొక ప్రెస్‌లో పనిచేస్తున్నాడని అనుకుంటున్నారు. అతడు నిట్టూర్చాడు. ముందు గదిలో కిటికీలోనుంచి పధ్నాలుగేళ్ల ఆడపిల్ల కళ్లింతలు చేసుకుని ఒక్కసారి చూసి లోపలికి వెళ్లిపోయింది.

పార్థసారథి లేచి తన యింటి అడ్రసు ఉన్న కాయితం ఆ ముసలాయన కిచ్చి "మీవాడికి 'నైట్ డ్యూటీ' లు లేని మరో ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తాను. నన్ను కలుసుకోమని చెప్పండి" అని యివతలికి వచ్చాడు. ఆ ముదుసలి సంతోషంతో "అలాగేనండి! ఆ ఉపకారం చేస్తే చచ్చి మీ కడుపున పుడతాను" అన్నాడు.

నాకిట్లో పార్థసారథి కోసం ఆ పోలీసు కాచుకొని ఉన్నాడు. ఇద్దరూ కలిసి వీధి చివరకు వచ్చేసరికి వా డెదురైనాడు. పార్థసారథినీ, వెంట ఉన్న పోలీసునూ చూసి వాడు గతుక్కుమని మళ్లీ తేరుకుని వెనుదిరిగిచూస్తూ నడిచిపోయాడు.

* * *

మర్నాడు సాయంకాలం అయిదు గంటలవేళ పార్థసారథి ఉత్తరంవైపు ఉన్న వరండాలో కూర్చుని ఉన్నాడు. అతని మేనగోడలు చాపమీద కూర్చుని చదువుకుంటున్నది. పనివాడు వచ్చి "బాబుగారూ! మీ కోసం ఎవరో యిరవైయేళ్ల కుర్రవాడు వచ్చాడండి. ఇక్కడికి పంపించమంటారా?" అని అడిగాడు.

పార్థసారథి ఒక్కక్షణం ఆలోచించి గుర్తుకు తెచ్చుకుని "పంపించు" అన్నాడు. తర్వాత తల పంకిస్తూ "ఫరవాలేదు. వీడిది మరీ అన్యాయపు ప్రవృత్తి కాదు" అనుకున్నాడు. మేనగోడలి నుద్దేశించి "చూడు జ్యోతీ! నువ్వు కాసేపు లోపలికి వెళ్లి చదువుకో" అన్నాడు. ఆ అమ్మాయి పుస్తకాలు సర్దుకుని లేచి లోపలికి వెళ్లింది.

అతను లోపలికి వచ్చాడు. భుజంమీద కొద్దిగా చిరిగిన చొక్కా తొడుక్కుని ఉన్నాడు. జుట్టు శుభ్రంగా దువ్వుకుని ఉన్నాడు. అతని నమ

నేర నిరోధం

స్కారం అందుకుని పార్థసారథి ఎదురుగా ఉన్న కుర్చీ చూపించి "కూర్చో, నీపేరేమిటి ?" అని అడిగాడు. అతడు భిడియపడుతూ కూర్చుని "కృష్ణ" అన్నాడు. పార్థసారథి చురుకుగా చూస్తూ "నువ్వేదో ప్రెస్‌లో పనిచేస్తున్నావని మీ నాన్నగారు చెప్పారు. ఆ ప్రెస్ పేరేమిటి ?" అని అడిగాడు. అతడు మాట్లాడలేదు.

పార్థసారథి మళ్లీ "నువ్వు ఎందుకని మాట్లాడలేక పోతున్నావో నాకు తెలుసు. అబద్ధాలు చెప్పి యింట్లో ముసలి తండ్రిని మభ్యపెట్టావు. రాత్రీ, పగలూ అడ్డమైన అల్లరి గాడిదలతోనూ చేరి అమాయకులను మోసం చేస్తున్నావు. ఏవేవో పనులమీద ఈ పట్టణానికి వచ్చే జనంలో చాలా మందిని రకరకాల ఆటలలో దింపి మోసం చేస్తున్నావు. సినిమా టిక్కెట్లను బ్లాకులో అసలు ధరకు రెండింతలుగా, మూడింతలుగా అమ్మి వచ్చిన డబ్బును "ప్రెస్‌లో వచ్చిన జీతం" అని యింట్లో యిస్తున్నావు. ఇవన్నీ నేను గమనిస్తూనే ఉన్నాను. ఇప్పటికీ యిలాంటిది మితిమీరిపోయి డిపార్టుమెంటు సామర్థ్యాన్నే పట్టణవాసులు శంకిస్తున్నారు. 'ఇలా ఎప్పటికీ సాగుతుంది లెమ్మ'ని అనుకుంటే అది ఆత్మవంచనే. ఇటువంటివారి నెవరినీ దయతలచి వదిలిపెట్టడమంటూ ఉండదు. స్వంత యిల్లు కాలిపోతూ ఉంటే ఎవడూ చూస్తూ వూరుకోడుగా! అలాగే డిపార్టుమెంటు నిజాయితీని, సామర్థ్యాన్ని జనం శంకిస్తున్న రోజులు వచ్చాయి. ఇంకా యిలా మా కంట బడకుండా సంచరించటం మీ చేతగాని పని. ఇలా జులాయిగా ప్రవర్తించేవారెవరూ మానుంచి యిక తప్పించుకోలేరు" అన్నాడు.

అతనేమీ మాట్లాడలేదు. తల వంచుకుని కుర్చీలో అలాగే కూర్చున్నాడు. పార్థసారథి కాస్సేపాగి "నువ్వు కొంత చదువుకున్నవాడివి. ఇంటి బరువులూ, బాధ్యతలూ అన్నీ నిర్వహించుకోవలసిన వాడివి. అదీకాక ముసలి తల్లిదండ్రులూ, కాబోయే భార్యా నీమీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. నిన్ను రెండు, మూడు సార్లు నేను గమనించాను. నాకెందుకో నీమీద అనుమానం కలుగలేదు. 'నిన్నెవరో తమ ప్రయోజనాలకోసం ఉపయోగించుకుంటున్నార'ని అనిపించింది. మీ నాన్నగారితో మాట్లాడిన తర్వాత అది నిజమని తేలింది. నిన్నిప్పుడిలా ఉపయోగించుకొనేవారెవరూ నువ్వు పట్టుబడిననాడు, నిన్ను రక్షించలేరు. నీ హితంకోరి చెబుతున్నాను. నా మాటలు నీకు కష్టం కలిగించవచ్చు. అయినా సరే చెప్పడం నా విధి. ఇకనుంచి వళ్లు దగ్గర ఉంచుకుని మంచీ చెడూ తెలుసుకుని ప్రవర్తించు. నిన్ను నేను గమనిస్తూనే ఉంటాను. నువ్వు యిక తప్పించుకోలేవు. బాగా ఆలోచించుకుని నీకు మంచిగా బ్రతకటం యిష్టమైతే నాలుగు రోజుల తర్వాత నాకు వచ్చి కనిపించు. నేను శాయశక్తులా ప్రయ

త్నించి నా పలుకుబడి ఉపయోగించి, చిన్నదైనా సరే, ఒక పని యిప్పించే ప్రయత్నం చేస్తాను. ఇక నువ్వు వెళ్లవచ్చు" అన్నాడు.

అతడు ఒక్క క్షణం అలాగే నిశ్శబ్దంగా కూర్చుని తర్వాత లేచి నమస్కారం చేసి నెమ్మదిగా నడిచి బయటికి వెళ్లిపోయాడు. పార్థసారథి మళ్లీ పేపరు చదవటంలో నిమగ్నుడైనాడు.

*   *   *

వారం రోజుల తర్వాత పార్థసారథి స్టేషన్లో పని చూసుకుంటూవుండగా కృష్ణ వచ్చాడు. అతనిలో చాలా మార్పు కనిపిస్తున్నది. అతడు ఉద్యోగంలో చేరి రెండు రోజులే అయింది. నెలకు డెబ్బయి రూపాయల వేతనం వచ్చే ఆ ఉద్యోగం పార్థసారథి చేసిన ప్రయత్నంవల్ల వెంటనే దొరికింది.

పార్థసారథి అతన్ని చూసి "ఎలా ఉందోయ్ ఉద్యోగం ? ఇలా కుర్చీలో కూర్చో" అన్నాడు. అతడు నవ్వి "హాయిగా ఉన్నదండీ. మీ స్నేహితుడు ధర్మరాజుగారు నిజంగా ధర్మరాజేనండీ ? ఓపికతో పని అంతా నేర్పారు. పైగా నేను చెయ్యవలసిన పని కూడా అంత కష్టమైన దేమీ కాదు" అంటూ ఆగి జేబులోనుంచి ఒక శుభలేఖ తీసి పార్థసారథి చేతి కిచ్చాడు. పార్థసారథి దాన్ని అందుకుని చదివి "ఓహో! ఫస్టుగా ఉంది. పిల్లపేరు రుక్మిణి. వరుడిపేరు కృష్ణుడు. బాగా కుదిరింది. కృష్ణుడు ఇంక దొంగపనులు మాని వేసినట్టేగా. ఇక ఫరవాలేదు" అంటూ నవ్వాడు. కృష్ణ చేతులు జోడించి "మీరు తప్పకుండా రావాలి. మా నాన్నగారు కూడా అలా చెప్ప మన్నారు" అన్నాడు. పార్థసారథి లేచివస్తూ "ఓరి పిచ్చివాడా ! పెళ్లి ఆహ్వానం వదులుకునే మూర్ఖు డెవరైనా ఉంటారా ? తప్పకుండా వచ్చి నీ ప క్క నే కూర్చుంటానులే. దిగులు పడకు" అన్నాడు.

ఆ యువకుడు భవిష్యత్తును గురించిన ఆశలతో, ధైర్యంగా నిగ్రహంతో అడుగులు వేస్తూ నడిచి వెడుతూవుండగా, వీధిమలుపు తిరిగే వరకూ చూసి పార్థసారథి సంతోషంతో యీల వేసుకుంటూ యింటివైపు నడిచాడు. ★

అందమైన నర్సుతో ఒక మెడికల్ స్టూడెంటు ఇలా అన్నాడు. "జబ్బుపడి, మీరు ఉన్న వార్డులో రోగిగా ఉండే అదృష్టమే అదృష్టం."

ఆనర్సు ఇలా అన్నది: "మీ కోరిక నెరవేరాలం టే అదృష్టం ఒక్కటే చాలదు. అద్భుతమూ జరగాలి. నేను నర్సుగా ఉన్నది మెటర్నిటీ వార్డులో."

—సి. ఉష (మద్రాసు)

తీరని అప్పు

కాశీనాధ విశ్వం

"ఉండేది ఊడిపోతుంది. నామాట విను. పిల్లలు కల వాడివి. చెడిపోతావ్" అని వీర్రాజు రామయ్యను బెదరించాడు. రామయ్య వింటాడా! మరేం జరిగిందో.....

ఎండ విపరీతంగా కాస్తున్నది. బయట తల చూపేందుకు వీల్లేక వడగాడ్పులకు వేసారిన జనం ఇళ్లలోపల శైత్యోపచారాలు చేసుకుంటున్నారు. విసనకర్రల ఉపయోగం మరీ ఎక్కువ.

ఇలాంటి సమయంలో కూడా పొలం పనిలో తీరికలేక చెమటతో తడుస్తూ పనిచేస్తున్న రామయ్యనుచూస్తే ఇతనేం ప్రకృతికతీతుడా అనిపించకపోదు. జొన్నలు నాటడానికి తడుపుతున్నాడు. కాలువలో వస్తున్న నీరు పగుళ్ళ బారిన నేలలో ఇంకిపోతున్నాయి. పల్లెలో చల్లగా కాలం గడపాలనేదేకాదు రామయ్య ఉద్దేశ్యం నలుగురిలో సమవుజ్జీగా వుండాలని, నలుగుర్లో పచ్చగా వుండాలని. ఈ పట్టుదలతో నిట్టనిలువునా మాడ్చేస్తున్న ఎండలో దిట్టంగా నీరు త్రిప్పుతున్నాడు. కొందరప్పుడే జొన్న నారు వదిలేశారు. తనెప్పుడు వదిలేది? ఆలస్యానికి కారణాలు బోలెడు. రాగులు కోత కొయ్యడం, మడి రెండో భోగం చేయటానికి సర్వ సన్నాహాలు. ఈ ఎండాకాలంలో మడికి దండిగా నీరు పెట్టలేడు. తెల్లవారి తోలిన మడి సాయంత్రం చూస్తే ఆరివుంటుంది. బావిలో నీరు చాలా లోతుకుపోతున్నది. ఇక పది రోజులిలానేవుంటే బావి త్రవ్వించాల్సివుంటుంది. పై పెచ్చు తను ఒంటరిగా పుట్టేడు. అప్పచెల్లెళ్ళ ఐదుగురికి పెళ్లిళ్ళుచేసి, చీర సారె ఇచ్చి పంపడానికి తలప్రాణంతోకకి వచ్చింది. పెళ్లిళ్లకు చేసిన అప్పు తీరనేలేదు. ఏం చెయ్యడం? ఇదే ఆలోచిస్తున్నాడు. ఈ సంవత్సరం ఆ సంవత్సరమంటూనే అప్పు కట్టడంలేదు. ఎద్దులు లేకపోడమో, బావి త్రవ్వడమో, బాన మోకు లేకపోవడమో ఏదో ఒకటికి ముడి పెట్టాల్సి వుంటుందాయె. అప్పుఎప్పుడు తీర్చి కులాసగా వుంటాడోతను. అప్పు నిప్పులాంటిదని అతనికి తెలియనిదా?

అప్పు తీసుకో కూడదు. అప్పుతో మునిగిన కుటుంబాలు ఎన్నో వున్నాయి అని అనుకున్నా ఆడపిల్లల్ని ఒకరికి అప్పగించే పూచి తనకు వదలి నాన్న తన చిన్న తనాన చనిపోయాడు. తన బ్రతుక్కు సుఖమన్నది లేనేలేదు. సంసార భారంతో క్రుంగిపోయినా ధైర్యాన్ని మాత్రం వదల్లేదు. అదే తనకి చుక్కాని అయింది.

అయిదుగురి అక్క చెల్లెళ్లను పంపించాడే కాని, అప్పు మాలుగువేల సంగతి? వడ్డీ పెరుగుతున్నది.

"ఒరేయ్! ఎల్లిగా! కబిల వదలేయ్. సాయంత్రం వస్తాం ఈ బావికే. ప్రొద్దు చాలా ఎక్కింది" అరచాడు రామయ్య.

ఇది విని అరఫర్లాంగు దూరంలో కబిల తోలుతున్న ఎల్లిగాడు కబిల వదలేసి మోకు చుట్టుకుని బానతీసికొని వెళ్లిపోయాడు.

ఎడగాలవనీళ్ళు వచ్చే పర్యంతం రామయ్యవుండి పారను దోనెలోవుంచి ఎడ్లను పట్టుకుని ముందుకు నడిచాడు.

ఆకలిగావున్న ఎద్దులు, రామయ్య వుసూరుమంటూ ఇల్లు చేరుకున్నారు. ఎడ్లకు కుడితి తాపించి కట్టి ఎండు గడ్డివేసి తను అన్నానికి కూర్చున్నాడు.

అన్నంతిని దిన్నెమీద విశ్రాంతిగా కూర్చున్న రామయ్యవద్దకు కమసల రంగడు వచ్చాడు. ఎలక్షన్ కబుర్లలోపడిపోయారు.

"ఇది విన్నావా రామయ్యా?"

"ఏమిటి?"

"ఇంకా నీకు విషయమే తెలియలేదన్న మాట. పంచాయతీ ప్రెసిడెంట్‌గా వీర్రాజు నిలబడిపోతున్నాడు."


"నిలవనీ! ఇందులో వింతేంవుంది. ఎవరో ఒకరు ప్రెసిడెంటుగా వుండాలిగా మరి?"

"రామయ్యా! ఏదో కాస్తో కూస్తో చదువుకున్నావు. ప్రెసిడెంట్‌గా నిలువ్" అన్నాడు కంసల రంగడు.

"మహ మహ వాళ్లతో మనమో లెఖ్ఖా?"

"అదే వద్దంటా. అదికాదు రామయ్యా డబ్బుందేకాని తెలివికాని, చదువుకాని వాళ్లకేది చెప్పు. ఆహ! నువ్వు ఆఁ అను పనంతా మేం చూసుకుంటాం."

"రంగా! ఇదంతా నువ్వనుకున్నంత తేలిక కాదు. పాటేలు కొండతో ఢీ కొన్నట్లే తెలిసిందా!



మెంబర్‌గా కూడా వద్దని మొత్తుకున్నాను. ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు మీరేమో, చాలదా?''

"నీ తెలివి నీకు తెలియకపోయినా మాకు తెల్సు ఒకసారి హనుమంతుడే తన ప్రతాపం తెలియకుండాపోయిన కథ నువ్వేగా మాకు చెప్పింది. అక్కడ ఇద్దరు నిలబడినా అందులో ఒకటి వాపసు తీసుకునేటట్టు చేసి వీర్రాజు ఖచ్చితంగా నిలబడేటట్టు అంతర్యంగా తెల్సింది. నా మాట విని నిలబడు.''

"నువ్వూరుకో రంగా.''

"ఏం రామయ్యా! ఏదారంటే గోదారంటావ్. నీదోవ నీదేకాని నా మాట వినవంటావ్. హాస్యానికి చెప్పినట్టుందే? బిర్రబిగిసిపోతున్నావ్. ఆ లెఖ్ఖా పఖ్ఖా చూసే వాళ్లెవరంటా. బోడిడబ్బుంటే సరా? నలుగుర్ని కూడగట్టుకుని కట్టుగా చేయ మను చూద్దాం. ఇంతకుమునుపు ఈ వీర్రాజు ప్రెసిడెంట్‌గా ఉన్నాడుకదా. ఏం పని చేశాడు. కాస్తంత చేశాడా? వున్న డబ్బుని అది చేశా, ఇది చేశానంటూ పై వుద్యోగస్థులకు లంచం ఎరగా చూపి తక్కినదంతా మింగేయలేదూ? చేసేంత పురసత్తు వుండాల, నిలవాల. అంతేకాని తగుదు నమ్మా అంటూ రావటమే ముందుపూజ నాకని''. ఉపన్యాసం దంచేస్తున్నాడు రంగడు.

"ఇంకేం చెయ్యాలంటావ్. ఆఫీసర్లు వాళ్లు వీళ్లు వస్తారు. వాళ్లకి పెట్టాలి. పేరు తెచ్చు కోవాలి. మనం ఇందులో జొరపడ్డం బేషరతుగా వుండదు. అదలావుంచు. అసలు గెలుస్తామా? గెలిచినా వాళ్ల పోటీతో నెగ్గుకురాగలమా? చమత్కారమేకాదు డబ్బుండాలి. డబ్బుంటే కొండ మీది కోతి దిగివస్తుంది.''

"చదువు వద్దంటావా?''

"సంతకం పెడితే చాలదూ? లేదంటే తక్కిన విషయాలకి గుమాస్తాని వుంచుకుంటాడు. ఇంతకీ మన కా గొడవ ఎందుకంట? కాలం అలా దొర్లిపోతు న్నది ధనంతోనే. ధన మూల మిదం జగత్తు. వాటి తోనేదర్జాలు, హోదాలు, పదవులున్నూ''.

"అయితే నువ్వు నిలవ్వా?'' అడగతలచినది నిగ్గ దీసి అడిగేడు రంగడు.

"అన్నీ సవ్యంగా చెప్పా. ఇంకా నువ్వు అర్థం చేసుకోలేదు. పరిస్థితులు పూసగ్రుచ్చినట్టు చెప్పాను. మన కెంతవుందో అంత చూపడం నయం. అంతేకాని నల్లిని నలిపినట్టు గుట్టుచప్పుడు కాకుండా నలి పేయగలరు. అవును రంగా అవును. నన్ను పంచాయతీ సభ్యుణ్ణిగా చేశారు. అంత చాలదా? వున్న దానితో తృప్తిపడండి.''

"నువ్వు నిలబడి తీరాల్సిందే.''

"నా కిష్టంలేదు''

"ఎలా వుండదో నేను చూస్తా. మేము నిల బెడ్తున్నాం. మా శక్త్యనుసారం చూస్తాం. నువ్విలా సంతకం పడెయ్యి.''

ఇంతలో అక్కడికి కొందరు వచ్చిచేరారు. వాళ్లంతా కూడా కంసల రంగనిపక్ష మవలంబించారు. రామయ్య ఒప్పుకోకపోయినా బలవంతాన సమ్మతింపచేశారు.

* * *

ఇదెట్లానో ప్రెసిడెంటుగా నిలబడపోవు వీర్రాజుకు తెలిసింది. 'ఏట్టాట్టా! పైసాలేదు. సరికదా అప్పుతో మునిగిపోతున్నాడు. వీడా తనతో పోటీ నిలబడుతున్నాడు. చూస్తా. ఒక చెయ్యిచూసి మరి వదల్తాను. ఐసా పైసా తేలుస్తా. పచ్చడి చేస్తా.' పళ్లుకొరికాడు వీర్రాజు.

తాజాగా తయారయ్యి నరసింహం కొట్టును సమీపించాడు.

"ఏమోయ్! నరసింహం!! ఏం చేస్తున్నావ్?''

"అయ్యా వీర్రాజుగారా! దయచెయ్యండి దయచెయ్యండి. మీరు వెయ్యికాలాలపాటు చల్లగా బ్రతకండి. మిమ్మల్నిగురించే అనుకుంటున్నాం. రండి'' అంటూ వినయంగా కుర్చీ చూపించాడు నరసింహం. నరసింహానికి ప్రెసిడెంట్‌గా వీర్రాజు చేసిన మేలు గొప్పది. ఏమంటే పోరంబోకు చెట్లు వుచితంగా ఇచ్చాడు.

"కూర్చోడానికి కూడా తీరిక లేదోయ్ ఈ ఎల



క్షన్లో.".

"అవునవును. విన్నాను. మీరు నిలిచేటట్టున్నా విన్నాను. నిజమేనా?"

"అవును. ఇందులో నీ సహాయం అవసరమొచ్చింది."

"నేనా?"

"అవును. నువ్వే" అంటూ నరసింహం చెవి దగ్గరకువచ్చి "ఆ ముష్టి రామయ్యలేడూ? వాడు నాతో పోటీగా నిలబడ్తాడట." అన్నాడు.

"మీతోనా?" నోరు తెరచి అన్నాడు నరసింహం.

"రామయ్య బాకీ ఎంత వుంది?"

"నాలుగువేలు".

"ఆ పత్రం తీసికొనిరా. వెళ్లు తక్షణం తేయ్." నరసింహం రామయ్య రాసిచ్చిన నాలుగువేల అడమానపత్రం తీసిచ్చాడు.

"నాలుగువేలు వసూలుచేసే భారం నాదే సుమా? అది కూడా పక్షం రోజుల్లోనే?"

"ఆఁ".

"చూసుకో నా తడాఖా."

"నా కర్థం కావడంలేదే." బెంబేలు పడిపోయాడు నరసింహం.

"దమ్మిడిలేదు రాస్కెల్ చేతిలో. నాతో పోటీగా నిలబడుతున్నాడు. ఎంత పొగరు. ఎంత గర్వం."

"రామయ్య మీతో నిలబడుతున్నాడా? దేనికి"?

"నామినేషను దాఖలు చేసేశాడు. పది రోజులున్నది ప్రెసిడెంట్ ఎలక్షన్‌కి మెంబర్లని చూస్తున్నాను. ఇక వెళ్లొస్తా. నీ డబ్బు చేతిలో వున్నట్లనుకో." పత్రాన్ని పుచ్చుకుని వెళ్లిపోయాడు ఆశావాదిగా వీర్రాజు.

వెళ్లినవాడు వివాదానికి దిగేడు. పనిచేసే కుర్రవాణ్ణి పిలిచి రామయ్యని రమ్మని కబురంపేడు ఇప్పుడే రావాలని.

వీర్రాజుపిట్ట నిట్టనిలువునా తన గూట్లో వాలిపోవాలని ప్లాను వేస్తున్నాడు. ఒకసారి మంచిగా చెప్పి చూస్తాను. నచ్చి నా త్రోవకు వచ్చాడా సరి. లేదా పెచ్చు రేగాడా కోర్టు చూసుకుంటుంది. మించిందిలేదు. నవ్వుకున్నాడు తనలో తనే.

పచారు చేస్తున్న వీర్రాజును రామయ్య వచ్చి పలకరించాడు.

"జరూరుగా రమ్మన్నారట. ఎందుకో?"

"రామయ్యా! రా. అలా కూర్చో. పిలిచాను."

"ఎందుకని అడుగుతున్నా."

"నాతో పోటీగా నిలబడుతున్నావట నిజమేనా."

"నిజం."

"త్రాచు పాముతో చెలగాటమాడుతున్నావని మరచావా?"

"మరచిపోలేదు."

"అయితే దూరంగా వుండు."

"నువ్వూ దూరంగా వుండు."

"రామయ్యా." కేకేశాడు వీర్రాజు.

"ఏమయ్యా." వ్యంగ్యంగా అన్నాడు రామయ్య.

"ప్రెసిడెంటుగా ఇన్ని సంవత్సరాలుగా వుంటున్నా...."

"ఒక మంచి పని చేశావా?"

"నిలిచిపో. నా మాట విని."

"మొదట్లో నేనూ అలానే అనుకున్నాను వాళ్లంతా ఏకంగా నన్ను నిలబడమంటే నిలవక తప్పింది కాదాయె. ఇక నామినేషను వాపసు తీసుకోవటం జరుగదు."

"అదే కూడదంటున్నా."

"నీకుండే స్వంతం నాకూ వుంది."

"ఉంది. ఉంది. లేకేం నక్కకు నాగలోకానికుండేంత స్వంతం వుంది."

"సామెతలు చెప్పడం తెల్సు."

"రామయ్యా! అంతరం తెల్సుకుని మాటాడు"

"లేకపోతే."

"లేకపోతే డొక్కచీల్చి డోలు కట్టేస్తా."

"చేసుకో నీ ఇష్టం వస్తే."

"ఆగు...."

"ఏం? ఎందుకని?"

"నాలుగు వేలిస్తా అప్పుగా. నరసింహం బాకీ తీర్చు. మళ్లా నీ ఇష్టం వచ్చినప్పుడిద్దువు. ఇదిగో."

"నామినేషను వాపసు తీసుకోవటం కలలోని వార్త. బాకీ మాటంటావా? ఆస్థిలో సగం పోతుందేమో. అంతేకాదా."

"ఉండేదీ వూడిపోతుంది. నా మాట విను. పిల్లలు కలవాడివి. చెడిపోతావ్. పచ్చగా రైతులో బాటు బ్రతుకు."

"వినను."

"వినవా?"

"వినను. వినను."

జేబులోని పత్రంతీసి చూపాడు వీర్రాజు. "చూశావా? నాతడాఖా. ఇపుడే చిత్తూరు పోతున్నా వకీలుతో సంప్రతించటానికి. చెయ్యవలసిన పని చేస్తా."

"చేసుకో బెదిరిస్తావేమె. నన్ను కాదు బెదిరించేది. రేపు ఎలక్షన్లో నీ ప్రతాపం చూపించు."

"చూపిస్తా. చూసుకో,"

"కార్యరూపంలో కావించు నీ పని" అంటూ రామయ్య అక్కడనుండి వెళ్లిపోయాడు జోరుగా.

దాని ఫలితంగా వీర్రాజుకు ఖర్చు కొద్దిగా అయింది. 'సమను' రావటంతో కోర్టుకి వెళ్లాడు చిత్తూరికి. చిత్తూరులో నరసింహం కన్పిస్తే కొంచెం ప్రాధేయపడ్డాడు. కొద్ది రోజుల గడువు అడిగాడు. వీర్రాజు పురి ఎక్కించివుంటే ఇక ఎక్కడ వినటం?

కోర్టులో రామయ్య తీసికొన్నరూపాయలు వాస్తవమని పది హేను రోజులు గడువిమ్మని అడిగి తీసికొన్నాడు.

సాయంత్రమే బస్సులో బయల్దేరాడు. మరునటి రోజే ఎలక్షన్.

అప్పటికే ప్రొద్దుపోతున్నది. బస్సుదిగిన రామయ్య వూరుచేరుకోటానికి రెండు మైళ్ళు నడవాలి.

పడమటి కొండల్లోనుండి అరుణ కిరణాలు ఏటవాలుగా భూకాంతను చుంబిస్తున్నాయి, అందంగా బంగారు కాంతితో. పక్షులు పస్తులు లేకుండా మేసి గూళ్లకు చేరుకుంటున్నాయి. కిలకిలలు ప్రతిధ్వనిస్తున్నాయి. మధుర సంధ్య ఎరుపుదనంతో వున్నది. ఎక్కడో కోయిలొకటి కుహూ కుహూ మని రసాలసాల నవపల్లవాన్ని మెక్కి రమ్యంగా కూస్తున్నది. తూర్పునుండి తెల్లగా వెళ్లిన మేఘపుంజాలు పడమటదెసజేరి ఎర్రగామారిపోతున్నాయి.

రామయ్య ఆలోచనలు అతని నడకకంటె తీవ్రతరమవుతున్నాయి. డబ్బెక్కడనుండి తెచ్చి కట్టగలడు? ఒక్క రూపాయా? నాలుగు వేలతో బాటు వడ్డీ రూపాయలు కట్టడమంటే నోటి మాటలా? భూమి అమ్మివేసి కట్టడమంటే తనే బలవంతంగా అమ్మచూపడం మూలాన తక్కువ ధరతో ముట్ట చెప్తారు. అసలు వీర్రాజే అందర్నీ వశపరచుకొనగలడు. ఏమయినా నరసింహం బాకి ఎలక్షన్ తర్వాత కట్టివేయాల్సిందే. అప్పులేని బ్రతుకు గంజి త్రాగి బ్రతికినా మేలు. అప్పు చేసి పప్పుకూడు తను తిన లేడు. తిన్నా తను అరగించుకొనజాలడు. బాకీతీర్చి హాయిగా వుండటం శ్రేష్ఠం.

చీకటి భూమిని పూర్తిగా మ్రింగివేసి పెనురక్కసిగావుంది. బండి బాట వెంబడి చెట్లు దట్టంగా వ్యాపించివున్నాయి. ఇక మైలున్నది. చిన్న గుట్ట ఎక్కి దిగితే అదే వూరు. గుట్టనుండి క్రిందికి చూస్తే గ్రామంలోని దీపపు మినుకులు కన్పిస్తుంది. గుట్టపైన ముళ్ల దిబ్బలు అధికం.

పోతున్న రామయ్యకు పది గజాల్లో సవ్వడి విన్పించింది. బ్యాటరీ లైట్ వెలిగింది. ఎవరో వస్తున్నారు కొందరు. చేతుల్లో ఏదో వున్నట్లుంది. నడుస్తున్నాడు. మనుష్యులు సమీపించారు.

ఇంతలో రెండు కర్రలు తన తలపై వడిగా పడిపోయినవి. ఒక గావుకేకపెట్టి పడిపోయాడు రామయ్య.

* * *

ఆసుపత్రి బెడ్‌పైన రామయ్య కప్పుడే స్పృహ వచ్చింది. కలగనలేదుకదా తను. ఎక్కడ వున్నాడు? నర్స్ ఎవరు? తలపై ఈ కట్టేమిటి బాధగా వున్నదే రామయ్య తనలో తనే గొణుకున్నాడు.

నర్స్‌వచ్చి టెంపరేచర్‌చూసి వికసించిన ముఖంతో కదలకూడదని సంజ్ఞచేసి వెళ్లిపోయింది మరో బెడ్ తనిఖీకి.

రామయ్యకు బాధగా వున్నది. జరిగింది నెమరేసుకున్నాడు. కర్రలు మాత్రం కన్పించాయి. ఫలాని వ్యక్తులని తెలియలేదు.

కంసల రంగడు ఎలక్షన్ గొడవలో వుండిపోయాడు. ఇరుపక్షాల ప్రచారం ముమ్మరంగా వుంటున్నది. వీర్రాజు పంచాయతీ సభ్యులను కారులో వుంచుకుని వేలూరు, కంచి, తిరువణ్ణా

ఉపాధ్యాయుడు- రామూ, 'చదివినవానికన్న చాకలి మేలు' అంటారే. దాని అర్థమేమిరా?

రాము-అంటే చదివినవాని కన్నా చాకలి మంచి దుస్తులు ధరిస్తాడని సార్.

జి. రామసుబ్బారెడ్డి (మద్దూరు)

మళ్ళై, చిత్తూరు తిప్పిస్తున్నాడు. వారికి కావలసిన వస్లై ఏ లోపం లేకుండా జరిపిస్తున్నాడు. అన్ని రకాల విందులు పెట్టించాడు. వీర్రాజు ఇలాంటి ఖర్చు ఎంతయినాసరే వెనుకంజ వేయడు.

పోటీ అభ్యర్థుల్లో ఒకరికి గాయాలు తగిలిన కారణాన అసాధారణ పరిస్థితిని ప్రకటించి మధ్యాహ్నానికి రహస్య బ్యాలట్ పద్ధతిలో ఎలక్షన్ జరిగింది. కంసల రంగడు తిరుగుతున్నాడు. న్యాయం గెలుస్తుందన్న నమ్మకం అతనిది.

ఎన్నిక సమయానికి గ్రామప్రజలు హడావిడిగా పోలింగ్ జరిగే స్థలంలో మూగిపోయారు. వారిని సర్దలేక పోలీసులు నానా యాతన పడుతున్నారు. పోలింగ్ కొట్లాటలు, తిట్టుకోవడాలు లేక ప్రశాంతంగా ముగిసింది. బయట వేచివున్న జనం ఫలితాలుకోసం అర్రులు చాచుకుని ఉత్సాహభరితులౌతున్నారు.

రామయ్య రెండు వోట్ల మెజారిటీతో గెలిచాడు. వీర్రాజుకు ఆశ చూపిన మెంబర్లు అతనికి ఎగనామం వేశారు. అంతే!!

ఆస్పత్రిలో రామయ్య పరిస్థితులు సుమారు. కొద్దిగా కోలుకున్నాడు. కంసల రంగడు, రామయ భార్య, పిల్లలతోవచ్చి రామయ్యను చూశారు. జరిగినందుకు నొచ్చుకున్నాడు రంగడు. పాతిక రూపాయలిచ్చాడు. రామయ్య తనకేం ఫర్వాలేదని రెండు మూడు రోజుల్లో రాగలనని భార్యాపిల్లల్ని కంసల రంగనితోపాటు పంపించేడు ధైర్యం చెప్పి. లేచి కూర్చుని బాధ లేదని చెప్పిపంపాడు. తనుగురించి బెంగ అనవసరమని నొక్కి చెప్పాడు. కంసలరంగడు ఎన్నిక వార్త చెప్పినా అంత సంతోషం కన్పరచలేదు రామయ్య.

దెబ్బలు రాత్రి తగిలినయ్. సరే. తన్నెవరిక్కడ చేర్పించింది? అంతటి వేళ ఎవరొచ్చారు? అదే అర్థం కాకుండా వున్నది.

నర్సును దగ్గరకు పిలిచి తానెవిధంగా వచ్చింది అడిగాడు.

"రక్తం కారుతున్న మిమ్మల్ని నరసింహం ఇక్కడకు చేర్పించాడు. తన పేరు మీకు చెప్పొద్దన్నాడు."

రామయ్యకు దిగ్భ్రమ కల్గింది. నరసింహం తనకి వ్యతిరేకి. పత్రం బాకీకోసం కోర్టులో వున్నాడు నరసింహం తనని ఆస్పత్రిలో చేర్పించాడా? తన ప్రాణాన్ని కాపాడేడు నరసింహం!! ఆశ్చర్యం, ఆనందం రెండు పెనగొన్నాయి. రామయ్యకి.

భార్య పిల్లలు వెళ్లిన రోజు ఆహారం బాగా పుచ్చుకున్నాడు.

మరునాటి తెల్లవారి రామయ్య లేవటంతో వుషారుగా ఉన్నది. నడవాలనే కాంక్ష వచ్చింది. లేచి తిరిగాడు. పైపై దెబ్బలు కావటం మూలాన పరిస్థితి మెరుగ్గా వున్నది. డాక్టర్లు, నర్సులు రామయ్య ఆరోగ్యానికి సంతసించారు.

నరసింహం లోపలికొచ్చాడు.

"నరసింహం రా కూర్చో" అంటూ జరిగి మంచంపై చోటిచ్చాడు. నరసింహం పడుకోమని బలవంతం చేశాడు.

"నాకేం బాగున్నా నరసింహం".

చీనీపండు ఒలిచి యిచ్చాడు రామయ్యకు. తింటున్న రామయ్య "నన్నెలా ఆస్పత్రిలో చేర్పించావ్?" అని అడిగాడు.

"తెలిసిందా?"

తెలిసిపోయినదని తలాడించాడు.

"ఆనాడు కోర్టులోనుండి నువ్వు వచ్చేశావా? నాకు బజారులో కొంచెం పనివుండటం మూలాన ఆ పని చూసుకొని వచ్చేంతలో బస్సు వెళ్లిపోయింది. టాక్సీ ఒకటి అవసరానికి దొరికింది. అదే పదివేలనుకుని ఎక్కాను. మన రోడ్డునుండి రాత్రి వస్తుంటే దారిలో నువ్వు పడివున్నావ్. చీకటిలో ఎవరైనది తెలియలేదు. వీపుపైన వేసుకుని రక్తపు మరకల్తో చేరాను. రోడ్డు. బస్సులోకి ఎక్కాకనే నీ ముఖం తెల్సింది...."

"సరిసరి. నా కర్థమయింది. నీ మేలు నే నెన్నటికిని మరచిపోలేను."

"ఎలక్షన్లో గెలిచావు. తెల్సా" అని ఆ విషయాన్ని మార్చేశాడు నరసింహం.

గెల్వటంలో చురుగ్గా మాటాడలేదు రామయ్య. గెలుపు, ఓటములకు మురిసిపోవటం, విచారించటం తన తరహాకాదు. రెండూ జీవితంలో కలగాపులగంగా ఒకదానివెంట వచ్చే సంఘటనలు.

"అన్నట్టు ఓ విషయం చెప్పాలనే వచ్చాను రామయ్యా. ఎప్పుడూ లోపల విషం పైకి తేనెల మాటాడే వాళ్లని నమ్మనేకూడదు. నువ్వేమంటావ్?"

"ఎవర్నిగురించి నీవీ మాట లంటున్నది?"

"ఇంకెవరు? ఆ వీర్రాజే!"

"వీర్రాజా? మీ రిద్దరూ చాలా స్నేహంగా వుండేవాళ్లే."

"వీర్రాజు పేరు చూడు మహ లావు. ఏంచేశాడనుకున్నావ్. పత్రం నా దగ్గరనుండి తీసికొన్నాడా? ఎలక్షన్లో ఓడిపోయాడు. నాలుగువేల్లో రెండువేలు అవసరంగా కావాలన్నాడు. నా డబ్బు నీ కిచ్చేది లేదు పోపొమ్మన్నాను. పత్రం ఇవ్వనన్నాడు. నేనెవర్ని నరసింహాన్ని. వాడి ఎత్తులకి పై ఎత్తులువేసి పత్రాన్ని దొంగలించేశాను. నా పత్రం ఇవ్వను అనడానికి వాడెవడంట? నా పత్రం నాది. అంతే గాని వీడెవడు. ద్రోహి. ఇవ్వనన్నాడు. మోసాన్ని మోసంచేతనే జయించాను. రాత్రి జరిగింది విను. నా కొట్టును కొల్లకొట్టడానికి ప్రయత్నించాడు. ఈ గుట్టు నాకు చేరింది. కొట్టు లేకుండా సామాన్లు మార్పించేశాను. ఇంకా ఎన్నో పనులు చేయాలనుకుంటున్నాడు. మనమంతా ఒకటిగావుండి ఆ చీడ పురుగును బైటికి రాకుండా చెయ్యాలి. ఐక్యంగావుండి ఆ వేరు పురుగు అహంకారాన్ని అణవాలి. స్నేహంగా వుండి ఇంత చేస్తాడనుకోలేదు. ఇంతకీ కారణం ఎలక్షన్లో ఓడి పోవటమే. రామయ్యా నిజం చెబుతున్నా. నువ్వెపుడు డబ్బు కడ్తావో అప్పుడే కట్టు. పత్రం నీదగ్గ రేవుంచుకో. నీపైననాకానమ్మకంవుంది."

"లేదు నరసింహం. నీ బాకీని చెల్లించాలి. నా భూమి అమ్మి వేస్తాను."

"అరెరే! నేల అమ్మటమా? ఎంత అమాయకుడవయ్యా. నేను చెప్పటమేమి? నువ్వు చెప్పటమేమి? ఈ పత్రాన్ని రద్దు చేసి కొత్త పత్రం రాయించెయ్. ఇంకా సంవత్సరాలు పొడిగి వస్తుంది. నువ్వెపుడు కట్టినా ఒకటి మాత్రం జ్ఞాపకం వుంచుకో. సరేనా?" పత్రాన్ని అందించాడు నరసింహం.

పులకరించిన హృదయంతో పత్రాన్ని అందుకున్నాడు రామయ్య. ★



మనమూ మన దేహస్థితీ

నాలుకరూపధర్మాల్లో మార్పు

సాధారణంగా నాలుక ఎఱ్ఱగా, గరుకుగా, తడిగా ఏ బాధాలేకుండా ఇష్టం వచ్చినట్లు కదిలేదిగా, సాగేదిగా ఉంటుంది. దానిమీద ఏవిధమైన "కోటింగు" (Coating) ఉండదు. కాని అనేక పరిస్థితులలో, ఈ స్థితి మారిపోతుంది. కేవలం నాలుకకు సంబంధించినవీ, తాత్కాలికములూ, స్థానికములూ అయిన వ్యాధులవల్ల నాలుక రూపమూ, ధర్మమూ మారిపోవచ్చును. లేదా అనేక దైహిక రోగములవల్ల, జ్వరాదులవల్ల, క్రిమి దోషాదులవల్ల, కొన్ని మందులవల్ల నాలుకలో మార్పులు రావచ్చును. ఆ మార్పులు వ్యాధి నిరూపణలోనే సహకరించవచ్చును. వ్యాధి ఏ స్థితిలో ఉన్నదో ఎల్లా పరిణమించబోతున్నదో నాలుక స్థితి సూచించవచ్చును. అందుచేత నాలుకను పరిశీలించడం, ప్రతివారికీ తెలిసి ఉండాలి దాని సహజ స్థితి తెలిసినప్పుడే, రోగ స్థితిలో వచ్చిన మార్పులను పరిశీలించడానికి వీలుంటుంది. గతవారం నాలుక సహజ స్థితిని తెలుసుకొన్నాము.

రోగ స్థితిలో నాలుకలో ముఖ్యంగా గమనించదగిన మార్పులు ఈ క్రింద ఉదహరిస్తున్నాను.

1. సొర ఆకుమీద లాగా నాలుకమీద నూగు ఏర్పడిందా ?

2. నాలుకలో సాధారణంగా ఉండే తడి ఉన్నదా లేక ఆ తడి ఆరి ఉన్నదా ?

3. మామూలుగా ఉండే ఎఱ్ఱ రంగేనా లేక తెల్లగానో, మరీ ఎఱ్ఱగానో, నల్లగానో, ఇంకా ఇతర రంగులు కలదిగానో నాలుక మారిఉన్నదా ?

4. మామూలుగా ఉండే గరుకుదనము కాక, అసాధారణములయిన నిమ్నోన్నతములు అక్కడ ఏర్పడిఉన్నవా ?

5. నాలుక సైజు మామూలుగా ఉన్నదా ? లేక కొంతభాగమో, పూర్తిగానో నాలుక ఉబ్బి ఉన్నదా.

6. నాలుకమీద పగుళ్ళు గాని, అల్సర్లు గాని ఏర్పడ్డవా ?

7. నాలుక కొన అంగిలిని తాకగలుగుతున్నదా? లేక క్రింది పళ్లను దాటి పైకి లేవకుండా ఉన్నదా ?

8. నాలుక చాచగలిగిన స్థితిలో ఉన్నదా ? అల్లా చాచినప్పుడు శరీర మధ్యరేఖకు ఇరుప్రక్కలా సమానంగా ఉన్నదా ? లేక ఒక ప్రక్కకు వాగబడి ఉన్నదా ? అల్లా చాచినప్పుడు నాలుక స్థిరంగా నిలబడి ఉన్నదా ? లేక అదురుతున్నదా?

అతిముఖ్యంగా పరిశీలించవలసిన అంశములను పైన వివరించాను. పైన ఉదాహరించిన మార్పులలో ఏది నాలుకలో ఏర్పడినా ఏదో రోగానికి అది

డా॥ గాలి బాలసుందరరావు

చిహ్నమై ఉంటుంది. ఆ మార్పు గమనించితే వెంటనే వైద్యసహాయం తీసుకోటానికి వీలు కలుగుతుంది. శరీర స్థితిని గురించి నాలుక యిచ్చే సాక్ష్యం చాలా నమ్మదగ్గ సాక్ష్యం. క్లుప్తంగా ఈ మార్పులు ఏఏ సాధారణ వ్యాధులను సూచిస్తయ్యో ఆలోచిద్దాము.

1. నాలుకమీద నూగు· ఆరోగ్యస్థితిలో నాలుక శుభ్రంగా, తడిగా ఉంటుందని చెప్పేను. కాని నాలుక వెనుకభాగంలో కొద్దిగా 'కోటింగు' కొంతమందిలో, ఏ రోగస్థితీ లేకుండానే ఏర్పడవచ్చును. నాలుక ఉపరిభాగం అంతటా కోటింగు ఏర్పడ్డప్పుడే నూగు ఏర్పడుతుంది. ఆ కోటింగు తెల్లగా ఉండవచ్చును లేక ఎరుపుదేరిన గోధుమ రంగు కలదిగా ఉండవచ్చును. పాల రంగులో ఉండవచ్చును. ఈ కోటింగు నాలుకను శుభ్రం చేస్తే పోయేదిగా ఉండవచ్చును. గీకినా రానిదిగా ఉండవచ్చును. ఈ విధమైన కోటింగు, నోటిలో—క్రిమిదోషం ఏర్పడ్డప్పుడు సాధారణంగా ఏర్పడుతుంది ఒక్కొక్కప్పుడు పొగాకు అతిగా ఉపయోగించేవారిలో ఈ కోటింగు ఏర్పడవచ్చును. నోటిలో క్రిమిదోషంవల్ల కోటింగు ఏర్పడ్డప్పుడు నోటిలోనుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. కొన్ని క్రిమి జనితజ్వరాలలో నాలుక మీద కోటింగు విధిగా ఏర్పడుతుంది. ఆ కోటింగు స్వరూప స్వభావ విస్తీర్ణతలను బట్టి ఆ క్రిమి దోషం ఉధృతమును వూహించవచ్చును. కోటింగు అధికమైనప్పుడు సాధారణంగా నాలుక తడి ఆరిపోవడం కూడా ఏర్పడుతుంది. క్రిమిదోషం అంతరించి, జ్వరం తగ్గిపోగానే ఈ కోటింగు అంతరించిపోతుంది. మిగతా జ్వరములలో ఎల్లా ఉన్నా టైఫాయిడ్ జ్వరంలో నాలుకను గమనించడం అత్యవసరం. నాలుక స్థితి ఆరోగ్యస్థితిని ఎప్పటికప్పుడు చెబుతూ ఉంటుంది.

టైఫాయిడ్ మొదటి వారంలో నాలుక అంతటా దుమ్ము రంగు కల నూగు ఏర్పడుతుంది. కాని క్రమంగా నాలుక కొనలోనూ, అంచులలోనూ ఈ నూగు వదిలి ఆ భాగములు ఎఱ్ఱబడి పోతవి. మూడవ వారం వచ్చేటప్పటికి నాలుక ఎండిపోయి, వార్నిష్ పూసినట్లుగా నిగనిగ లాడుతుంది. కోటింగు అంతా పోయి నాలుక ఎఱ్ఱరంగు వేసినట్లుగా ఎఱ్ఱపడి పోతుంది. స్కార్లెట్ జ్వరం ప్రారంభంలో నాలుకమీద ఇల్లాగే కోటింగు ఏర్పడ్డ నాలుగు రోజులలో అది అంతరించి నాలుక ఎఱ్ఱబడి పోతుంది. నాలుక మీద బుడిపెలు పెద్దవి అవుతవి. తడపరలోనూ ఇంచుమించుగా ఈ మార్పులే నాలుకలో ఏర్పడుతవి. టైఫస్ అనే జ్వరంలో నాలుకమీద అతి శీఘ్రంగా కోటింగు ఏర్పడి, త్వరలోనే నాలుక ఎండిపోయి, శుష్కించి, చాచినప్పుడు నిలబడివుండక నాలుకలో ఒణుకు ఏర్పడుతుంది. ఇల్లా అనేక రకములయిన జ్వరాలలో నాలుక అనేక విధాలుగా మారుతుంది సామాన్యులు ఆ మార్పుల అర్థాలు గ్రహించ నక్కరలేదు కాని ఆ మార్పు ప్రమాదకరమైన పరిస్థితికి చిహ్నమని గ్రహించి వెంటనే వైద్యసహాయం పొందడానికి ప్రయత్నించాలి.

జీర్ణకోశంలో భాగములయిన, కడుపు, పేగులు, మలాశయం ఇటువంటి భాగములు వ్యాధిగ్రస్తము లయినప్పుడు, సరిగా పనిచేయనప్పుడు, నాలుక అనేక మార్పులు చెందుతుంది కడుపు, ప్రేగులు హఠాత్తుగా ఇన్‌ఫ్లేం అయినప్పుడు ఈ నాలుకమీద దట్టమయిన కోటింగు ఏర్పడుతుంది కడుపును యిరిటేట్‌చేసే ఆల్కహాలు, మసాలా పదార్థములు, మందులు తీసుకొన్నప్పుడు కొందరిలో కడుపు, ప్రేగులు ఇన్‌ఫ్లేం అయి వాంతులు, వేదులు అవుతవి క్రిమిజనితములయిన డిసెంటరీ ప్రభేదములలోనూ ఇంతే జరుగుతుంది. కాని లప్పుడు దట్టమయిన కోటింగుతోబాటు నోటిహో వేదు, ఇతర అరుచులు, గుండెల క్రింది ప్రదేశములో మంట,—రోగులు యీ స్థితిని గుండెలలో మంట అనే చెబుతారు—ఏర్పడుతవి. కాని కడుపు వాపు హఠాత్తుగా కాక క్రమంగా ఏర్పడి బహుకాలం బాధిస్తుంది (Chronic-gastritis) ఈ స్థితిహోనూ, లివరులో గడ్డ ఏర్పడ్డప్పుడు (cirrhosis of liver) కీళ్ల

వ్యాధులు, వీటిలో నాలుకమీద పలచని కోటింగు ఏర్పడి, నాలుక చివర ఎఱ్ఱబడి, నాలుక అంచులు మీద పళ్లు నొక్కుకుని దాని అంచు పూసలపేరులా తయారవుతుంది. నాలుకమీద పలుచని కోటింగు ఉండి, నాలుకమీద ఉండే బుడిపెలు (రుచి మొగ్గలు) ఎఱ్ఱబడి, నాలుక మాత్రం తెల్లగా ఉండడం మధుమేహాన్నో, కడుపులో హైడ్రో క్లోరిక్ ద్రావకం తగ్గిపోవడాన్నో సూచిస్తుంది. ఉదరం లోపలి భాగమును క్రమ్మిఉండే పెరిటోనియా అనే పొర ఇన్‌ఫ్లేం అయినప్పుడూ, ఎపెండిక్సు ఇన్‌ఫ్లేం అయినప్పుడు తప్పకుండా నాలుకమీద కోటింగు ఏర్పడుతుంది. ఏమయినా విషపదార్థములు శరీరంలో ప్రవేశించినప్పుడల్లా నాలుక తెల్లబడుతుంది. కొన్ని కారణముల చేత సెలైవరీ గ్లాండులలో నుంచి తగినంత ఉమ్మినీరు తయారుకాదు. వాటి నాళములు మూసుకున్నప్పుడూ ఉమ్మినీరు తగినంత రాదు. ఆ విషయం విపులంగా తర్వాత చర్చిస్తాను. మలబద్ధకం ఏర్పడ్డప్పుడు కూడా నాలుకమీద కోటింగు ఏర్పడుతుంది.

జ్వరం సాధారణంగా క్రిమిదోషంవల్ల ఏర్పడుతుంది. జ్వరంలో నాలుకమీద కోటింగు నాలుక ఎండిపోవడం, క్రిములవల్ల తయారయిన టాక్సినులు (Toxins) శరీరంలో ప్రవేశించినందున ఏర్పడుతుంది. కాని, కొన్ని సందర్భములలో జ్వరం లేకుండానే నాలుక తడి ఆరిపోయి ఉంటుంది. ఆకలి లేనివారికీ, విపరీతంగా చెమట పోసినవారికీ, వాంతులవల్లనో, బేదులవల్లనో శరీరంలో నీరు తగ్గిపోయినవారికీ, విపరీతంగా రక్తస్రావం అయినవారికీ, నాలుక ఎండిపోతోంది. ముదిరిపోయిన క్షయవ్యాధిలోను, కడుపులో కేన్సరు ఏర్పడి ముదిరినప్పుడు మధుమేహం (Diabtes) లోను, యురీమియా (Ureamia) అనే మూత్ర నిరోధంవల్ల ఏర్పడే వ్యాధిలోను నాలుక పూర్తిగా పొడిఆరిపోతుంది. దీనిమీద కోటింగు ఏర్పడుతుంది. ఆ కోటింగు రానిలిపోయిన తరువాత నాలుక పుండుపడి ఎఱ్ఱగా ఉంటుంది. మెరుస్తూ నున్నబడి, ఎఱ్ఱబడి, బీటలువారిన నాలుక, అతి ప్రమాద స్థితిని సూచిస్తుంది. ఒక్కొక్కప్పుడు నాలుక వెనుకభాగంమీద ఉన్న రుచి మొగ్గలనుండి వెంట్రుకలవంటి నిర్మితులు పెరుగుతవి. ఇవి వెంట్రుకలు కావు. రుచి మొగ్గలలో జీవకణములు విపరీతంగా పెరిగి ఇవి ఏర్పడుతవి. పొగాకు విపరీతంగా సేవించేవారిలో ఈ స్థితి అప్పుడప్పుడు ఏర్పడుతుంది. పొగ త్రాగడం ఆపివేయగానే యివి అంతరించిపోతవి.

నాలుకరంగు చాల ముఖ్యమైనది. పాలిపోయిన నాలుక పాండు రోగాన్ని సూచిస్తుంది. ఆహారంలో విటమిన్ బి కాంప్లెక్సులో భాగములయిన రిబోఫ్లేవిన్ (Riboflavin), నికోటెనిక్ ఏసిడ్ (Necotinic acid) ఫోలిక్ ఏసిడ్ (Folic acid) తగ్గిపోయినప్పుడు, ప్రేగులలో కొన్ని మార్పులు ఏర్పడి స్ప్రూ (Spnue) అనే వ్యాధి ఏర్పడుతుంది. అందులో, నోటిపూత ఏర్పడి నాలుక ఎఱ్ఱబడి, పుండుపడి, తరవాత నున్నబడి పాలిపోతుంది. ఇది చాలా ప్రమాదకరమైన స్థితి. కేవలం, ఆహార లోపములవల్ల ఏర్పడి, ఆహారం మార్పులతో నివారింప దగినది.

ఇనుముతో తయారైన ఔషధములు తీసుకున్నప్పుడు నాలుక నల్లబడుతుంది. నాలుకలో నీలవర్ణము, హృదయం పనిచేయలేనప్పుడు ఆక్సిజన్ లేక ఏర్పడుతుంది. ఈ స్థితిని 'సయొనొసిస్' (cyanosis) అంటారు. ఈ స్థితి మృత్యుదేవతకు ప్రతీహారి వంటిది. అతి ప్రమాదకరమైనది.

ఒక్కొక్కప్పుడు నాలుకమీద తెల్లని పొరలు అక్కడక్కడ ఏర్పడుతవి. ఒకరకమైన ఫంగస్ (Fungus) అనే క్రిమివల్ల ఏర్పడే 'త్రష్' (Thrush) అనే వ్యాధిలోను, లూకోప్లేకియా అనే వ్యాధిలోను నోరంతా పూసినప్పుడూ ముదిరిన సిఫిలిస్‌లోనూ, ఇవి ఏర్పడుతవిటి వివరణ నిరూపణ, నివారణ వైద్యుల విధి. కాని వాటిని ఏర్పడగానే గమనించి వైద్యులకు తెలియచేయడం అత్యవసరం. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవడం వ్యాధి నివారణలోనూ, నిరోధంలోనూ చాలా సహకరిస్తుంది.

నాలుక ఇన్‌ఫ్లేం అయినప్పుడు అందులో దుర్మాంసవృద్ధి ఏర్పడినప్పుడు, కణుతులు ఏర్పడ్డప్పుడు, నాలుకలో నంజు ఏర్పడ్డప్పుడూ నాలుక సైజు పెరిగిపోతుంది. నాలుక మందమై, మొద్దుబారడం థైరాయిడ్ గ్రంథిలో స్పందనం తగ్గి ఏర్పడే మిక్సిడిమా (myxoedema) అనే వ్యాధిలో ఏర్పడవచ్చు. అల్లాగే థైరాయిడ్ గ్రంధి స్పందనం అధికమైనప్పుడు నాలుక కృశించి, అందులో వణుకు ఏర్పడవచ్చును. నరముల వ్యాధులలో నాలుక పూర్తిగా శుష్కించిపోవచ్చును. ఈ పై వ్యాధులలో కొన్ని అతిసాధారణంగా ఏర్పడేవి. మరికొన్ని సకృతుగా ఏర్పడేవి. ఆహారలోపములు సవరించుకున్నందున ఆరోగ్యసూత్రములు పాటించినందున, వెంటనే తగిన వైద్య సహాయం పొందినందున, త్వరగా నివారించడానికి వీలయినవి. అందుకని ఇందులో కొన్ని వ్యాధులను గురించి కొంచెం వివరంగా తెలుసుకోవడం అవసరం.

రాత్రి వేళ ఒకడు లైటు లేకుండా సైకిల్ మీద పోతున్నాడు. పోలీసు ఇన్‌స్పెక్టరు ఆతనిని నిలిపి "ఏమయ్యా! ఇన్‌స్పెక్టర్ని చూచి అయినా కాస్త దిగకూడదా" అని అడిగాడు.

"పొరపాటేనండీ. మిమ్మల్ని పోలీసు ఇన్‌స్పెక్టర్ అనుకోలేదు. పొగాకు ఇన్‌స్పెక్టర్ అనుకొన్నాను" అన్నాడు ఆతడు.

—మాసేపల్లి వెంకటేశ్వరరావు
(ఏలూరు)





దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

29-3-61 బుధవారం మొదలు
4-4-61 మంగళవారం వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

ఈవారం మనోధైర్యం బాగుంటుంది. ఇతరుల కలహాలు మిమ్ములను నిరుత్సాహపరిచేటట్లు ఉండవచ్చు. దైవబలం బాగున్నందున కార్యసిద్ధి పొందగలుగుతారు. ధనాదాయ సంబంధమైన సమస్యలు చాలావరకు తీరిపోతవి. మధ్యవారిమాటను నమ్మి ముఖ్యమైనవారితో విరోధాలు పెంచుకోవద్దు. బంధువర్గంలో గౌరవము, పలుకుబడి సంపాదిస్తారు. ఈ సమయంలోకొనే వస్తువులు సమయంలో ఉపయోగపడకపోవచ్చు. పరోపకారం చేయబోతారు. కాని, అపవాదులు రాకుండా చూచుకొనటం అవసరం. నూతన కార్యక్రమాలనుగురించిన ఆలోచనలు, సందేహాలు ప్రస్తుతం ఎటూ తేలవు. 31, 1, 2 తేదీలలో అనారోగ్యం, ఉపయోగంలేని కార్యక్రమాలు.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

మీ మాటలలోను, మీ పనులలోను తప్పులు పట్టేవారు ఉంటారు. ప్రయాణకార్యక్రమాలు అధికంగా ఉంటవి. కుటుంబంలో ప్రశాంతత కనుపిస్తుంది. వినోద విషయాలలో ఖర్చులు అధికం. అధికారులతో సంప్రదింపులు జరుపగలుగుతారు. అయితే మనో నిగ్రహము, ముందు జాగ్రత్త అవసరం. మీకు సహాయం చేస్తామని చెప్పినవారు సకాలంలో మీకు అండగా నిలబడి మాటను కాపాడగలుగుతారు. ధనవ్యయం అధికంగా ఉన్నా తగినంత ప్రయోజనం పొందగలుగుతారు. మీ ఆరోగ్యం బాగుంటుంది. వృత్తిలో అవతలివారిని మెప్పించగలుగుతారు. పుణ్యకార్యాలకు ఆటంకాలు రాగల సూచన లున్నవి. 29, 30 తేదులలో బంధువిరోధం, కారణంలేని ఆందోళన, శ్రమ.

* * *

మిధునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

మంచితనంతో కార్యం సాధించుకోగలుగుతారు. ఈ సమయంలో జరిగే పనులు ముందు ముందు విశేషంగా లాభిస్తవి. మీ శ్రమకు తగినంత ఆదాయం పొందగలుగుతారు. అయితే సాధారణంగా మనశ్శాంతికి భంగం కలిగే సంఘటనలు కనుపిస్తూ ఉంటవి. మీ శక్తికిమించిన భారాన్ని పైన పెట్టుకోవద్దు. వస్త్రాలు, ఆభరణాలు మొదలయినవి కొంటారు. కుటుంబంలో కలహప్రసంగాలు వచ్చి సమసిపోగలవు. బంధుమిత్రుల రాకపోకలు విశేషం. డబ్బుకు సంబంధించిన లెక్కలలో పొరపొట్లు రాగల అవకాశాలున్నవి. సంఘ కార్యాలలో మీ మాటకు ఒక ప్రక్క విలువ కనిపిస్తున్నా, మరొక ప్రక్క పోటీ తప్పదు. 2, 3 తేదీలలో గౌరవప్రాప్తి, ధనలాభం.

గ్రహస్థితి

మేషంలో శుక్రుడు, మిధునంలో అంగారకుడు, సింహంలో రాహువు, మకరంలో గురుశనులు కుంభంలో బుధ, కేతువులు, మీనంలో సూర్యుడు, సింహ కన్య తులలలో చంద్రుడు.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

ప్రస్తుతం ఏ విషయంలోను ఉద్రేకపడతగిన సమయంకాదు. వ్యవహారాలు మొదలయినవి మధ్యవర్తులద్వారా పరిష్కరించుకొనటం మంచిది. ఒక నిర్ణయానికి వచ్చిన పనులు తిరిగి మొదటికి రాగల సూచన లున్నవి. ఆదాయం బాగుంటుంది. కాని, ఖర్చులు కూడా విపరీతంగా కనుపించగలవు. పెద్ద మనుష్యులతో సమావేశం లభిస్తుంది. మీ పలుకుబడిని వినియోగించు స్నేహితులకు సహాయం చేస్తారు. శుభ కార్యాలలో పాల్గొంటారు. దూరమందున్న బంధు మిత్రులవద్దనుంచి అనుకూల వార్తలు తెలుస్తవి. ఇతరులవద్దనుంచి రావలసిన డబ్బుకాని, వస్తువులుకాని, సక్రమంగా రాకపోవచ్చు. గుణగణాలు తెలుసుకోకుండా క్రొత్తవారితో చేరతగిన సమయంకాదు. 29, 30 తేదులలో కుటుంబంలోని వారికి అనారోగ్యం, పనులలో శ్రమ.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

మిమ్ములను మంచి మాటలతో ఉబ్బిస్తూ సమయంలో సహాయం చేయకుండా తప్పుకొనేవారు ఉంటారు. ప్రతివిషయంలోను స్వశక్తితో జరుపుకోగల పనులలోనే ప్రవేశించవలసి వుంటుంది. దైవబలం బాగున్నది. కనుక మంచి మాటలతో వ్యవహారాలు పరిష్కరించుకో గలుగుతారు. అనుకున్న ప్రయాణాలు సుఖంగా నెరవేరుతవి. పెద్ద మొత్తాలు ధనం వస్తుందనే భావంతో సాహస కార్యాలలో దిగవద్దు. వృత్తికి సంబంధించిన అనుకూల వార్తలు తెలుస్తవి.ఇతరులతో కలసిచేయుపనులు మీరు అనుకున్నంతగా ఉపయోగించవు. సంఘంలో మీ మాటకు కొంత మదింపు లభిస్తుంది. పిల్లల ఆరోగ్యం బాగుండదు. 3, 4 తేదులలో వృత్తిలో గౌరవము, ధన లాభము లభిస్తవి. శుభ వార్త.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త,చిత్త 1, 2 పా)

పట్టుదలతో మీ మాటను సాధించుకొనగలుగుతారు. తాత్కాలికంగా డబ్బు చిక్కు కనుపించవచ్చు. కాని, పేరు ప్రతిష్ఠలు బాగుంటవి. కుటుంబంలో మీ మాట ప్రకారం పనులు జరిగి గౌరవం పొందగలుగుతారు. వ్యవహారవిషయాలలో ప్రతిబంధకాలు తొలగి సులభంగా ఫలితం పొందగలుగుతారు. ఇతరుల కలహాలలో జోక్యం కలుగజేసుకొనకుండా ఉండటం మంచిది. క్రొత్త పనులకై డబ్బు పెట్టుబడి పెట్టవలసి వస్తుంది. ఇంతకుముందు మార్గం దొరకకుండా బాధపడుతున్న సమస్యలు తీరిపోయి మనశ్శాంతి లభిస్తుంది. వారాంతంలో యుక్తితో కార్యం సాధించుకొనవలసి వస్తుంది. 29, 30, 31 లలో త్రిప్పట, దుబారా ఖర్చులు, ఉపయోగంలేని పనులు.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు,స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

మీమాటలలోను, పనులలోను హుందాతనం పెరుగుతుంది. మొండిగా నిలిచిపోయిన చిక్కు వ్యవహారాలు వాటంతట అవి పరిష్కారం అవుతవి.

బస్సు బయలుదేరింది. ఆచార్యులు మోచేత్తో మా రంగం పొట్టలో పొడిచి, సైగ చేశాడు. వెంటనే మావాడు లేచి నిల్చుని 'కూర్చోండి' అన్నాడు.

'థాంక్స్' అంటూ కూర్చుంది. ఫర్వాలేదు, గిర్వాలేదూ ఏమీ అనకుండా. నావంక దీనంగా చూశాడు రంగం. కళ్లతో ధైర్యం చెప్పాను.

ఆచార్యులు ఓరగా అమ్మాయి మొహంకేసి చూశాడు. వెంటనే రంగం నా కాలు తొక్కాడు, ఏడుపు మొహంతో.

ఆచార్యులు నాకేసి చూడగానే కన్ను గీటి సైగ జేశాను. నె చెప్పింది అర్థం చేసుకున్నాడల్లే ఉంది, లేచి నిల్చుని—'ఈ స్టాపులో దిగిపోతాను. మీరు కూడా కూర్చోండి' అనేసి ముందు కెడివాడు.

రంగనాథం తడబడ్డాడు. నేనే వాడి భుజం పట్టుకు కూర్చోబెట్టాను. ఆ అమ్మాయి చూసింది వాడిని. రూంలో వేసిన రిహార్సల్‌లో లాగే నవ్వాడు చిరునవ్వు. అమ్మాయి మొహం త్రిప్పుకుంది.

మేము ఇక ఫర్వాలే దనుకుని, దిగిపోయాం. మా ఆఫీసు స్టాపు దగ్గరకు జేరి వాడి రాక కోసం ఎదురుచూడ సాగాము.

ఆరుగంట లైంది. వాడింకా రాలేదు.

"ఇలా అయితే మన్ని వా డివ్వాళ సినిమాకు తీసుకు వెళ్లినట్లే—" ఆచార్యులు నిరాశపడ్డాడు.

మరో అరగంట గడిచింది.

"ఒరే మధూ! మాటలు ఫలించి, వాళ్ళ ఏదన్నా సినిమాకు చెక్కేశారేమో ?—" ఇది రమేష్ అనుమానం.

నిజమే ననిపించింది. 'అయితే ఏమిటి చేద్దాం' అన్నమీమాంసలో పడ్డాం.

ఇంతలోకే ఒక బస్సు వచ్చి ఆగింది. అందు లోంచి పెసరపచ్చడి తిన్నవాడిలాగా మొహం పెట్టుకుని దిగాడు, రంగనాథం. ఆ ఆకారం చూడగానే నాకు కన్నీళ్లపర్యంతం అయింది. ఏమైంద నడిగా.

"ఒరేయ్! మీరు దిగిపోయాక, ప్రక్క స్టాపులోనే ఓ ముసిలి ఆంగ్లో ఇండియన్ బస్సెక్కిందిరా. అసలే అమ్మాయి ప్రక్కన కూర్చున్నానాయిరి .... అంతా నాకేసి చూశారు. ఇక లేవక తప్పిందికాదు. దానివలన అంతా వ్యర్థమయిందిరా" చెప్పాడు రంగనాథం.

స్నేహితు లందరూ దీర్ఘాలోచనా నిమగ్నులయ్యారు. అంతలో ఒక చెయ్యి పైకెత్తి తన కేదో తట్టినట్లు ఫీలయ్యాడు సూర్యం.

"రంగం! నువ్వు లేచేప్పుడు నీకేసి చూసిందా ఆ అమ్మాయి ? చూస్తే నిన్ను ప్రేమించినట్లే లెక్క. 'నువ్వు దిగిపోకు .... నీతో మాట్లాడటానికి సిగ్గుగా ఉందీ .... ఈ స్టాపు దాటాక పలకరిస్తానూ—' అని ఆ చూపుల అర్థం."

"లేదురా, అంతకు క్రితం చూసిందేమో గాని, ప్రక్కన కూర్చున్న దగ్గర్నుంచీ అసలు చూడనే లేదురా. రోడ్డుమీద ఏదో పోగొట్టుకున్న దానికిమల్లే వెదుకుతూ ఎక్కడకో చూస్తుంది .... "

"ఆ!—చెదిరిన కళ్లతోనేనా ?" ఈసారి ఆచార్యులు.

"అవున్నా."

"అయితే ఆ అమ్మాయి నిన్ను ప్రేమించినట్లేరా. ఆ చూపుల కర్థం—'నువ్వు దిగిపోయావంటే, మరో మగా డెవడైనా నాతో కూర్చుంటాడు—నే నా స్థితి భరించలేనూ—దిగిపోకుమా' అని చెప్పా లనుకుంటూ, సముద్ర కెరటాల్లా ముంచుకొస్తున్న సిగ్గుకు లోబడి, మాట్లాడలేక, అట్లా చూసుంటుంది."

"ఆపండ్రా మీ గోల!—" అని నేను కసరుకోగానే వాళ్లందరూ పకపకా నవ్వటం ప్రారంభించారు.

వాళ్ళు ఇందాక చెప్పినదంతా నిజమేనని నమ్మిన రంగం మొహం చిన్నబోయింది. తల నొప్పిగా ఉందని చెప్పి చకచకా నడిచి వెళ్లిపోయాడు అక్కడినుండి.

ఆ రాత్రి భోజనం చేశాక, రంగనాథం ఇంటికి వెళ్లాను. గేటు దగ్గర వాళ్ల నాన్నగారు ఎదురైనారు పక్కింటికి చదరంగం ఆండటానికి వెళ్తూ. ఆయనొక రిటైర్ 'డిప్టీ కలెక్టర్'.

"ఏమోయ్ మధూ! వారం పది రోజుల్నించి మా రంగం అదోలా ఉన్నాడు. ఏమిటి సంగతి ?"

"ఏమోనండి నాకూ తెలియదు." తప్పించుకున్నాను.

ఆయన ఆలోచించుకుంటూ 'లోపల ఉన్నాడ'ని చెప్పి వెళ్లిపోయారు. నేను సరాసరి వాడి గదిలోకి వెళ్లాను.

మంచంమీద బోర్లా పడుకుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తలెత్తి చూశాడు నన్ను.

"ఎలా ఉంది తలనొప్పి ?"

"అసలేమీ లేదురా. వాళ్ల నొదిలించుకోవాలని అలా చెప్పా. అంతే" అంటూ లేచి కూర్చున్నాడు.

"వరేయ్, మధూ! సినిమాకు పోదామా ?" సరేనన్నా. బయలుదేరాము. సినిమా బోర్డులకు ప్రక్కగా 'బాక్సింగ్ పోటీలు' అన్న ప్రకటన చూసి, దానికి వెళ్దామనుకున్నాం. ముందు ముందు ఈ ప్రేమ వ్యవహారాల్లో ఎవరన్నా విలన్లు ప్రవేశిస్తే .... చూసింది ఉపయోగపడుతుంది.

బాక్సింగ్ స్టేడియంలో కెళ్లగానే తెలిసింది, మొదలుపెట్టి పది నిమిషా లైందని బొంబాయి ఛాంపియనూ, మద్రాసు ఛాంపియనూ కొట్టుకుంటున్నారు.

కొంత సేపటికి గంట కొట్టారు. రెండో రౌండు 'డ్రా' అయిందన్నారు.

ఉన్నట్టుండి మావాడి కళ్లల్లో హఠాత్తుగా వేయి ట్యూబులైట్లు జిగ్గున వెలిగాయి. 'రింగ్ సైడున' ఆ అమ్మాయి. మద్రాసు ఛాంపియన్‌తో మాట్లాడుతోంది నవ్వుతూ. ఛాంపియన్ కూడా నవ్వుతూ ఏమిటో అంటున్నాడు.

"ఒరేయ్, చూశావురా!" అన్నాడు తల పట్టుకుంటూ, రంగం. మావాడి గుండెల్లో అగ్నిపర్వతం గుప్పున రగిలినట్లుంది!

మా రంగం గాడికి సంప్రాప్తించిన ఆ విలన్‌ను కళ్లారా చూస్తూంటే నా కాళ్లల్లో 'చచ్చుత్వం' ప్రవేశించింది. నిల్చోలేక కుర్చీలో కూలబడ్డాను. అటువంటి విలన్‌తో ఎలా చచ్చేదీ—పోనీ, నలుగురైదుగురం కలిసి తందామన్నా, ఆ ఛాంపియన్





డిటెక్టివ్ శ్రీ లవ్

వెధవను చూశాక మావా ళ్లెవరూ ముందుకు రారు. ఇప్పుడేం చెయ్యాలి?

గంట కొట్టగానే రంగం నా ప్రక్కన కూల పడ్డాడు దిగాలుపడి. వచ్చిన దగ్గర్నుంచీ ప్రాంతీయాభిమానంతో మద్రాసువాడు గెలవా లనుకుంటున్న మేము, వా డెప్పుడు తన్నులు తింటాడా, చూసి ఆనందిద్దామా అని ఆశగా చూడసాగాం.

'వాడి కాలో, చెయ్యో హఠాత్తుగా వూడిపోగూడదూ' అనుకున్నాను మనసులో. మా ఖర్మ కాలి, ఆ బొంబాయివా డెవడో ఈసారి వచ్చి చవట్లై కూర్చున్నాడు. నాలుగో రౌండులో మరి లేవకుండా హాయిగా పడుకున్నాడు. మద్రాసువాడే గెల్చాడు.

రంగం మొహం ఎర్రగా కందిపోయింది. విలన్ చేతుల్లో దెబ్బలు తిన్నవాడి లాగే! ఆ అమ్మాయీ వాడూ కలిసి సంతోషంతో ఎగురుతూ వెళ్లిపోతున్నారు.

మేమూ రోడ్డుమీద కొచ్చాము ఇంకా అక్కడ ఉండటం యిష్టంలేక.

ఆ విలన్‌తో మరో యిద్దరు ఫ్రీ స్టయిల్ కుస్తీ ఛాంపియన్లు కలిశారు. 'చెల్లాయ్ తొందరగా ఎక్కు. బజారులో చిన్న పనుంది' అంటున్నాడు మద్రాసుఛాంపియన్. కారు వెళ్లి పోయింది.

మా రంగం ఎగిరి గంతేశాడు. ఒక్కసారి పగలబడి నవ్వాడు ఎదురుగ్గా ఉన్న మద్రాసు ఛాంపియన్ ఫోటో నొకదాన్ని చూసి.

"ఒరేయ్—రంగం! బ్రదరంటే మాటలా. అందులోనూ బాక్సింగ్ ఛాంపియన్. ఏమాత్రం నీ సంగతి తెలిసినా, ఏ ఎముక కా ఎముక ఏరి పారేస్తాడు, జాగ్రత్త. వంకాయ బజ్జీలా నమిలేస్తాడు."

ఐదు నిమిషా లాగి మళ్లీ అన్నాను. 'ఆ అమ్మాయిని గూర్చి ఇంత చెడుగా తెలిశాక, ఇక గత్యంతరం ఏముంది నీ ప్రేమను త్యాగం చెయ్యక—"

"మధూ! నువ్వేనా ఈమాట లనేదీ!! ఆ అమ్మాయి రూపాన్ని నా హృదయ కుడ్యాలపై అనేకచోట్ల వివిధభంగిమలలో ముద్రించి, నా ప్రణయసామ్రాజ్యాధిదేవతగా ఆరాధిస్తున్నానే. నా సర్వం అనుకుని ఆశ పడుతున్నానే. అటువంటి ఈ ప్రపంచంలోనే సరిసాటి లేని నా మధురమైన పవిత్రప్రేమకు కర్కశంగా సమాధి కట్టమంటావా? ఎలా త్యాగం చెయ్యనూ? ఎవరికోసం—ఎందుకూ—"

మావాడు నాటకాల్లో వేషాలు కడ్తుంటాడు లెండి.

"త్యాగం చెయ్యక ఏం చేస్తావురా? వాళ్లేమో దుక్కల్లాగా, 'కరకరకర తింటారా నిన్ను. కోసుకు నములుకు తింటారా' అన్న సుందోప సుందుల్లా వున్నారాయె. మనమేమో గాలికి రాలిపోయిన తోటకూర కాడలకన్నా అధ్వాన్నంగా—"

అమ్మాయి నా చెల్లెలు లాటిది. సరేనా ?"

వాడు ఈసారి హాయిగా నిట్టూర్చాడు.

"రంగం ! ఆ అమ్మాయినైతే గాఢంగా ప్రేమిం చెయ్. నాకూ అభ్యంతరం లేదు. ఇంతకూ, ఆ అమ్మాయి కులం ?"

"మనదే లేరా."

"జన్మస్థలం ?"

"అవన్నీ మన కెందుకురా ! ఆ అమ్మాయి హృదయం కావాలి గాని." చిరునవ్వు నవ్వాడు, మీసంమీద చేయి వేసుకుంటూ.

"కావాలిరా. అన్ని వివరాలు కావాలి. రేపు నీమాటల ప్రేమ 'సక్సెస్' అయితే ఘాటుగా ప్రేమలేఖ వ్రాయొద్దూ ? అప్పుడు వాటిని ఉపయోగించి రాసెయ్యాలి. అర్థమైందా ?"

"అయితే—ఈరాత్రి కనుక్కుంటాలే."

"రంగం ! నిజమేరా—? అప్పుడే రాత్రిళ్లు కలుసుకోవడం వరకూ వచ్చిందీ మీ ప్రణయం ! ఇంక ప్రేమలేఖలు దేనికీ—నాతో చెప్పనే లేదేమిరా"

"నీదంతా వట్టి చాదస్తంరా. ఆమెను నే కలుసుకునేది రాత్రుళ్లు కలల్లో. తెలిసిందా ?"

నేను గట్టిగా ఆవులించాను. ఐదు నిమిషాల పాటు నిశ్శబ్దంగా ఉండిపోయాము.

నేనే మొదలెట్టాను. "రంగం ! ఇంతవరకు జరిగిందేదో జరిగిపోయింది. నీ ప్రేమ జాడ్యం అందరికీ తెలియటం, మన ఆఫీసరు నిన్ను మొత్తగా తిట్టి వార్నింగు ఇవ్వటం—ఉత్తి పుణ్యానికే అనుకో. అన్నీ మర్చిపో. ఏ అమ్మాయితోనూ మాట్లాడే దమ్ములు లేకపోయినా, ఎవ్వరినీ ప్రేమించకపోయినా — నీ చేష్టలవలన చెడ్డపే రొచ్చేసింది. ఎలాగూ వచ్చింది కనుక, దాన్ని మరికొంత కాలర్ ఆట్టే పెట్టుకో.".

"ఆ బస్సు అమ్మాయి నీకు తగిన జోడీ." ప్రోత్సహించాను.

"బాగానే వుందిరా నువ్ చెప్పింది. థాంక్స్. కాని, ఆ ప్రేమించడమే ఎలా అని ?" క్వశ్చెన్ మార్కు మొహంతో అడిగాడు.

"ఆమాత్రం తెలియకుండా ఎందు కీ వూబిలో దిగబడ్డావురా నా చిట్టి తండ్రీ ! హాయిగా ఇంగ్లీషు సినిమాలు చూసుకుంటూ ఇంట్లో కూర్చో— లవ్ చేయడం చాతవుతుంది—"

"మరేం చెయ్యమంటావ్ ?"

"నే చెప్పినట్లల్లా చేస్తావా ?" అడగ్గానే గంగిరెద్దులా తలూపాడు.

"అయితే విను ! మన ముందు స్టాపులో మనమంతా బస్సెక్కుతాం. మనవా ళ్లందర్నీ పిలిచేద్దాం బస్సులో ఖాళీ లేకుండా కూర్చుంటాం. మన ఆఫీసు స్టాపులో ఎక్కువమంది బస్సు దిగిపోరు. అవునా !

"ఆ అమ్మాయి బస్సు ఎక్కుతుంది. నువ్వు లేచి నిల్చొని ఆమెకు కూర్చునేందుకు జాగా ఇస్తావ్. ఆ అమ్మాయి 'ఫర్వాలేదు. కూర్చోండి' అంటుంది. నువ్వు తిరిగి 'కూర్చోండి. ఫర్వాలే' దంటావు. ఆ అమ్మాయి కూర్చుంటుంది.

"ఆమె ప్రక్కనే కూర్చున్న మనవా డొక్కడు మళ్లీ స్టాపులో దిగిపోతాడు. ఆమె నిన్ను కూర్చోమంటుంది. నువ్వు చిరునవ్వుతో కూర్చుంటావు. 'ఏం చేస్తున్నార'నడుగుతుంది. 'మీ పేరం'టుంది. ఇంకా ఏమేమో అడుగుతుంది. నువ్వు నీకు తోచినట్లుగా జవాబు లిస్తావు.

"నువ్వు తిరిగి ఆమెను అవే ప్రశ్న లడగాలి. ఆమె జవాబు లిస్తుంది. అలా మీ మొదటి పరిచయం 'కట్' అవుతుంది. ఎలా ఉంది నా ఐడియా ?" నిజంగానే ఓ సినిమా డైరెక్టర్ ఫోజు విసిరాను. నన్ను కావిలించుకున్నంత పని చేశాడు, రంగం.

"ఒరేయ్. ఇంత అయిడియా తెలిసిన నువ్వు ఇన్ని రోజులూ నాకు చెప్పనేలే దేమిరా ? అయితే ఎప్పుడు షూటింగ్ ?"

"ఆగాగు. తొందరపడకు. కొన్ని రోజులపాటు నువ్వామె కళ్లల్లో పడాలి. అందుకోసం మన బస్సు స్టాపులో ఆమె వచ్చే సమయానికి ఏదో బస్సుకోసం వెయిట్ చేస్తున్నట్టు నటిస్తూ నిల్చునుండాలి. ఆమె కళ్లను ఆకర్షించ గలిగితేనే తరువాతి కాల్‌షీటు."

వాడు భుజా లెగరేశాడు. తన బట్టలబీర్వాకేసి చూస్తూ. తర్వాత వాడు అందించిన నిప్పుతో సిగరెట్టు వెలిగించుకున్నాను.

పది రోజులు గడిచాయి. అంతా అనుకున్నట్టే అయింది.

"మధూ ! ఇక రెండవసీను ప్రారంభిద్దామా ?" అన్నాడు రంగనాథం, మా ఫ్రెండ్స్ యూనియన్ జనరల్‌బాడీ మీటింగుకు ప్రారంభోత్సవం ఎట్లా జరపాలో తెలియక పది రూపాయల ఖర్చుతో ఓ చిన్న పార్టీ ఇచ్చి స్నేహితుల్ని ఇంటికి తీసుకొచ్చాడు రంగనాథం. ఆనాటి సభకు చైర్మనును—మొదలెట్టాను : "డియర్ ఫ్రెండ్స్ ! మన రంగనాథం మీతో అసలు విషయం చూచాయగా చెప్పేవుంటాడు—"

అప్పటికి గంటనుంచి హస్కుతో బాధ పడుతున్న సూర్యానికి కోప మొచ్చినట్లుంది, "ఒరే చైర్మనూ—వాడికి లేకపోతే మానె. నీకైనా ఉండొద్దురా బుద్ధి ! ఆ విషయం తెలిస్తే ఈ మొహాలతో ఎందుక్కూర్చుంటామురా—" అనడి

"సభా మర్యాదను అతిక్రమించటం మినహా మరొకటి కానేరదు. చైర్మనుల వారిని 'బుద్ధి' లేదా అని అడగటం ఖండింప తగినది" అంటూ వాపోయాను.

"ఏడ్చావ్‌లే కానీ—తొందరగా కానివ్వు. లేక పోతే, తిన్న టిఫిన్ కాస్తా అరిగిపోయి, మేము కాస్తా ఇళ్లకు వెళ్లిపోతాం" అని హెచ్చరించాడు ఆచార్యులు.

నేను ఒక నిమిషం కళ్లు మూసుకు ఊరుకున్నాను. సమావేశం బలవంతంగా వాయిదా పడుతుందేమోనని ఆదుర్దాగా చూచాడు, రంగం. తర్వాత మళ్లీ మొదలెట్టాను.

"చైర్మన్‌కు అవమానకరంగా మాట్లాడిన సభ్యుల్ని క్షమిస్తూ—"

మధ్యలోనే అడ్డు తగిలాడు రమేష్. "వ్రరేయ్ ఆ కూత కూశావంటే పళ్లు ఎక్కాలగేస్తాను. ఏదో సహాయం కావాలని ప్రార్థిస్తే పోనీకదా అని జాలిపడి మేమొస్తే .... "

"సరేలేరా ఇంతకూ అసలు విషయం చెప్పనే లేదు." ఆచార్యులు పెద్ద గొంతుతో ప్రశ్నించాడు. వాడి కిట్లా జవాబిచ్చాను :

"మన రంగం ఓ అందాల తారను ప్రేమించాడు. ఇంతవరకూ చూపుల ఘట్టం పూర్తయింది. ఇహ వా ళ్లిద్దరకూ పరిచయం కల్గించే భారం మనది. దానికి నేనో పథకం తయారు చేశాను. దాని ప్రకారం వాడికి మన సహాయం అంది పోవాలి. మీరేమంటారు ? మీరేమన్నా చెప్పదల్చుకున్నారా ?"

"ఓ నిరభ్యంతరంగా. అబ్బే. మేం చెప్పేదేముంది" అన్నారు అందరూ ఏకకంఠంతో.

నేను నిర్దేశించిన పథకాన్ని వారి కెరుక పరిచాను. అందరూ అంగీకరించారు. అయినా, నన్ను అభినందించినవా డొక్కడూ లేడు. వారి మనస్సుల్లో ఏముందో గాని

మర్నాడు ....

సీసాలో మిగిలిన బ్రిల్‌క్రీమ్ నంతా పట్టించేసి తల దువ్వుకున్నాడు. ట్వీడ్ సూటూ, అలవాటు లేని నెక్‌టై. ఓహ్! ఏం చెప్పను — పెళ్లి చూపుల కెళ్తున్నట్టే తయారైనాడు.

మేమంతా మాసిన గుడ్డలు వేసుకెళ్లాం. ఏం చేసినా మా రంగనాథం కోసమే గదా !

అనుకున్న ప్రకారం ఐదు గంటల ఐదు నిమిషాలకు బస్సెక్కాం. కూర్చోడానికి ఖాళీ లేక, మావాళ్లే యిద్దరు నిల్చున్నారు. ఆ అమ్మాయి స్టాపు (మా ఆఫీసు స్టాపే) దగ్గరపడుతుంటే రంగం నాచెవిలో చెప్పాడు. "ఒరేయ్. నా గుండెల్లో రొద బయలుదేరిందిరా. ఎలారా ?"

"ఏం ఫర్వాలేదు. అలాగే కూర్చో. చెప్పినదంతా మెషిన్ వలె చేసెయ్యి. నీ ప్రేమ జయించాలంటే, నీ ఆశయం జయించాలంటే నువ్వీ మాత్రం చెయ్యక తప్పదు. ధైర్యాన్ని కూడ గట్టుకో" అని సలహా యిచ్చాను.

బస్సాగగానే, అమ్మాయి లోపల కొచ్చింది.

భర్త—ఇదుగో నేను బయటికి వెళ్ళుతున్నాను. నాకోసం రామయ్యగారుకనుక వస్తే సాయంకాలం ఆరుగంటలకు కలుసుకుని మాట్లాడతానని చెప్పు.

భార్య—మరి ఆయన రాక పోతే ఏమి చెప్పమంటారు?

కటవర్తి ప్రసాదరావు (హైదరాబాద్)

టా! నా ప్రేయసిని గురించి
నోరు చప్పరించుకుంటావ్—నా
''

నవదనం చూస్తే నాకు జాలివేసి,
, అందమైన వస్తువులను తలుచుకో
నో అలవాటు. ఏమనుకోకు. నీకు
ంత మిత్రద్రోహిని కాబోను. ఇంకె
' అనను.
న్ని చెప్పినా
గానం తీర

రంగం!
తో ఎప్ప-
డావురా?''
లాసార్లు.''
ఏ మ ని

జ్ఞా ప కం

హానగరంలో
ఉంటోందో
?''
కేసి అను
గా కా డు.
మకురా నీకీ

కో ఒట్టు
ప్పందికాదు.
వ స్నేహం
రా. అ

రంగనాథం డిక్టెక్టివ్ ఫలించి ఆమె ఇంటికి వెళ్ళగలిగాడు. అతడు చెప్పిన గుర్తుల ప్రకారం వచ్చిన మధూకు అక్కడ కనిపించిందీ, వినిపించిందీ ఎవరికైతే మాత్రం...కలిగించవూ!!



"ఓరేయ్, నువ్వెన్నయినా చెప్పరా నేను మటుకు వినిపించుకునేది లేదు" అని, ఒక్క పోటుతో నేను గంటన్నరనించి—అంటే తొంభై నిమిషాల నించి వాగుతున్నదంతా తీసిపారేశాడు, మా ప్రియతమ స్నేహరాజం, రంగనాధరావు.

"రంగం ! నీ ఇదేం బాగులేదురా. ఎప్పుడూఅమ్మాయిలూ, ప్రేమ అంటూ యిదవుతావ్.నువ్వయ్యేదే కాకుండా నన్ను కూడా నీ ప్రేమ పిచ్చితో బోరుకొడ్తున్నావ్

సికెల్లో లవ్

ముక్కపాటి కృష్ణమూర్తి



"అయినా, నీ పిచ్చిగానీ ఇదంతా ఎందుకొచ్చిన గొడవ చెప్పు. సంవత్సరంనుండీ ఇదే గోలాయె. పట్టుమని ఒక్క అమ్మాయినైనా ప్రేమించావా ? వాడు చూడు—ఆ వెంకట్రావుగాడు—నీలాగా పబ్లిక్ అయ్యాడా ! గుప్‌చుప్‌గా ఆ అరుణను ప్రేమించేసి, నెల తిరక్కముందే పెళ్లాడేశాడు. అలా ఏమన్నా నువ్వూ ఏడువ్. నేనూ శహభాష్ అంటా."

అనే నా సలహానూ, తద్వారా నన్నూ కించ పరుస్తున్న వాడిని చూస్తూ వూరుకోలేకపోయాను. గట్టిగా ప్రశ్నించాను — 'ఏం చేస్తావో చెప్పి ఏడుద్దూ.'

దీపంకేసి చూస్తూ అన్నాడిలా : "మధూ ! నీకో విషయం చెప్తాను. మరెవ్వరితోనూ చెప్పవు కదా ?"

"వూహూఁ నీమీదొట్టు" అన్నాను.

"మరే .... మరి .... ఒరేయ్ మధూ ! నేనే ..."

వాడు అసలు విషయం ఏమిటో చెప్పకుండా నీళ్లు నమలటంతో నాకు చిర్రెత్తుకొచ్చింది.

"వూ .... నువ్వు ?"

"మన ఆఫీసు ప్రక్కనే టైపు ఇన్‌స్టిట్యూట్ లేదూ—దాంట్లో టైపూ, షార్టుహాండూ నేర్చుకుంటూందే—ఆ అమ్మాయి .... "

నాకు కళ్లు గిర్రున తిరిగాయి ఆ అమ్మాయిని తల్చుకోగానే. సినిమాల్లో హీరోయిన్ వేషం కోసం నానా అవస్థా పడి, కొన్ని రోజులు బెట్టుపోయినా, చివరకు రామాయణ భారత కథల్లో తాటకీ, హిడింబీ వగైరా రోల్సుకు అంగీకరించే తరహా మనిషి ఆమె. కుర్చీలో కూలపడ్డాను లోపలకు గాలి పీల్చుకుంటూ.

"ఆ అమ్మాయి కాదురా. ఆ అమ్మాయితో కలిసి బస్సెక్కుతుందీ—ఆ అమ్మాయి—!"

'ఆ అమ్మాయా !' అన్నా ఆవులిస్తూ. అవునన్నాడు. ఆ అమ్మాయి వర్ణించలేనంత అందంగా

బంధువులతో వచ్చిన అభిప్రాయభేధాలు అశాంతికి దారి తీస్తవి. ధన సంబంధమైన చిక్కులు వచ్చేటట్లు తోస్తుంది. కాని దైవబలంవల్ల కావలసిన ధనం సకాలంలో లభిస్తుంది. చాల రోజులకుముందు జరిగిన పొరపాట్లవల్ల ఈ సమయంలో వృధా ఖర్చులను భరించవలసి వస్తుంది. కుటుంబంలోని వారి ఆరోగ్యం బాగుండదు. మీ ఎదుట మాత్రం మంచితనంగా మాట్లాడుతూ, చాటున మిమ్మలను గురించి నిందించేవారు ఉంటారు. మీరు నిబ్బరంతో ఉండటంవల్ల అన్ని విధాలా మేలు పొందగలుగుతారు. 1, 2 తేదీలలో ప్రయాణాలు, దుబారా ఖర్చులు, శుభ వార్తలు.

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

పనుల భారంతో విసుగెత్తే సమయం. మీరు ఒక చిక్కునుంచి తప్పుకొనే సమయానికి మరొక సమస్య ప్రత్యక్షం అవుతూ వుంటుంది. ఆభరణాలు మొదలయినవి కొంటారు. సాటివారిలో గౌరవం పొందగలుగుతారు. విలాస వినోద కార్యక్రమాలు అనుకున్న ప్రకారం జరుగవు. అధికారులవల్ల సహాయం లభిస్తుంది. ఏ వ్యవహారంలోను మొండితనంతో వ్యవహరించతగిన సమయంకాదు. వారం రెండవ భాగంలో అకస్మాత్తుగా ఉష్ణ సంబంధమైన అనారోగ్యం చేయగల అవకాశాలున్నవి. మీ మాటను గౌరవభావంతో అనుసరించేవారు ఉంటారు. వృత్తి ఉద్యోగాలలో మాట చలామణి బాగుంటుంది. 29, 30 తేదులలో అపవాదుల భయం, కార్యభంగం. కష్టవార్తలు తెలుస్త వి

ధనుస్సు :

మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.

ఏ పని చేస్తున్నా యోచన అవసరం అవుతుంది. కొన్ని సందర్భాలలో ముందుగా తెలిసినా, చెడ్డవారితో స్నేహం చేయవలసి వస్తుంది. ఖర్చులు సాధ్యమైనంత మితం చేసుకొనటంవల్ల కొంతవరకు సుఖం పొందగలుగుతారు. ఒకరికి ఉపకారం చేయటం నిమిత్తం మరొకరితో విరోధం తెచ్చుకోవలసిన సమయం. సకాలంలో నిద్రాహారాలు అమరటం కష్టం. ఫలితం చేతికి వస్తున్నదని అనుకొనే సమయంలో ప్రతిబంధకాలు వస్తూ ఉంటవి. రుద్రాభిషేకం, శివసహస్రనామపారాయణం జరుపుకోవటంవల్ల మనశ్శాంతి, కార్యసిద్ధి, గౌరవము పొందగలుగుతారు. శుభ కార్య ప్రయత్నాలు చురుకుగా జరుగవు. 3, 4 తేదులలో ధన లాభము, బంధు దర్శనం, యత్న కార్యానుకూలత.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం ధనిష్ఠ 1, 2 పా)

మాట చెప్పినంత సులభంగా పనులు జరుగక పోవటంవల్ల గౌరవానికి లోపం వస్తుందనే ఆందోళన పట్టుకుంటుంది. వ్యాపార సంబంధమైన లావాదేవీలలో ఎదటివారి మనస్సుకు నొప్పికలుగకుండా చూచుకొనండి. సాధ్యమైనంతవరకు అప్పు చేసి ఆడంబరం చేయటంవంటి పనులకు దిగవద్దు. లోగడ మీరు నిష్కర్షగా మాట్లాడకుండా ఆరంభించిన లావాదేవీలు ఈ సమయంలో చిక్కులకు దారి తీస్తవి. వాహనాలు ఎక్కటము దిగటం మొదలయిన సమయాలలో జాగ్రత్తగా ఉండండి. వ్యవహార రంగంలో ప్రస్తుతం ఉత్సాహం కనుపించదు. ధనాదాయం క్రమంగా పెరుగుతుంది. స్నేహితుల వల్ల కొంతవరకు సహాయం లభిస్తుంది. 30, 31 తేదులలో కుటుంబంలోని వారికి అనారోగ్యం, కార్యభారం.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

అన్ని రకాల వ్యక్తులతోను స్నేహము, లావాదేవీలు ఏర్పడగల సమయం. శక్తికొలది పరిశ్రమ చేసి వృత్తిలో ఎదుటివారి ఆదరాభిమానాలను పొందగలుగుతారు. కొన్ని సందర్భాలలో మీరు తొందరపడినా మీతో కూడా ఉండేవారు సర్దుబాటు చేయటంవల్ల కలహాలు తొలగిపోతవి. వృధాగా జరుగుతున్న ధన వ్యయాన్ని నిలుపుదల చేయగలుగుతారు. నౌకరులవల్ల జరుగతగిన పనులు సకాలంలో జరుగక పోవటంవల్ల విసుగుదల వస్తుంది. పిల్లలకు అనారోగ్యం చేస్తుంది. ప్రయాణాలు అనుకుని నిలుపుకుంటారు. అధికారులను మంచి చేసుకోగలుగుతారు. ప్రత్యేకంగా అనారోగ్యం చేయదు కాని, అసౌఖ్యం తోస్తుంది. 2, 3, 4 తేదులలో దె వకార [illegible]

[illegible]

బంగారు ధర వారం ఆరంభంలో తగ్గి మరల కొద్దిగా పెరుగుతుంది. వెండి ధర నిలకడగా ఉంటుంది. పసుపు ధరలో కొద్ది పెరుగుదల కనిపిస్తుంది.

వేరుశనగ పప్పు ధర పెరుగుతుంది. నూనె ధరలో కొద్ది మందీపస్తుంది. నూవుల నూనె ధరలో తగ్గుదల వస్తుంది. ప్రత్తి ధర నిలకడగా ఉంటుంది. నూలు ధర క్రమంగా పెరిగే అవకాశా లున్నవి.

గోధుమల ధర కొద్దిగా పెరిగి తగ్గుతుంది. కందులకు గిరాకి వస్తుంది. మినుముల ధర పెరుగుదలలో ఉంటుంది. వారాంతంలో తగ్గవచ్చు. చింతపండు ధర పెరిగే అవకాశా లున్నవి.

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

ప్రస్తుతం జరిగే సంఘటనలవల్ల మీ మనసు మీరే నమ్మలేకపోతారు. మనస్సులోని మాటను ఎవరితో చెప్పుకొనటానికి అవకాశం ఉండదు. దైవ సహాయంతో వృత్తి, ఉద్యోగాలలో చిక్కులు లేకుండా జరుపుకుంటారు. మీరు కోరుకునే అభివృద్ధికవి, మార్పులుగాని ప్రస్తుతం జరుగవు. మీతో సహాయం చేస్తామని చెప్పినవారు చేయలేకపోతారు. బంధువులవద్దనుంచి అనుకూల వార్తలు తెలుస్తవి. ఎప్పుడూ ఏదో ఒక విషయాన్ని గురించి యోచిస్తూ ఉంటారు. ఈ సమయంలో న్యాయం కన్నా యుక్తి అవసరం అవుతుంది. ముందు నిశ్చయించుకున్న పనులు సమయంలో మరచిపోతూ ఉంటారు. ఆదాయం మామూలుగా ఉటుంది. 29, 30, 31 తేదులలో ఆందోళన, పిల్లలకు అనారోగ్యం, శుభవార్తలు.



"మానాన్నే అంటించి పెయ్యమన్నాడండి!"

—చిత్రకారుడు: చిల్లరిగె లక్ష్మణరావు (బందరు)

"నా ప్రాణాలను సైతం పోగొట్టుకుంటాను కానీ, ఆ అమ్మాయిని వదలబోనురా." ఒక్కటే మాటలో తేల్చిపారేశాడు.

మర్నాడు ......

తన ఆఫీసు పని ముగియగానే, నా సెక్షన్ కొచ్చి పిలిచాడు. వరండాలో కెళ్లాం.

"వరేయ్, మధూ ! ప్రేమ పాఠాలకు నువ్వింత కాలం నాకు గురువుగా ఉన్నావా, ఈరోజునుంచి నీ గాలి సోకి నేనో గురువున్నై పోతున్నాను అమాంతంగా.

"ఆ అమ్మాయిని కలుసుకోడానికి—భలే అయిడియా తట్టిందిరా ఉదయం కాఫీ త్రాగేప్పుడు" అన్నాడు.

నా కర్థంకాలేదు. "కలుసుకుంటావా ! ఎలా ?"

"డిటెక్షన్ చేసి ఇల్లు తెలుసుకుంటా. నా అయిడియాను ఉపయోగిస్తా. ఫలితం దక్కుతుందన్న నమ్మకం నాకు బాగా ఉంది. ఆ అమ్మాయి ముందు నా హృదయపు లోతుల్లో పాతుకుపోయిన ప్రచండకవిత్వావేశజ్వాలలను మేల్కొలిపిస్తా. ప్రేమభిక్ష పెట్టమని ప్రాధేయపడతాను—"

"ఒరేయ్—కొంచెంసేపు ఆగరా. ఇంకా ఒక ఫైలు మిగిలిపోయింది. దాని సంగతి కూడా చూసి వచ్చేస్తా" అంటూ లోపలకు వెళ్లబోయాను. నా భుజాల్ని పట్టుకుని ఆపాడు.

"మధూ ! ఈ శని ఎప్పుడూ వుండేదేలేరా. నాతో వచ్చెయ్. పనుంది." నేను వాడి పట్టు విడిపించుకున్నాను, బ్రతిమాలా.

"నువ్వెన్నయినా చేస్తావ్. నీకేం కొదువ—బ్యాంకు ఇనస్పెక్టర్లో కావలసినంత మూలుగుతోంది. ఆ ఫైలు యివ్వాళ పంపించెయ్యకపోతే నాకు తిట్లూ తప్పవు—నీపుణ్యమా అంటూ వస్తే గిస్తే పూష్పింగూ తప్పదు !"

వాడేకళనున్నాడో వదిలిపెట్టాడు. జేబులోంచి ఓ కలం తీసి నాకు చూపించాడు. "దీంతోనేరా నా అయిడియా ! ఇదిగో—సరిగ్గా ఓ అరగంటకు బయలుదేరు. బస్సెక్కి, ఇక్కడకు సరిగ్గా ఆరో స్టాపులో దిగు. వీధి గుర్తుకోసం రెండే ధమ్ములు పీల్చిన మన బ్రాండ్ సిగరెట్లను ఆ స్టాపులో పడేస్తా. ఆ సిగరెట్టు చూపిన దిక్కుకురా. అక్కడక్కడా దారిలో చాక్‌లెట్‌చుట్టే కాగితాలు పడేస్తాలే. ఆ అమ్మాయి యింటిముందు పూర్తి సిగరెట్లు చివర్ను కాల్చి ఆర్పి పారేస్తాను.

"నాకేమన్నా అపాయం జరిగితేనా నీకు ఆ గుర్తులు అవసరం. తప్పకుండా రావాలిసుమా !" నేను తలూపగానే వాడు సంతోషంగా వెళ్లిపోయాడు.

నేను ఫైలు చూస్తున్నంతసేపూ—ఆ ఫైల్లో ఫైటింగ్ సీనులే నిండుగా కనిపిస్తున్నాయి. స్టంటు సినిమాల్లో లాగ నలుగురు విలన్‌లు కలిసి రంగాన్ని కొడుతున్నట్లుగా కన్పిస్తోంది.

ఎలాగో కష్టపడి, పది నిమిషాల్లో ఫైలును పూర్తిచేశాను.

బస్సెక్కి ఆరో స్టాపులో దిగాను. రంగం అన్నట్లుగానే మా సిగరెట్టు కన్పించింది. అది చూపిన దిక్కుకు పయన మయ్యాను.

చాకలెట్ కాగితాలు కనిపించాయి. వాటి నాధా

తంగా తీసుకుని వెళ్తున్నాను. కొంతసేపటికి వెతగ్గా వెతగ్గా ఒకచోట కొంచెం కాల్చిన పూర్తి సిగరెట్టు కన్పించింది. ఎగిరి గంతేశాను దాన్ని చూడగానే.

సిగరెట్టు వెనుక నున్నది రెండంతస్థుల భవనం. వీధి తలుపు మూసివుంది.

డి కె పి లి ప్

వీధంతా కలియజూశాను. రంగం కన్పించలేదు. ఏమైనట్టు వాడు ?

ఆ ఇంట్లోంచి ఏవో శబ్దాలు విన్పిస్తున్నాయి. ఎందుకో వినాలనిపించింది. ఎవరూ గమనించకుండా గోడవారగా నిల్చుని చెవులు నిక్కబొడిచి విన్నాను. అనుమానం తీర్చుకోవడం ఎందుకైనా మంచిదని, 'డబ్ డబ్—హూప్ ఆప్' శబ్దాలు విన్పించాయి. స్పష్టంగా.

ఎవరో మూలుగుతున్న ట్లనిపించింది. నా అనుమానం నిజమేనేమో !—

నేను చెప్తే విన్నాడా ? వచ్చి వచ్చి ఈ రాక్షసుల చేతుల్లో చిక్కుకున్నాడు—అమ్మ బాబోయ్. ఎవరో "ఇంకా గట్టిగా .... కణత క్రిందుగా .... పొట్టలో .... కొట్టూ, బుగ్గమీద ...." అని చెప్పి మరీ కొట్టిస్తున్నారు. మావాడు అరవనైనా అరవటంలేదు. గొంతు పూడిపోయి ఉంటుంది. నే నిలా ఆలస్యం చేస్తే కొట్టి చంపేస్తా రనిపించింది.

చెప్పులు తీసి 'రన్నింగ్ రేసుకు' సిద్ధపడి గుండె నిమురుకున్నాను. పోబోతున్న రంగం ప్రాణాన్ని కాపాడా లనుకున్నాను.

ధైర్యంచేసి తలుపు కొట్టాను. మళ్లీ కొట్టాను తలుపు తెరుచుకుంది, మరో నిమిషానికి. నా కళ్ళు గిర్రున తిరిగాయి—ఆ మద్రాసు బాక్సింగ్ విలన్ తలుపు తెరిచినవాడు. వాడికి వళ్లంతా చెమటలు. కళ్లు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి.

నా వళ్ళు నిలువునా వణికిపోయింది. నిల్చోలేక పోయాను.

"ఎవరు కావాలి?" కోపంగా అడిగాడు.

అంతే. చెప్పు లక్కడే వదిలేసి పరుగు తీసాను. (మైలు రేసులో మా కాలేజీ ఛాంపియన్‌ను) అదృష్టవశాత్తు అదిప్పుడు పనికివచ్చింది. అయిదు నిమిషాల్లో అరమైలు దూరంలో ఉన్న పబ్లిక్ టెలిఫోన్‌బూతును చేరుకున్నా. వెనక్కు చూశా. అతగాడేమన్నా వెంటపడి వస్తున్నాడేమో నని. లేదు.

గబగబా నెంబరు చెప్పాను. కనెక్షన్ వెంటనే దొరికింది. రంగం నాన్నగారితో ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో, ఏం చెప్పకూడదో ఏమీ తెలియక—అన్నీ చెప్పేశాను. కళ్లంబడి నీళ్లు కారాయి.

"మీరు వెంకటేశన్ వీధిలోని పదో నెంబరు ఇల్లు .... దాంట్లోనే మన రంగం చావు బ్రతుకుల్లో ఉన్నాడు. వాడ్ని చావగొడ్తున్నారండీ—అవన్నీ తర్వాత చెప్తానుగానీ, ముందు మీరు వెంటనే రావాలి .... లేకపోతే రంగం మన కిక మిగలడు."

ఫోన్ పెట్టేసి, మళ్లీ వెనక్కు పరుగెట్టాను. ఆవీధి మొదట్లో (చాటుగా) మూడు నిమిషాలైందో లేదో ఓ టాక్సీ జోరుగా వచ్చి నా ప్రక్క నాగింది. నే నెక్కగానే బయలుదేరి మరో నిమిషానికి, పదోనెంబరు ఇంటిముం దున్నాం.

రంగం తల్లిదండ్రులు నా కన్నీటిని చూసి మరీ డీలా అయిపోయారు. 'ఎందుకు కొడ్తున్నార' నడిగిం దావిడ, గుడ్ల నీరు గ్రుక్కుకుంటూ. 'ఆ... ఆ .... కొడ్తారు. రాస్కెల్స్ ! వాళ్ల అంతు తేలుస్తాను'. మీసం మెలివేస్తూ, తలుపుమీద చేతి కర్రతో దబదబ బాదారు రంగం తండ్రిగారు.

తలుపు వెంటనే తెరుచుకుంది. ఇందాకటి

విలనే! రంగం తండ్రి గబగబా లోపలకు నడిచారు. రంగం తల్లి కూడా ఆయన వెనకనే లోపల కెళ్ళారు.

జేబులోంచి పిస్టల్ పైకి తీస్తూ, రంగం తండ్రి గదంతా కలియజూశాడు. "ఏడీ మావాడు? ఏంచేశారు—చెప్పండి. లేకపోతే కాల్చిపారేస్తాను. మీ అంతు చూస్తాను ...."

కుర్చీలో కూర్చొనివున్న ఓ మధ్య వయస్కుడు కంగారుగా లేచి నిల్చున్నాడు .... "ఎవరు మీరు .... ఏమిటిది .... మీవా డేమిటీ .... మేము చెయ్యడ మేమిటీ—"

చెప్పి కొట్టించింది ఆయన గొంతే. ఏమీ తెలియని నంగనాచిలా మాట్లాడుతున్నాడు!

"ఒక్కగా నొక్క కొడుకు! నా బాబును నా కిచ్చెయ్యండి—మీ కెంతైనాపుణ్య ముంటుంది." బ్రతిమాలింది రంగం తల్లి.

ఆమెను చూస్తే నాకు దుఃఖం ఆగలేదు. కళ్ల నీళ్లు బొటబొటా కారిపోయాయి.

ఆ మధ్య వయస్కుడు చేతులు జోడించి నమస్కారం పెట్టాడు. "మీరేదో పొరబడినట్లున్నారు .... అస లేమిటి జరిగిందో సావధానంగా కూర్చుని చెప్పండి—" అన్నాడు.

ఆ బాక్సింగ్ విలన్ నా దగ్గరకు రావడం చూసి, హాల్లోకి నడిచాను భయంకొద్దీ.

అంతే. నిర్ఘాంతపోయాను.

హాలునిండా బాక్సింగ్ నేర్చుకునే పరికరాలున్నాయి. దూలానికి రెండు ఇసుక మూటలు వ్రేలాడు తున్నాయి. ఒక మూలగా గడ్డితో చేసిన మనిషి బొమ్మ నిల్చుని వుంది ......

ఇందాక నేను విన్నది ఆ బొమ్మ తాపులు తినడవే నన్నమాట. నా తెలివితక్కువ తనాన్ని నిందించ కున్నాను.

రంగం తండ్రిగారి చెవులో జరిగినదంతా చెప్పాను. ఆయన పగలబడి నవ్వారు. ఆయన భార్య కూడా అసలు విషయం తెలుసుకుని, చిరునవ్వు నవ్వుకుంది. నా వంక చూసి. నేను తల దించుకున్నాను.

ఆ బాక్సరుకూ, ఆ మధ్య వయస్కునికీ గాఢంగా క్షమాపణలు చెప్పుకున్నాక వీధిలో కొచ్చాను.

రంగం తల్లిదండ్రులు కూడా ఇంకో నిమిషానికల్లా వెలుపల కొచ్చారు. అన్ని విషయాలూ విపులంగా చెప్పాను రంగం తండ్రిగారికి.

"ఏమోయ్ మధూ! ఇన్ని రోజుల్నుంచీ మా వాడు పడే బాధ తెలుసుండి కూడా నా తో ఎందుకు చెప్పలేదోయ్."

"ఆ అమ్మాయిదీ పక్కిల్లేట. పదండి" అన్నారాయన.

అంతా ఆ ఇంట్లో కెళ్లాము. ఆ అమ్మాయి తల్లిదండ్రులతో పరిచయా లయినాక, మర్యాదలు జరిగాక, నేను పోర్టికోలో కొచ్చాను రంగం గొంతు విన్పించినట్లుంటే.

గేటు దగ్గర రంగం, ఆ అమ్మాయి మాట్లాడు కుంటున్నారు. "మీరు బస్సు దిగగానే నన్నడిగితే చెప్పేసేదాన్ని. ఇంతదూరం శ్రమపడి వచ్చారు."

"శ్రమ ఏమిటిలెండి. కొత్త పెన్ను. ఎవరో—ఎంత మోజుపడి కొనుక్కున్నారో!—పాపం."

"మీరు '—' ఆఫీసులో గదండీ పని జేస్తున్నారు ?"

"అవునండీ. మీరు శ్రమ అనుకోకపోతే, ఓ గ్లాసెడు మంచినీళ్లిస్తారూ!—"

ఓరి!— వీడి ధైర్యం మండిపోనూ! ఎంతగా మారిపోయాడు — అంకెళ్ళ నొక్కుకున్నాను. పెన్నుతో ఇదా వీడి అయిడియా ....

"రండి—లోపలకు. ఫర్వాలేదు. కుక్కలూ, పిల్లులూ మా ఇంట్లో లేవు. అవ్వంటే మా నాన్నగారికి ఇష్టం ఉండదు—"

"మీపే రేమిటండీ ?"

"లక్ష్మి."

"ఉత్తి లక్ష్మినాండీ—ముందూ వెనుకా ఇంకే మన్నా .... "

"అబ్బే. ఏమీలేవండి." ఇద్దరూ గలగలా నవ్వుకున్నారు.

పోర్టికోలో ఉన్న నన్ను జూసి 'ఎవరు కావాలండీ' అనడిగింది ఆ అమ్మాయి. నన్ను జూసి నిర్ఘాంతపోయాడు రంగం.

'మీ నాన్నగారితో పనుంది' అన్నా నవ్వుతూ.

"లక్ష్మీ' అని కేకేశారు లోపల్నుంచి. ఆ అమ్మాయి రంగనాథంకేసి చూస్తూ లోపలకు నడిచింది.

"ఎవరితోనమ్మా మాట్లాడుతున్నావ్ ?"— లక్ష్మి తండ్రి.

"ఎవరో నాన్నా—బస్సులో నేను కూర్చున్న సీట్లో కన్పించిన ఓ పైలెట్ పెన్ను నా దనుకుని ఇంతదూరం శ్రమపడి తీసుకొచ్చి ఇవ్వబోయాడు—ఆయనకు మంచినీళ్ళ .... "

రంగం తల్లిదండ్రులను చూసి ఆగిపోయింది.

"ఇదేనండీ మా అమ్మాయి. పేరు లక్ష్మి."

లక్ష్మి తల్లిగారు 'పోయి, ఆయనకు మంచినీళ్లివ్వు. లోపలకు రమ్మను' అని చెప్పింది. లక్ష్మి లోపల కెళ్లింది, మంచినీళ్లకోసం.

"ఒరేయ్—సిగరెట్టు గుర్తుగా నువ్వు వదిలేసి వెళ్లావా!—అది కాస్తా పక్కింటి గుమ్మంలోకి కొట్టుకుపోయింది. ఆ బాక్సర్ లక్ష్మికి వరసకి అన్నగా రవుతాడుట.

నాన్నా, అమ్మా లోపలున్నారు. మీ పెళ్లి విషయమే మాట్లాడుతున్నారు ...." అని చెప్పానో లేదో, ఎగిరి గంతేసి—నన్ను కావిలించుకుని గిర గిరా త్రిప్పాడు.

లక్ష్మి మంచినీళ్లిచ్చింది. రంగనాథానికి నన్ను పరిచయంచేశాడుఆమెకు.ముగ్గురంలోపలకు వెళ్లాం.

"ఒరేయ్—నువ్వెక్కడ్నుంచి వూడిపడ్డావురా." రంగం తండ్రిగారు ఆశ్చర్యపోయారు. రంగం చిరునవ్వుతో సమాధాన మిచ్చాడు.


"వాడేనండీ మా అబ్బాయి. పేరురంగనాథరావు."

ఆ అమ్మాయి కిదేమీ అర్థం కాలేదు. తల్లి చాటుకు నడిచింది.

"వరేయ్, మధూ! తిన్న చాక్లెట్లన్నీ కడుపులో పేరుకుపోయిన ట్లున్నాయిరా .... " పొట్ట పట్టుకుంటూ నాతో చెప్పాడు. రంగనాథం.

"అవున్రా మరి. అన్నీ నువ్వే తినేస్తే—ఆ అమ్మాయికీ, నాక్కూడా లేకుండా తినేస్తే పేరుకుపోవూ! వేడివేడి 'ఆమ్లెట్' తింటే అవే కరిగిపోతాయిలేరా. భయపడకు."

అని ధైర్యం చెప్పాను కొత్తరకం 'డిటెక్టివ్' (?) లో విజయదుందుభి మ్రోగించిన మా రంగనాథానికి. ★



మన దేశంలో, ముఖ్యంగా తెలుగునాట వివాహాలవంటి శుభ కార్యాలు ఒకవ్యవస్థగా రూపొంది ఉన్నాయి. ఆ వ్యవస్థకు పెత్తనదార్లు, నిర్వహించేవారు, ఆనందం జుర్రుకొనేవారు, చివరికి అందరిచేత అక్షుతలు వేయించుకొని ఆరాటపడేవారు కూడా స్త్రీలే. మన సమాజంలో వైయక్తికమైన ఆనందంకన్న అధికమైన ప్రాధాన్యం సమష్టి ఆనందానికే అన్నది సత్యదూరం కాదు. ఇంతమట్టుకు బాగానే ఉంది. వచ్చే చిక్కల్లా వివాహ సమయాలలో స్త్రీలు ప్రదర్శించే ఆడంబరమే. అనవసరమైన ఖర్చు దుర్వ్యయ మనదగిన ఖర్చు ఎవరికి కాని మంచిది కాదు. పెళ్ళిళ్ళ రోజులు దగ్గరపడిన ఈ సమయంలో ఈ వ్యాసం గుర్తుకు తెచ్చేది ఆ సంగతే.

మోచర్ల సుబ్బలక్ష్మి

వివాహముయొక్క ఉద్దేశము ఆ దంపతులు యావజ్జీవమూ, సర్వసంపదలతోనూ ఆయురారోగ్యాలతోనూ, అనుకూల దాంపత్యముతోనూ తులతూగవలె ననియే కాని తాత్కాలిక వినోదము కాదు.

చాలా బీదవారైనవారు క్లుప్తంగా ఖర్చు పెట్టుకొంటారు. ధనవంతులైనవారు ఎక్కువ ఖర్చు పెట్టుకుంటారు. వివాహమంత్రములు మాత్రం మారవు. ధనవంతులైనా వారి తాహతుకు మించి ఖర్చు పెడితే ఇబ్బందే పడతారు. ఇక మధ్య తరగతి సంసారులు జరిపే వివాహాలలో ఆడవారి ఆడంబరాలు చూస్తూవుంటే "ఎందుకు వచ్చిన ఆడంబరం, ఒకరోజు పెండ్లికి ముఖమంతా కాటుక చేసుకున్న" ట్లు అనే సామెత జ్ఞాపకం వస్తుంది.

పెద్దపెద్ద మిఠాయి వుండలు

ఆ మధ్య మా బంధువుల ఇంట్లో వివాహం జరిగింది. మిఠాయి ఉండలు బాగా పెద్దవిగా చెయ్యమని ఆవిడ వంటవాళ్లకు పురమాయించింది. "బాగా పెద్ద ఉండలు చేస్తే మీరు చెయ్యమన్న నాలుగు వందల వుండలూ అవవు" అని వంటవాళ్ళు నచ్చ చెప్పారు. "మీరు పెద్ద ఉండలు చెయ్యవలసిందే. మళ్లీ మిఠాయి సరుకులన్నీ తెప్పిస్తాను" అంది. ఆవిడ భర్త "ఏదో జరిగిపోనియ్యవే. మళ్లీ మిఠాయి సరుకులన్నీ తెస్తే ఓ యాభై రూపాయలు అవుతాయి. నా దగ్గర సొమ్ము బొటాబొటీగా ముహూర్తం జరిగే వరకూ సరిపోతుంది. ఇటువంటి ఖర్చులు తల బెట్టావంటే అభాసవుతుంది" అని ఎన్ని విధాలో నచ్చచెప్పాడు. అబ్బే, ఆవిడ వింటేనా? "ఫలానా వారింట్లో పెండ్లికి గొబ్బరి బోండాలంతేసి మిఠాయి ఉండలు చేశారని అంతా నన్ను మెచ్చుకుంటే మీరు చూడలేరన్నమాట. పెద్ద ఉండలు చేసి తీరవలసిందే" అని పంతంపట్టి కూర్చుంది. మళ్లీ మిఠాయికి కావలసినవన్నీ తెప్పించి చేయించారు.

ఇటువంటి పంతాలు చాలామందికి ఉంటాయి. పెండ్లిరోజున ఎవరేమన్నా తలవంచుకొంటే ఎల్లకాలం తల ఎత్తుకోవచ్చును. పెండ్లి ఆడంబరంగా చేసిన తరువాత కొంపా, నగా, నట్రా వేలమ్మైపోతే "అంత ఒళ్లు తెలియకుండా ఖర్చు పెట్టుకోవడమే" మని పెండ్లి సమయంలో బాగా తిన్నవాళ్లు హేళన చేస్తారు.

గానకచేరీ!

మరోరకం మహిళ తన కుమార రత్నం వివాహసమయంలో గానకచేరీ ఉండితీరాలని పట్టుబడుతుంది. ఏ మద్రాసు నుంచో సంగీత విద్వాంసులను రప్పించి కచేరీ చేయించినందువల్ల ఒక గంటకాలం కాలక్షేపం, కొంత ఖ్యాతీ తప్పించి వేరే ఉపయోగం శూన్యం. సంగీతవిద్వాంసుల బృందానికి రాను, పోను మొదటి తరగతి రైలు ఖర్చులూ వేరే. నిర్ణయించుకున్న మొత్తమూ కలిసి తడిపిమోపెడు. అనవసరంగా ఆడంబరానికి ఖర్చుపెట్టిన సొమ్మును ఆ వధూవరులకు అవసరమైన వస్తువులు కొని పెట్టో, లేక బాంకులో వారి పేర వేస్తేనో ఎంత ఉపయుక్తంగా ఉంటుందీ? మన మధ్య రకం మగువలు ఈ ఆడంబరాలు విసర్జిస్తేనే కుటుంబాలలో శాంతి.

పెట్టుబడి చీరలు

చాలాచోట్ల పెండ్లికి వచ్చిన ఆడవా రందరికీ చీరలు పెడుతూ వుంటారు. ఆ చీరలకు పెట్టుబడి చీరలని పేరు. ఇవి యిచ్చినవారికి మొత్తంమీద కొన్ని వందల రూపాయలు ఖర్చు; పుచ్చుకున్నవారికి అవి ఉపయుక్తంగా ఉండవు. నీళ్లలో పెడితే వెలిసిపోవటం, పొట్టి అవడం జరుగుతూవుంటాయి. మంచి నాణ్యమైనవీ పెట్ట నక్కరలేదు. నాసిరకం పెట్ట నక్కరలేదు. ఈ బట్టలు పెట్టాలనే ఆడంబరాన్ని ఆడవారు విడనాడితే పెండ్లిలో కొంత ఖర్చు తగ్గుతుంది.

సంభావనలు

ఘనాపాఠీలకు రూపాయి చొప్పునా కొద్దిగా వేదం చదువుకున్నవారికి అర్ధ రూపాయి చొప్పున యజ్ఞోపవీతం ఉండి చెయ్యి జాపినవాళ్లందరికీ పావలా చొప్పునా భూరి సంభావనలు వివాహ సమయంలో ఇస్తూవుంటారు. ఆ సంభావనల తతంగానికి కొన్ని వందల రూప్యములు ఖర్చు. "ఫలానావారింట్లో వివాహ సమయంలో సంభావనలు గొప్పగా ఇచ్చా" రని, వూరూరా చెప్పుకోవాలనే ఉద్దేశ్యంతో ఆడవారూ, మగవారూ సంభావనల విషయంలో ఏకాభిప్రాయము కలిగివుంటారు.



పిల్లలగౌన్లకు, రేడియో కవర్‌కు

1. ఒకటవ డిజైనులో 3 నంబరున్నచోట లేతగులాబి, 7 నం. నారింజపండురంగు, X గుర్తున్నచోట ఆకుపచ్చ, 5 నం. కు పసుపుపచ్చ, 8 నం. కు బ్రౌను కలర్సువేస్తే బాగుంటుంది (పిల్లల గౌన్లకు). 2. 1 నం. దగ్గర ఎరుపు, X గుర్తుకు ఆకుపచ్చ, 3 వ నం. కు పింకుకలరు, 4 నం. నీలం, T గుర్తు దగ్గర నలుపు (కార్నరు డిజైను). 3. కలువపువ్వుకు 1 నం. నుండి 1 నం. వరకు ఎరుపు, అలాగే 2 వ నం. నుండి 2 వ నం. వరకుగులాబి, 4 వ నం. నీలిరంగు, 6 నం. వైలెట్, X గుర్తు ఆకుపచ్చ, 9 వ నంబరు పొడుంరంగు, దారాలువేసి కుడితే అందంగా కనబడుతాయి (రేడియోకవరుకు).

—ఎమ్. వి. కాంతం (రూర్కెలా-2)

"చదివింపులు"

పెండ్లికి వెళ్లిన ఆడవారు చాలామంది చదివింపుల సమయంలో పోటీలుపడి వధూవరులకు రొక్కం రూపకంగానూ వెండి గ్లాసులూ, గంధపు గిన్నెలూ చదివిస్తూ ఉంటారు. మా స్నేహితురాలు పెండ్లిలో పెండ్లికూతురు కని సభలో చదివించినవి పదహారు గంధపు గిన్నెలు, ఇరవై కుంకుమ భరిణెలూ నే స్వయంగా చూశాను. అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఇంకా పుస్తకాలూ, వెండి గిన్నెలూ వగైరా సామానులు వచ్చాయి. కానీ గంధపుగిన్నెలూ, కుంకుమభరిణెలూ వంటివి అన్ని ఉపయోగించుకోవటం సాధ్యపడదు. అసలు ముఖ్యమైన బంధువులు వాళ్ల వాళ్ల తాహతునుబట్టి సొమ్ము రూపంగా పెండ్లికుమార్తెకు ఇచ్చేస్తే ఆమెకు యిష్టమైన వస్తువు ఆమే కొనుక్కుంటుంది కదా ? పెండ్లికి వచ్చినవారంతా ఏదో ఒకటి యివ్వాలనే పట్టింపు వారికీ, వీరికీ కూడా వుండకూడదు. పెండ్లికి వెళ్లటం అంటేనే రాను పోను ఖర్చులకు సొమ్ము చూసుకోవాలి కదా ? ఇవికాక పెండ్లిలో కట్టుకోవలసిన చీరలూ, రవికెలూ పిల్లలకు విలువైన బట్టలూ కొందరు అప్పోసప్పో చేసికొనేస్తూ ఉంటారు. ఒకరోజో రెండు రోజులో ఉండి వచ్చే పెండ్లి ప్రయాణానికి ఇంత ఆర్భాటం ఎందుకో ? తమకు ఉన్న చీరలలో మంచివి ఆ రెండు రోజులూ జరిగిపోయే దానికి కట్టేసుకుంటే తీరిపోయేదానికి ఇంత ధనవ్యయం చేస్తారుమన ఆడవారు ఆడంబరంకోసం.

వరశుల్కం

అటు వరకట్నాలు బ్లాక్‌మార్కెట్టులో చలామణి అయిపోతుంటే ఇటు ఇటువంటి ఆడంబరాలు ఆచరించటం అవివేకం. వరశుల్కం తీసుకో కూడదనే నియమంతో స్త్రీలంతా వరకట్న పిశాచిని తరిమివేస్తూ లాంఛనాలంటు తగవులు పడకుండా, వివాహ సమయంలో ఆడవారు ఆడంబరం ప్రదర్శింపకుండా వుండే మంచిరోజులు ఎప్పటికి వస్తాయో మరి.

మోచర్ల సుబ్బలక్ష్మి (భీమవరం.) ★

మగపిల్లలకు యూనిఫాంషర్టు

ఇది 5, 6 సం. లోపల ముగపిల్లలకు చాలా ముద్దుగా ఉంటుంది. పిల్లలు కాస్త బొద్దుగా ఉంటే మరీ బాగుంటుంది. ఏ రకం షర్టింగ్ గుడ్డ అయినా బాగానే ఉంటుంది కాని, పల్చని నైలాన్, సిల్కు, టెరిలిన్ మొదలగు నాజూకు గుడ్డలు చాలా బాగుంటాయి. బొమ్మలు, ఆవారా ప్రింటు మొదలగునవి కూడా బాగుంటాయి. తెల్ల వాటిపై ఎంబ్రాయిడరీ చేసినా చూడ ముచ్చటగా ఉంటాయి. పెద్ద పన్నా అయితే ముప్పావు, గజం పన్నా అయితే గజం కావాలి. మా అబ్బాయి 3 సంవత్సరములవాడు. వాడికి అన్నీ ఈమాదిరివే వాడతాము. కాస్త ఓపిక ఉన్నవారు రకరకాల గుడ్డలు కలిపి సూట్ అయ్యేలా పైపింగ్ అవీ ఇచ్చి కుట్టితే రెడీమేడ్ వాటికి మల్లే చాలా బాగా ఉంటాయి.


ఈ దిగువ ఇచ్చిన కొలతలు 3 సం. ల అబ్బాయికి సరిపోతాయి. అయినా మరి ఒక్కసారి పిల్లవాడి కొలతలు, అనగా భుజాలు, షర్టు పొడవు, చేతి పొడవు, చుట్టు లంబు మొదలగునవి ఒక్కసారి టేపుతో తీసుకుంటే ఇంకా కరెక్టుగా వస్తుంది. కుట్టులో లోగడ కొంత అనుభవం ఉంటే సులభంగా నేర్చుకోదగ్గ షర్టు. శ్లాకు కన్నా తేలిక.


1. ఈ షర్టు ఆకారము మొదటి బొమ్మలో చూపిన విధంగా ఉండును. ఫ్రంట్ ఓపెనింగుతో ఉండును. ఎంబ్రాయిడరీ చేయ తలంచినవారు కాలరుమీద, గుండెలమీద, సన్నని పూలు, డిజైనులు కుట్టవచ్చును. కాలరు, చేతి మడతలు వేరే రంగు గుడ్డతో ఉ : తెలుపుమీద నీలం, పసుపుమీద ఎరుపు, ఇష్టం వచ్చినట్లుగా కూడా మార్చవచ్చును. క్రింది మడత పోను 12 అం.ల పొడవు చాలును. కావాలంటే ఎక్కువ తక్కువలు చూచుకోవచ్చును.


2. బాడీ ఏవిధంగా కట్ చేయవలసినదీ చూపబడినది. షోల్డర్ లేక భుజాల కొలత 10" తీసుకొని ముందుగా మార్కింగ్ ఛాక్‌తో గాని, పెన్సిల్‌తో గాని గీసుకుని ఆ ప్రకారము మెడ, వాలుగా భుజాలు, చంక కత్తిరించవలెను. చంక కత్తిరింపు బొమ్మలో విధంగా అర్ధ చంద్రాకారంగా ఉండవలెను. తరువాత భుజాలు అతికి ముందు ముక్కను ఫ్రంట్ ఓపెనింగ్ వరకు నడిమికి కట్ చేయవలెను. విప్పినచో 2 ఎ లో వలె వచ్చును.


3. క్రింది భాగం షర్టు ఏవిధంగా కత్తిరింప వలసినదీ చూపబడినది. ఫ్రిల్‌కు గాని, లేక (డాట్స్) మడతలకు గాని, బాడీ కొలత 10" కన్న కొద్దిగా ఎక్కువ తీసుకొనవలెను. బాణము గుర్తు ఎక్కువ బట్ట అని అర్థము. పల్చని గుడ్డ అయితే ఈ ఎక్కువ గుడ్డ మరి కాస్తగా తీసుకొని, సూదీ దారముతో దూరంగా పోగు పోసుకొని (— — —) దగ్గరగా లాగినచో సన్నని ఫ్రిల్ ఏర్పడును. మందమయిన బట్ట అయితే, చేతితో ముందు భాగంలో 4 టక్కులు, (2 × 2) వెనక 4 టక్కులకు సరిపడ బట్ట ఎక్కువ ఉంచుకోవలెను. అంటే 10" బాడీ వెడల్పయితే 14" తీసుకుంటే ఎక్కువ 4" టక్కులకు (4 ముందు, 4 వెనక) సరిపోవును. ఈ గుడ్డ చివర కూడా అర్ధచంద్రాకారములో కొద్దిగా బొమ్మ చివర చూపినట్లుగా కత్తిరించి, 3 ఎ లో వలె పై బాడీకి అతకవలెను. అంటే బాడీ అర్ధ చంద్రం, క్రింది బట్ట అర్ధచంద్రం కలిస్తే మొత్తం చంక కటింగ్ అవానలన్నమాట. ఇది 12" ఉండును. సుమారుగా మొత్తం చంక కొలత.

4. బాడీ క్రిందిభాగం షర్టునూ అతుక్కున్న తరువాత దానికి సరిపడ్డ చేతులు 4 వ బొమ్మలో చూపబడినట్లుగా కత్తిరించవలెను. కుట్లు, మడతలు పోను, 7" పొడవు తేలిన చాలును. ఈ














'సుశీలా మహంతి'














కాలరను ముందు వట్టే కుట్టి, క్రింది భాగం జాయింటు చేసిన తరువాత (4 ఎ) చేతులను అతికించవలెను. కొలతలు తీసుకొనేటప్పుడు కుట్లకు మడతలకు కొద్దిగా మినహాయించవలెను.

5. కాలరు ఏవిధంగా కత్తిరింపవలసినదీ చూపబడింది. స్క్వేర్ బట్టలు రెండు తీసుకొని, చిన్న స్క్వేర్‌గా కాలరుకు సరిపడినంతగా 4 మడతలు మడిచి, ఛాక్‌తో మెడకు సరిపడినంత కొలతతో 5 ఎ, మాదిరి కట్ చేయవలెను 5 ఎ ఫ్రంటుకు వచ్చును. 5 బి, వెనకభాగం కాలరు. అంటే ఈ రెండూ కలిసి (5) మాదిరి ఆకారంలో వచ్చును. ఈ రెండు గుడ్డలను, రాంగ్ సైడ్ కుట్టి రైట్‌సైడ్ తిప్పవలెను. ఆ తరువాత తయారుచేసిన షర్టు (4 ఎ) మెడకు అతకవలెను.

6 కొన్నిటికి బ్యాకు ఓపెనింగ్ పెట్టి ఇప్పుడు విరివిగా వస్తున్న బ్రాడ్ (వెడల్పు) కాలర్‌ను బొమ్మలో మాదిరి కుట్టుదురు. దానిమీద చిన్న చిన్న కుందేళ్లు బాతులు మొదలగు బొమ్మలు కాని, డిజైనులు కాని కుట్టినను, లేక కాలరు అంచుకు పైపింగ్ వేసిననూ ఎంతో బాగుంటాయి.

6 ఎ. లో ఈ బ్రాడ్ కాలర్ ఏవిధంగా కత్తిరించ వలసినదీ చూపబడినది. కొన్నిటికి పూర్తి గుండ్రం కాలరు పెట్టుకోవచ్చు. కొన్నింటికి ముందు భాగం మాత్రమే కాలర్ రౌండుగా కుట్టి, ఎంబ్రాయిడరీ చేయవచ్చును.

కొన్ని షర్టులు (స్లీవ్‌లెస్) చేతులు లేకుండా ఈ బ్రాడ్ కాలర్లలో రెడీమేడ్ దుస్తులు వస్తున్నాయి. ఇవి ముఖ్యంగా 3 సం లలోపు పసిపిల్లలకు ముద్దుగా ఉంటాయి. చారల గుడ్డలు కూడా బాగుంటాయి.

నేరుగా గుడ్డపై కత్తిరించడానికి ధైర్యం చాలకపోతే ముందు న్యూస్‌పేపర్‌పై కట్ చేసుకుని ఆ తరువాత ఆ ప్రకారము గుడ్డను కట్ చెయ్యండి. అదే మంచి పద్ధతి.

షర్టు కొలతలు :—బాడీ పొడవు 4". క్రింది భాగం గుడ్డ పొడవు 12". (మడతకు 2" పోతుంది). బాడీ వెడల్పు 10". చంక కొలత 12". చేతి పొడవు 8". బాడీ చంక 4". క్రింది భాగం 2" (ఒకవైపు). ★

విద్యార్థి—మీరు చెప్పిన పాఠం 'గైడ్'లో ఉన్నట్లే ఉందండి.

ఉపాధ్యాయుడు-ఆ 'గైడ్' నేను వ్రాసిందే.

—కె. షిన్‌నారాయణరావు
(విశాఖపట్టణం)



వనితా వాణి

ప్లాస్టిక్ వైరతో పువ్వులు

1—3—61 వ తేదీ పత్రికలో ఆర్. ప్రభావతిమూర్తిగారు వ్రాసిన ప్లాస్టిక్ వైర్‌తో పువ్వులు అల్లి చూశాను. చాలా బాగున్నాయి. అచ్చం ముద్ద గులాబీపువ్వుల్లా ఉన్నాయి. ప్రభావతిమూర్తిగారికి నా అభివందనములు.

—అంగర హరిహరబాయమ్మ (హైదరాబాద్)

* * *

అల్లం మురబ్బా

8—3—61 వ తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రిక వనితాలోకం శీర్షికలో శ్రీమతి ఆర్. కె. ప్రేమవతి (యాళ్ళూరు) గారు ఎవరికైనా అల్లం మురబ్బా తయారు చెయ్యడం చాతనైతే పత్రిక ద్వారా తెలియచెయ్యమన్నారు గనుక మా ఇంట్లో చేసుకొనే విధానం వ్రాస్తున్నాను.

కావలసిన సరకులు :

అల్లం : పావుశేరు.
చక్కెర : అర్ధశేరు.
పటిక బెల్లం : 10 తులాలు.

ముందుగా అల్లం శుభ్రంగా నీటిలోవేసి కడిగి, మీది తొక్కనంతటిని తీసివేయాలి. తరువాత ఒక్కొక్క అల్లంముక్కను పీటమీద చాకుతో ముందు నిలువుగా ముక్కలు (పలచగా) కోసి, తరువాత అడ్డంగా చిన్న చిన్న ముక్కలుగా కోసుకొని ఉంచుకోవాలి. పటిక పంచదారను మెత్తగా గుండ కొట్టి, దళసరిగాఉన్న శుభ్రమైన గిన్నెలో పావు శేరు నీళ్ళుపోసి, అందులో యీ పటిక బెల్లంగుండ పంచదార వేసేసి, పంచదార కరిగిపోయేలా కలిపేయాలి. తరువాత సన్నని నిప్పు సెగమీద యీ గిన్నెనుపెట్టి లేతపాకం వచ్చేవరకు ఉంచాలి (అనగా గులాబ్‌జావ్ పాకంలాగ) అప్పుడా పాకంలో అల్లం ముక్కలుపోసి బాగా కలియబెట్టి, కిందకుదింపి చల్లారనిచ్చాక, తినేయటంకాదు సుమండీ! దాన్నొక శుభ్రమైన సీసాలోవేసి, గట్టిగా మూతపెట్టి నాలుగు రోజుల తరువాత (ఈ నాలుగు రోజులలో లోపల అల్లం ముక్కలు పాకంలో నానుతాయన్న మాట) జాగ్రత్తగా మూత తియ్యాలి సుమండీ. ఉదయాన్నే కొద్దిగాతింటే కడుపునొప్పి, మల బద్ధకం యిలాటివన్నీ మాయమైపోతాయి.

కుమారి కాంతం మంథా (రూర్‌కెలా—2; ఒరిస్సా)

* * *

మన అభిమాన పత్రికలో శ్రీమతి ఆర్. కె. ప్రేమవతిగారు అల్లం మురబ్బా చేయు విధానము తెలుపమని కోరారు. నాకు తెలిసినది చెప్పుచున్నాను.

కావలసిన సామానులు :

½ కప్పు వెన్నకాచిన నెయ్యి.
పావుశేరు అల్లం.
2 పావుల జాన్‌సన్ చక్కెర.
కావలసిన వారికి ఎసెన్సు, ఏలకులు.

చేయు విధము :

అల్లం బాగా కడిగి మట్టి లేకుండా తుడిచి దానిని కొబ్బరి కోరుతో తురిమి స్టీలు గిన్నెలో చక్కెరపోసి కొద్దిగా నీరుపోసి పాకం వచ్చేదాకా కలపాలి. లేత పాకం అప్పుడు ½ కప్పు నెయ్యిపోసి ఈ తురిమిన అల్లంపోసి బాగా కలుపుతూ వుండాలి. బాగా గట్టి పడి బురుగు బురుగుగావచ్చి చేతికి తేలికగా కన పడినప్పుడు పళ్లెంలోపోసివెయ్యాలి. మనకు కావలసిన సైజులో బిళ్ళలు కొయ్యాలి. పలకలు పలుకలగా వస్తుంది. బరిఫి మాదిరి ఎన్ని రోజులన్నా నిలువ వుంటుంది.

—కె జాంబవతీ కాశ్యప (బళ్లారి)

* * *

తట్టె

8—3—61 వ తేదీన వెలువడిన మా పత్రికలో ఎం. సుగుణగారి (కారైకుడి) తట్టె అను మధ్యాహ్నపు టిఫిన్ మా యింటిలో చేశాము. చాల బాగా వచ్చిందని చెప్పుటకు ఆనందించుచున్నాను.

—పి నాగరత్నమ్మ (ఆరూరు)

వెన్నప్పాలు

8—2—61 వ తేదీ పత్రికలో జి. సూర్య కాంతంగారు వ్రాసిన వెన్నప్పాలు వండి చూచినాము చాలా బాగా కుదిరినవి

—ఎమ్. కమలాదేవి (భువనేశ్వరం—ఒరిస్సా)

మిక్శ్చర్

8—3—61 వ తేదీ పత్రికలో శ్రీమతి ఎం. సుగుణగారు వ్రాసినట్లు మిక్శ్చర్‌చేసి చూచాము. చాలా బాగావచ్చింది. శ్రమ పడవలసి ఉంటుంది. నేర్పుతోచేస్తే ఫలితం దక్కుతుంది. మీ (మా) పత్రికలో పాకశాలకుగాను ఒక పేజి నిర్ణయించి

నందుకు నా ధన్యవాదాలు. మిక్సర్ చేయడానికి అన్ని వివరాలు తెలిపిన శ్రీమతి ఎం సుగుణ గారికి నా ధన్యవాదాలు

—వేదం జగదీశ్వరి (మద్రాసు)

మూంతా

1—3—'61 వ తేది ఆంధ్ర సచిత్ర వార పత్రికలో కె. నిర్మలదేవిగారు వ్రాసిన గుజరాతి పిండి వంట "మూంతా" నేను తయారుచేసి చూచాను చాలా బాగా కుదిరింది వనితాలోకం పాకశాలను ఆంధ్ర వంటకములకే అంటిపెట్టక వివిధ వంటకములు తెలియజేస్తున్నందుకు చాలా సంతోషం

—రెహన రహమాన్ (నాగపూర్)

పెప్పర్ వడ

8—3—61 వ తేది పత్రికలో సోదరి ఎం సుగుణగారు వ్రాసిన పెప్పర్వడ చేసిచూస్తే చాలా బాగా కుదిరింది. మిగతా వంటలు కూడా చాలా బాగా వున్నాయి.

—జె ఎస్ వి. కరుణ (రాజమండ్రి)

కూరల మాటు?

సోదరీమణులు వివిధ రకములైన పిండివంటల పత్రిక ద్వారా తెలియజేస్తూ ఉన్నందుకు చాల సంతోషిస్తూ ఉన్నాము ఇకముందు రుచికరములగు కూరలువండే విధానము కూడా తక్కిన సోదరీమణులకు వార పత్రిక ద్వారా తెలియజేస్తారని ఆశిస్తున్నాము

—పంచాళి శుభరత్నం (భిలై)

'అయినవారూ కానివారూ'

కపిల పద్మగారు వ్రాసిన ఈవ్యాసం చాలా సహజంగా ఉంది

మన జీవితంలో ఏమైనా, అంటే, ఏవిషయమైనా బాగా ఆలోచిస్తే, దాన్నిగురించి నిజం తెలుసుకోవచ్చుగానీ, మనకు అయినవా రెవరో, కానివా రెవరో తెలుసుకోవడం మాత్రము చాలా కష్టము. నాకూ, ఇటువంటి అనుభవము ఉంది

ఉమారెడ్డి (బెంగుళూరు)

* * *

15—3—61 వ తేదీ పత్రిక వనితాలోకంలో పద్మగారు వ్రాసిన 'అయినవారూ కానివారూ' చాలా బాగుంది "అయినవారితో చెప్పటంకన్న రోడ్డు మీద పోయేవాళ్లతో చెప్తే వాళ్ళు నిజంగా సంతోషిస్తారు" అన్నది అక్షరాలా నిజం. ఇటువంటి ఉత్తమమైన వ్యాసాన్ని వ్రాసిన పద్మ గారికి, దానిని ప్రచురించిన ఆంధ్రసచిత్రవారపత్రికకు నా హృదయ పూర్వక అభివందనములు

కుమారి సుందరి (గుడివాడ)

* * *

ఈవారం (15—3—61) పత్రికలోని 'వనితాలోకం' శీర్షిక క్రింద కపిల పద్మ వ్రాసిన 'అయిన వారూ, కానివారూ' వ్యాసం బాగుంది. నిజంగా నేటి స్త్రీలలో కొంతమంది వారియొక్క స్వవిషయాలను చెడువైనా, మంచివైనా ఇతర స్త్రీలతో చెప్పేవా రున్నారు. కాని 'ఇంటిగుట్టు లంకకు చేటు' అన్నట్టు అవుతుంది వారి పని. అందు

వనితా వాణి

వలననే 'అనవసరంగా, అమాయికంగా రాసుక పూసుకుపోయి, విషయాలేవీ సంప్రతించవద్దు' అని చాలా చక్కగా వ్రాశారు.

'కుమారి చిర్ల రత్నమాంబ' వ్రాసిన 'సఖ్యం సాప్తపదీనం' కూడా చాలా బాగుంది. స్నేహమును స్నేహితులను, వారియొక్క మనస్తత్వాలను చాలా చక్కగా విపులీకరించారు. 'స్నేహమనే విత్తనమును జాగ్రత్తగా నాటి సహృదయమనే నీరు పోసి మహావృక్షమును చేయవలె'నని వ్రాసిన వాక్యం కడు రమ్యంగా ఉంది. ఈ చక్కని రెండు వ్యాసములు వ్రాసినవారుభయులు కృతజ్ఞతార్హులు.

కొండపల్లి లక్ష్మి (హనుమకొండ)

* * *

కపిల పద్మగారు వ్రాసిన వ్యాసం చదివాను ప్రస్తుత పరిస్థితులన్నీ అలాగే ఉంటున్నాయి. మన మేదో అప్పులని, స్నేహిత బంధువర్గాలను చూసి మురిసిపోతూ ఉంటాము అది అంతా పైపై మెరుగే అని కొన్ని సందర్భాలలో బయటపడక మానదు. వారికి నా ధన్యవాదాలు.

ఎస్ రాధిక (మచిలీపట్నం)

* * *

15—3—61 వ తేదీ పత్రికలో కపిల పద్మ వ్రాసిన వ్యాసం ఎంతో బాగుంది. అయినవారు కాని వారెవరో మనం తెలుసుకోలేము వారి పని అయ్యేదాకా మనతో ఎంతో ప్రేమగా మాట్లాడి వారి అవసరం తీరిన తరువాత మనం ఎవరో తెలియనట్లు ఉండేవారు ఎంతోమంది ఉన్నారు మా అక్కయ్య ఉంది ఆమెకు ఏవి చూపించినా ముచ్చటకు అయినా బాగుంది అనదు. మనం ఏదన్నా పనిచేసినా, వస్తువులు చూపించినా బాగున్నవి అంటే మనకు ఎంతో సంతోషముగా ఉండును. వనితాలోకం యింకా మంచి వ్యాసాలతో ఎప్పుడూ కన్నుల పండువుగా ఉండాలని మా కోరిక. పద్మగారికి నా ధన్యవాదములు

ఒ. రోహిణి (విజయపురి)

సరళ సలహా యధార్థం

1—3—61 వ తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో సరళగారు లావు కాయస్థులు, సన్నటి వారిని గురించి వ్రాసిన విషయములు యథార్థమునకు ఎంతయు సత్యదూరము కానేరవు. గాని ఇప్పట్లో మనలో చాలామంది మనసా వాచా లావు కాయస్థులపై సానుభూతి సమరసభావము చూపించరు. సరికదా ! వారిలో ఏదో లోపమున్నట్లు, తగని నేరము చేసినట్లు వా రెంత నిర్దోషులయినను, నిర్మలహృదయు లైనను ఎగతాళి చేయడమే ఘనంగా వూహిస్తారు. నా పరిసరాల్లో లావుగా ఉన్న వ్యక్తులను సన్నని వారు నిర్హేతుకంగా విమర్శించడము తటస్థించింది. ఇకనుండి అయినా వారు (సన్నపాటి వ్యక్తులు) తమ తప్పును గురించి సరళగారి సలహాను సహృదయతతో ఒప్పుకుంటారని తలుస్తాను. నా మిత్రురాలు కోమల ఈ విషయంలో సుప్రసిద్ధ రచయిత షేక్స్పియర్ చెప్పిన ఒక్క వాక్యము గుర్తుకు తెస్తుంది. అదియే "The lean hungry looking man was very dangerous". షేక్స్పియర్ యొక్క అనుభూతిని మనము పొందగలమేమో.

ఎస్. రాధ (బేగంపేట-హైదరాబాద్)

* * *

1—3—61 వ తేదీ పత్రికలో "సరళ సలహా" బొద్దుగా ఉండే స్త్రీల విషయం చాలా ఉన్నది ఉన్నట్లు తెలిపారు. వారికి ధన్యవాదములు.

పై మాటను మా యింట్లో చదివి వినిపించగా "ఆమెయూ నీబోటిదే గావోసు, అందు కలాగ వ్రాశా రన్నారు"—ఏది ఎలా ఉన్నా చక్కని అనుభవం వాక్కులవి. పోతే నాకొక ధర్మ సంశయము. చిన్ననాటినుండీ ఉండే బొద్దు శరీరాలు, సరళగారి సలహాలు యదార్థం కానీ ఏహో అనారోగ్య నడసిరి వార్ని సడన్గా ఉబ్బిపోయినా, వారిలో కుత్రలు, కోపాలు, కొంపలు తీయటాలు చాలా ఉంటాయని నా అనుభవం దీనికే మందురు ? ఎలాగయినాబొద్దు శరీరం వారి పట్ల సరళగారి సలహా ఎంతయో సత్యము

లక్ష్మిరాణి (బెంగుళూరు) ★

సిగ్గు ఎందుకు ?

కొంచెము చదువుకున్న అమ్మాయిలు ఎక్కడికి వెళ్లినా 'నీకు కూడా సిగ్గు ఎందుకమ్మా? చదువుకున్నదానివి' అని అడగడము మనలో అలవాటు అలా ప్రశ్నించిన వారికి జవాబు ఇవ్వడానికి తటపటాయించాల్సి వస్తుంది

ఒకసారి నేను, మా చెల్లెలు ఒకచోట పుట్టిన రోజు పేరంటమునకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ ఒకావిడ మా చెల్లెల్ని అలా అని ప్రశ్నించింది. 'చదువుకుంటే సిగ్గు ఉండకూడదా ?' అని తిరిగి వారినే ప్రశ్నించాము. ఆవిడ నవ్వుకున్నారు. చాలా మంది ఉద్దేశములో చదువుకుంటే ఆడపిల్లలకు స్త్రీసహజమైనసిగ్గు అనవసరం అనిపిస్తుందికాబోలు.

చదువుకున్న అమ్మాయిలకు కొందరికి మగవారి సమక్షములో మాట్లాడడము సిగ్గుగా ఉంటుంది. కొందరు స్త్రీలకు టీపార్టీలకు, డిన్నర్లకువెళ్లడముఅంటే బ్రహ్మప్రళయంలా ఉంటుంది.

ఈ సిగ్గెందుకు అనే ప్రశ్న నన్ను చాలా కాలంనుండి ఆలోచనలో ముంచుతూంది దీనికి సమాధానము ఏం చెప్తాం ? ఏమైనా ఇలా చదువుకున్న అమ్మాయికి సిగ్గెందుకు అని అడగకుండా ఉంటే మంచిదని తోస్తుంది

నీ కెందుకు సిగ్గు అని ఎవరయినా ఎత్తిపొడుపుగా అంటే ఎంత కష్టంగా ఉంటుందో ఆలోచించండి. బి. ఎ., ఎం. ఎ. ప్యాస్ అయినా అమ్మాయిలు భర్త పేరు చెప్పడానికి సిగ్గుపడటం లేదూ ? స్త్రీకి అలంకారం సిగ్గే. ఎందుకు అంటే ఏం చెప్తాం ?

సి హెచ్. సుభద్ర (నరసాపురం) ★

ప్రాచీన ఆంధ్ర వాస్తు విశేషము

ఆమంచర్ల గోపాలరావు

(గత సంచిక తరువాయి)

ప్రాచీన ఆంధ్ర శిల్పులు సాధించిన కొన్ని ప్రత్యేక వాస్తురూపములు కార్లిగుహాయందు కూడ కాననగును. ఈదివ్యగుహాయొక్క ప్రధానవాస్తుభావము అద్భుతమందు జనించిన, శ్రద్ధా వినయముల ననుసరించిన నిర్వేదము. గౌతమబుద్ధుని జననమాది, మహా పరినిర్వాణమువరకు, ఆతని జీవితమంత ఒక అద్భుతవిశేషము. జననము, మహాభినిష్క్రమణము సంబోధి, ధర్మచక్ర ప్రవర్తనము, మహా పరినిర్వాణము మొదలయిన ఆతని జీవితాంశము లన్ని పరమాద్భుతవిశేషములే. అందుచేత గౌతమ బుద్ధుని తలచినంతనే. ఒక పరమాద్భుత భావముద యించుట సహజము. తదనుసారితముగా ఆ మానవుడు వినయ శ్రద్ధల నలవడించుకొని, నిర్వేదము నందికొని, అర్హత్వమునుపొంది తరింపవలయును. బౌద్ధమత రూపురేఖ లా నాడవి కార్లిగుహా వాస్తువు కూడ ఈ రూపురేఖలనే నిర్వచించినది. నూట ఇరువది నాలుగు అడుగుల పొడవున, నలువదిఆరు అడుగుల వెడల్పున, నలువది అయిదు అడుగుల ఎత్తున ఆ కొండరాతియందు బౌద్ధమును నిర్వచించుతూ, మలచిన ఆ అద్భుత హర్మ్యము, శ్రద్ధా వినయములను సంపూర్ణముగ అనుభవించుచూ, నిర్వేద మార్గమును సూచించుచునే ఉన్నది


ఇంతేగాక నాటివరకు మన దేశమందు పరిపాటి అయిన వాస్తు సంప్రదాయములనుండి, బయల్పడుచూ, తమ వ్యక్తిత్వభావమునూ, స్వేచ్ఛానువర్తనీ అనుభవించుచూ, ప్రబల కృషిచేసి, భారతమునకేగాక, లోకమునకే ప్రాచీనాంధ్రులు ఒక నవ్య వాస్తు రూపమును ఈ మహా చైత్యమందు ప్రదర్శించిరి.

ఈ గుహా నిర్మాణక్రమము ప్రాచీన క్రైస్తవ చర్చిలను పోలినదని కొందరు పాశ్చాత్య వక్తలు తొందరపడి అన్నమాట వాస్తవము. ఈ గుహ నిర్మితమయిన తర్వాత రెండు మూడు శతాబ్దములకు నిర్మితములయిన క్రైస్తవ చర్చిలను ఈ దివ్య వాస్తువు అనుకరించినమాట వట్టి భ్రమ అని చెప్పకతప్పదు. నిజముగా మధ్య ఆసియాలో జననమందిన క్రైస్తవమతము కొంతవరకు బౌద్ధమునే అనుకరించినదని కొందరి మహాపండితుల అభిప్రాయము. ఆ రీతిననే, విదేశములందలి క్రైస్తవులు, అంతకుముందే బౌద్ధమత మంకురించిన దేశమందే రూపమునందుకొని, బుద్ధరూపమును నిర్వచించిన వాస్తుక్రమమును, తమ చర్చిల నిర్మాణములందు అనుకరించిన మాట మాత్రము సత్యమనవచ్చును. ఈ దివ్య చైత్యనిర్మాణమునందు ఆంధ్రులు ప్రప్రథమమున వాస్తువును దారుస్వరూపములనుంచి తొలగించి, సంపూర్ణమయిన శిలారూపముల నిర్వచించి, మనదేశమందు తర్వాత నిర్మితములయిన సర్వ బౌద్ధ చైత్యములకేగాక, విదేశములందలి క్రైస్తవులకు గూడ, ఒక క్రొత్త దారి చూపిరి. అంతకుపూర్వమునుంచియే మన దేశ శిల్పులు నూతన వాస్తు రూపములను పరీక్షించుటకు, రాతియందే ప్రథమమున తొలచి చూచుకొనెడివారు. ఆ అలవాటు ననుసరించే, ప్రాచీనాంధ్ర శిల్పులు మన దేశీయులకేగాక, విదేశీయులకు గూడ కార్లీవద్ద కొండను మలచి ఒక నవ్య, దివ్య వాస్తు రూపమును శాశ్వతముగా ప్రదర్శించిరి.

ఈ కార్లిగుహాయందు ప్రాచీన ఆంధ్ర స్థపతి ప్రదర్శించిన ప్రత్యేక నూతన వాస్తు గతి ఒకటి చైత్యాంతర్భాగమున స్తంభములందు కాననగును మనదేశమందు ఈ మహా చైత్యమును నిర్మించుటకు పూర్వము మలచిన చైత్య గుహా లన్నింటియందును, స్తంభములు రాతివే అయినను, వట్టి చతురస్రములుగాను, ఏటవాలుగాను, దారుశిల్ప రీతిని అభాసించుచూ ఏర్పరచిరి. ఏలననగా ఈ గుహల వాస్తుక్రమమంతయు ఆనాటివరకు హైందవశిల్పు లెరిగిన హర్మ్య వాస్తువు ననుసరించినది. అప్పటివరకు మన దేశమందలి హర్మ్యములకు ఆధార చట్రములు దారు నిర్మితములే. ఆ చట్రముల ననుసరించి, ఇటుకలతోను, రాళ్లతోను నాడు కట్టడములు నిర్మితములయ్యెడివి. కొయ్య చట్రములపై నాధారపడిన అర్ధ వలయ ప్రచ్ఛదములను నిలుపుటకు మోటించిన ఏటవాలు కంబములు, ఆ వాస్తువులకు అవసరమయినవి. కాని సంపూర్ణ శిలామయ వాస్తువులందు, ఇట్టి ఏటవాలు స్తంభము లవసరములేదని, ప్రప్రథమమున ఆంధ్రశిల్పులు గుర్తించిరి. హైందవ వాస్తు చరిత్రయందు ప్రథమమున నిటారు స్తంభములను కార్లి గుహలందు మలిచి, శిలా వాస్తువునందు ప్రాచీన ఆంధ్ర శిల్పులు ఒక ప్రధాన అంశమును నిరూపించిరి క్నారి, గుహాలయము హైందవ వాస్తు చరిత్రలో ఒక ప్రధాన ఘట్టము

ఈ గుహాయందలి స్తంభ రూపము కూడ శిలావాస్తువున కవసరమగు పుషి కలిగి, సంపూర్ణ స్తంభరూపము నందికొని, దేశమందు నవ్య వాస్తు రూపములకు ఒక కొత్త దారి కూడ కల్పించినది. అంతకుపూర్వము కానవచ్చు స్తంభ రూపములు, దారువును అనుసరించి, పుష్టి నందుకొనని, వట్టి చతురస్రములు. అంతవరకు మనదేశమున మలచిన గుహలందలి స్తంభములన్నియు, మూలమునుంచి శిఖరమువరకు ఒకే రీతి చతురస్రములు అయినప్పటికిని దేశమందు శిల్పులు పూర్ణ స్తంభ రూపమును వెదకికొనుచూ, కృషి చేయుచునే ఉండిరి. మౌర్యులనాటి అశోక స్తంభములు, శిరస్సుపూర్ణముగానే ఏర్పడినప్పటికిని, దారు లక్షణములను వదలలేదు. తర్వాత బారాహత్తు స్థూప ప్రాకార ఫలకములందునూ, అటు తర్వాత మలచిన శాంచి తోరణముల వయినను కూడ, స్తంభ రూపములు శిల్పించి కానవచ్చును. ఇవి చతురస్రములుగానే కన్పడినను, శిరోభాగములు పూర్ణముగానే ఏర్పడి ఉన్నవి. కొన్ని స్తంభరూపములందు మూలమునందు సంపూర్ణ స్తంభరూపము ఏర్పడినట్లు కనుపించును. అశోక స్తంభరూపములను నాటివరకు హైందవ శిల్పులు పూర్తిగ నతిక్రమింపలేకపోయిరి.

కాని కటక్కు గుహాలలో, అనంత గుహాయందు ఒక ద్వార బంధమున కిరువైపుల పూర్ణ స్తంభ రూపమును హైందవ శిల్పులు ప్రదర్శింప ప్రయత్నించిరి. ఈ గుహ నిర్మాణము బారాహత్ స్థూప ప్రాకారశిల్పములకు కూడ కొంతకాలము పూర్వమే అయిఉండవచ్చునని పండితాభిప్రాయము. ఇచట ఆ శిల్పులు ప్రదర్శించిన స్తంభరూపము పరిపూర్ణమయినది. ఒక త్రిఫలకపీటముపైన కుంభము నుంచి ఆ కుంభమందొక చతరస్ర కంబమును నిలిపి, ఆ కంబ శిరోభాగమున ఒక పద్మమును నిలిపి, పద్మముపై నొక పేటికా స్వరూపమును నిలిపి, పూర్ణ స్తంభ రూపమును వారు సూచించిరి. ఈ రూపమందు కుంభమునుంచి వెలువడు కంబము పూర్తిగా చిత్రపద్మములచే నలంకృతమయినది. కంబ శిరోభాగముననున్న పద్మపు రేకులు ఒక వరుస క్రిందకునాలి ఒక వరుస పై ముఖమై వికసించినవి.



ఈ పద్మము పైనుంచిన పేటికమీద మృగ రూపము లను ఆ శిల్పులు మలిచిరి. స్తంభ వాస్తువునకు ఆ శిల్పులు సూచించిన భాగములన్నియు క్రిందనుంచి వరుసగా పీటము, అధిష్ఠానము అశ్యము, కుంభము గ్రీవము, ఫలకము, బోధికలుగా అన్వయించి, ప్రథమమున పూర్ణస్వరూపమున కార్లి గుహయందు ఆంధ్ర శిల్పులు సాహసించి, నిర్మించి నూతన మార్గమునకు దర్శకులయిరి.

నిజముగా మన హిందూ దేశ వాస్తుచరిత్రలో పూర్ణ శిలావాస్తువునకు, ఈకార్లిగుహ ప్రథమ సోపానము. ఇందు విదితమయిన స్తంభ రూపము ఆ తర్వాత మనదేశమందు క్రమముగా వికసించిన అనేక స్తంభ రూపములకు, మూలరూపము. దక్షిణ దేశమందు విజయనగర సామ్రాజ్య కాలమువరకు కూడ ఆనాటినుంచి స్తంభరూపములు అనేక రీతుల మారుచూ వచ్చినను, ఈ పునాది రూపము నంటుకొనియే మారుచూ వచ్చినవి. ఈ స్తంభ రూప క్రమము ననుసరించే పశ్చిమమున చాళుక్య వాస్తువందును, ఉత్తరమున నాగర వాస్తువునందునూ, స్తంభవాస్తువు క్రమముగా అనేక రీతుల వికసించినది. అందుచేత ఈ కార్లి గుహ ఆంధ్ర వాస్తువందేగాక, హైందవవాస్తుచరిత్రయందు కూడ ఒక ప్రబల స్థానము వహించినది. తరువాత మన దేశమందు నిర్మితములయిన అనేక బౌద్ధచైత్యములకును; పాశ్చాత్యదేశములందు నిర్మితములయిన తొలి చర్చిలకును, ఆదర్శక వాస్తు రూపమును

ప్రాచీన ఆంధ్ర వాస్తు విశేషము

నిర్వచించిన మహా శిల్పసౌధ నిర్మాత అయిన ప్రాచీన ఆంధ్ర స్థపతి శిల్పులు బ్రహ్మతుల్యులని మనమనుకొనవచ్చును.

ప్రాచీన ఆంధ్ర వాస్తువునందు మరొక ప్రత్యేకత ఆంధ్ర గర్భమున అమరావతీ, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, ఘంటసాల మొదలయిన చోట్ల నాటి ఆంధ్రులు నిర్మించిన స్తూపములందు కాననగును. స్తూపనిర్మాణములందలి ఆంధ్ర ప్రత్యేకతను అనేకమంది పండితులు గమనించి విమర్శించిరి. ఆంధ్రులు తమ దేశమందు నిర్మించిన స్తూపములకు, బాహ్యమున ఆయక వేదికలను అయక స్తంభములను, అంతర్భాగమున పునాదులందు విచిత్ర చక్రములను నిర్మించి, తమ స్తూపములను కట్టికొనిరి. ఆయక వేదిక, స్తంభములు కలిసి ఒకటి అయిన ఆ వాస్తు ఖండము, జయ సూచకము, పతాక హస్తమందు అయిదువేళ్ళ నిటారుగా నిలుచురీతి అయిదు ఆయక స్తంభములు ఆయక వేదికపై నిలిచి ఉండును గౌతమ బుద్ధుని, అతని జీవితమందలి ప్రధాన అద్భుత ఘట్టములను అనుభావించు ఈ అయిదు ఆయక స్తంభములు, ఆయక వేదికలపై, ఆంధ్ర స్తూపము నుంచి నలుదిక్కుల వీక్షించుచూ, బుద్ధినివలెనే విజయమును అనుభావించుచూ, నిలిచి ఉండును. వ్యక్తిత్వమును సంపూర్ణముగానే అనుభావించుచున్న నాటి ఆంధ్రులు, సామూహిక జీవనమును ఎంతమాత్రము కోలుపోలేదు. అందుచేత నూతన బౌద్ధమును అవలంబించిన ఆంధ్రులు, తమ పార్శ్వమందే నివసించుచూ, తమ జాతివారే అయిన వైదికమతస్థుల దేవాలయములనుమించి, తాము నిర్మించిన బౌద్ధ స్తూపములకు విజయసూచకముగా ఆయక వేదికలను, స్తంభములను నిర్మించి, తమ విజయమును శాంతియుతముగాను, నిశ్శబ్దముగాను, ఎట్టి వైషమ్యములు ఉదయింపజేయకుండు రీతిన ప్రకటించిరని మన మూహింపవచ్చును.

నాడు తక్కిన హిందూ దేశ మంతటను వైదిక మతము, ఏ రీతిన నున్నను, మన ఆంధ్ర భాగమున మాత్రము వైదిక మతమును అనుభావించుచూ, గొప్ప గొప్ప దేవాలయములు మిక్కిలి వైభవముగానే ఉండెడివనుమాట వాస్తవము. క్రీస్తుకు దాదాపు నూట ఏబది సంవత్సరాలకు పూర్వమే ఆంధ్ర దేశమున రచనయయిన బృహత్ కథా గ్రంధమందు, వైదిక దేవాలయ ప్రశంసలున్నవి. అయినప్పటికి పల్లవుల వాస్తువులకు పూర్వము నిర్మితములయిన హైందవ దేవాలయ శిథిలములేవియును, మునుపు


లభింపనందువలన, అనేకమంది పండితులు పల్లవులనాటివరకు వైదిక దేవాలయ వాస్తువులు దేశమున లేవనీ, వైదిక దేవాలయ వాస్తువు—పల్లవుల తోడనే ప్రారంభమయినదనీ కూడ అభిప్రాయ పడి ఉండిరి. కాని పురాతత్వశాఖవారి కృషివలన, ఇటీవల నాగార్జునకొండవద్ద లభ్యమయిన శిధిలములందు, వైదిక దేవాలయముల శిధిలములు, సంస్కృత శాసనములు కూడ బయల్పడినవి ఈ దేవాలయములు పల్లవ రథముల నాటికి, కనీసము మూడు శతాబ్దములకు పూర్వము నిర్మితములయినవి

నాగార్జునకొండవద్ద కనుపించిన వైదిక దేవాలయ శిధిలములు, అష్ట భుజస్వామి, కార్తికేయుడు పుష్పభద్రస్వామి, దేవసేనలకు అంకితములయిన నాలుగు దేవాలయములవి. వీటియందు, కార్తికేయాలయమునకు దక్షిణ ముఖముగా అరువదినాలుగు కాళ్ల మంటప శిధిలములు కూడ ఉన్నవి అనగా నాటికే శైవ, వైష్ణవ, శాక్తేయుల దేవాలయములు మంటపములతో సంపూర్ణ రూపమున మహా వైభవముగా నిర్మించు సంప్రదాయము ఆంధ్ర దేశమున పరిపాటి అయినట్లు మనము వూహింపవచ్చును.

పల్లవులు దక్షిణమున వైదిక దేవాలయ వాస్తు క్రమమును ఉదహరించిన తర్వాత, ద్రావిడ వాస్తువు కనీసము ఏడు ఎనిమిది శతాబ్దములు వివిధ పరిణామముల నందికొనుచూ, వికసించి, విజయనగర రాజుల కాలమందే అనుబంధ రూపము లయిన మంటప రూపములతో పరిపూర్ణరూపమునందికొనగలిగినదని చరిత్రాంశము తొలిని ఒక వాస్తు రూపము జనించినదాది అనుబంధ రూపములతో, ఆ వాస్తువు పూర్ణరూపమునకు వికసించుటకు కొన్ని శతాబ్దములు పట్టును ఈ విషయము అన్ని దేశముల వాస్తు చరిత్రలందును విదితమే. నాగార్జునకొండ వద్ద దొరకిన వైదిక ఆలయముల వాస్తు రూపములు, మంటపములాది అనుబంధ రూపములతో పరిపూర్ణమయినవి. అందుచేత మన ఆంధ్రమున ఆనాటికి కనీసము మూడు నాలుగు వందలేండ్లనుంచి వైదిక దేవాలయ వాస్తువులు పరిపాటి అయినట్లు మనమూహింపవచ్చును

కాబట్టి మనము ఎరుగగలిగిన ఆంధ్రుల చరిత్ర ఆదికాలమునకు కొన్ని శతాబ్దములకు పూర్వము నుంచియే ఆంధ్రమందు కోటల వాస్తువులతో పాటు, దేవాలయముల వాస్తువు కూడ వికాసమందుచుండెడిదని మనమూహింపవచ్చును. అందుచేత బౌద్ధ యుగ ప్రారంభమునాటికే ఆంధ్రమందు దేవాలయ వాస్తువు సంపూర్ణ వికాసమునందికొని అతివైభవోపేతమయి ఉండి ఉండవలయును కాబట్టి నూతనముగా, బౌద్ధము నవలంబించిన ఆంధ్రులు తమ స్థూపములను అతి ఉత్సాహమున, దేవాలయముల మించునంత వైభవముగా నిర్మించి పసిపిల్లల చందమున విజయసూచకముగా, పతాక హస్తములనదగు, ఆయక వేదిక స్తంభములను ఏర్పరచినట్లుగా అనిపించును.

బ్రహ్మ, పరబ్రహ్మను దర్శించుటకు వెళ్ళి జయమని పలుకుచూ, పతాక హస్తమును చూపెనని నాట్యాచార్యులు చెప్పుకొను ఒక గాథ. బౌద్ధ ఆంధ్రులు, వైదిక ఆంధ్రుల దేవాలయముల కెదురగా తమ స్థూపమున నిర్మించి, తమ స్థూపములకు వారందరినీ తోరణములతో ఆహ్వానించుచూ విజయమని పల్కుచూ ఆయక స్తంభములను, ఆయక వేదికలపై నిలబెట్టిరి



భట్టిప్రోలుస్థూపపునాదులందుచక్రం

స్థూపముల అంతర్భాగమందు, పునాదులందు ఏర్పరచిన చక్రములు కూడ, ఆంధ్ర స్థూప నిర్మాణమందు ఒక ప్రత్యేక విశేషమే. ఈ చక్రముల సయితము వట్టి బండి చక్రములవలెగాక, చిత్ర పద్మములను పోలినవి పునాదులందు ఈ పద్మములను ఇటుకలతో నిర్మించి, వాటిపై గోడలను నిలబెట్టి, చట్రములుగా ఏర్పరచి, ఆంధ్రులు తమ స్థూపముల నిర్మించిరి. కాని ఈ చక్రములన్నీ ఏక రూపమునలేవు. అందుచేత ఈ చక్రములు స్థూప నిర్మాణ క్రమమును ఉద్దేశింపలేదనీ, వీటి భావము వేరయిఉండుననీ గ్రాహ్యము. హైందవ దేవాలయ వాస్తు సంప్రదాయములు, బౌద్ధ యుగ ప్రారంభమునకుముందే జీర్ణించుకుపోయిన ప్రాచీన ఆంధ్ర జాతి, బౌద్ధ స్థూపములను కూడ, దేవాలయములకు వలెనే తాంత్రిక సంబంధములైన చక్రములతో పునాదులందే పునీత మొనర్చి, బౌద్ధ స్థూపములను నిర్మించు నుద్దేశముతో ఇట్టి చక్రయుత నిర్మాణమునకు పూని ఉండవచ్చునని మనమూహింపవచ్చును. నూతన మతము నవలంబించినప్పటికినీ, జాతి సంప్రదాయములను నిర్లక్ష్యముచేసి వీడలేని అద్వయభావమును, ఈ చక్రము లనుభావించునని మనమనుకొనవచ్చును. ఇట్టి అద్వయభావమే, నాడు ఆంధ్ర గర్భమందు వాసము చేయుచున్న నాగార్జునుని ప్రేరేపించి, మాధ్యమిక సిద్ధాంత ఉదయమునకు కారణమైనదని కూడ మన మనుకొనవచ్చును. ఇట్లు ఆంధ్ర గర్భమున నాగార్జునునియందు ఉత్పన్నమయిన మాధ్యమిక సిద్ధాంతము, తర్వాత మహాయానము, తదనుసారితముగా యోగాచారము మొదలయిన ప్రచండసిద్ధాంతములకు, బౌద్ధ మతమందు దారితీసి, బౌద్ధమతరూపమునకే ప్రబల మార్పులు తెచ్చినది.

ఈ ప్రత్యేక వాస్తుక్రమము, మనదేశమందు వాస్తురూపములందు ఎట్టి పరివర్తనమునకునూ దారి చూపకున్ననూ, ఒక గొప్ప మతముయొక్క ముఖమునే మార్పింపగల ప్రచండ స్పందనలు కలిగియున్నమాట సత్యము. నిజముగా ఆంధ్ర గర్భమందు ఏర్పడిన ఆంధ్ర స్థూప వాస్తు విశేషములు అనేక ప్రచండ పరివర్తనములకు గుప్తమూలములయినవని మనమనుకొనవచ్చును.

(ఇంకావుంది)

కొడుకు లెక్కల పేపరు చూస్తున్న తండ్రి-అబ్బాయీ, ఇదేమిటిరా, మాస్టారు ఎఱ్ఱ సిరాతో సున్నచుట్టితే ముందు నల్లసిరాతో నాలుగు వేశావేమిరా ?

కొడుకు — నా దగ్గర ఎఱ్ఱ సిరాలేదు నాన్నా.

—ఎనమండ్ర సూర్యనారాయణరావు
(గంగవరం)

చిట్టి షికారు

అది ఒక చిన్నతోట, ఆ గ్రామములో కెల్ల అది ఒక్కటే. ఇంకేమీ ఇళ్ళు లేవు. ఆతోట యజమాని పోలయ్య. అక్కడేఉన్న ఒక పొదలో ఒక కుందేలువుంది. ఆ కుందేలుకు నలుగురు పిల్లలు. కుచ్చుతోకది చిన్ని, పొట్టి తోకదిగున్ని, మచ్చలతోకదిపొన్ని, వంకర తోకది చిట్టి. అదిశీతాకాలం. బాగా చలి వేస్తోంది.

తల్లి కుందేలు ఒకనాడు వీరిని పిల్చి "మీరు ఇంట్లో ఉండండి. నేను పట్టణానికివెళ్ళి రొట్టెలు పట్టుకు వస్తాను. మీరు ఆ పోలయ్య తోటకేసి మాత్రం వెళ్ళద్దు" అన్నది. అప్పుడు చిట్టి "ఎందుకు వెళ్ళకూడదూ?" అని అడిగింది. "ఎందుకా, కొంటె కోణంగీ? నువ్వు అలా అడుగుతావని నాకు తెలుసు. వాడే మీ నాన్నను పొట్టలో పెట్టుకున్నాడు. వెళ్ళద్దంటే వెళ్ళకూడదు. తెల్సిందా!" అని సముదాయించింది. గొడుగూ, సంచీ తీసుకొని, గుట్టలూ, పుట్టలూ దాటి 40 మైళ్ల దూరంలో ఉన్న పట్టణంలోకి బయలు దేరింది.

చిన్ని, పొన్ని, గున్ని పూలు ఏరుకు రావడానికి దగ్గఱలో ఉన్న చెట్టు వద్దకు వెళ్ళారు. ఇప్పుడు ఇంట్లో చిట్టి ఒక్కడే ఉన్నాడు. వాడికి ఏమీ తోచడం లేదు. ఏంచెయ్యాలి? వాళ్ళమ్మ పోలయ్య తోటకు ఎందుకు వెళ్ళవద్దందో తెలియడంలేదు. "ఎందుకు వెళ్ళకూడదూ?" ఊహు! వెళ్ళితీరాలి". ఇలా అనుకుంటూ ఉన్నాడు చిట్టి. "ఇంట్లో నేను ఒకణ్నేగా ఉన్నది! ఎవరూ అడ్డుపెట్టడానికి లేరుగా?" అనుకుని పోలయ్య తోటకు బయలు దేరాడు చిట్టి.

తోటతలుపు వేసి ఉంది. "ఎలాగా" అని అటు ఇటూ చూస్తు

పి. వెంకటరాయశర్మ




న్నాడు.ఇంతలో చిట్టికి ఆ తలుపు కింద కొంత ఖాళీగా ఉన్నట్లు కన్పించింది. నెమ్మదిగా దూరాడు. కానీ వీపు అంతా గీరుకుపోయింది. మెల్లగా లోపలికి దూరాడు. వెళ్తున్నాడు. ఒకచోట వాడికి చిక్కుడుకాయలు కన్పించాయి. కొరికిచూశాడు. కొంత రుచిగా ఉన్నాయి. ఇంకా కాస్త పోతే చామదుంపలు కనిపించాయి. వాటినికూడా కొరికిచూశాడు. అబ్బనాలుక దురదపెట్టుతోంది. నొప్పి! అనుకుంటూ పరుగెత్తాడు. ఒకచోట ముల్లంగి కన్పించింది, వాడికి. రుచిచూశాడు. "బలేబావుంది" అనుకున్నాడు. అక్కడేవున్న రాయిమీద కాలిమీద కాలు వేసుకుని దర్జాగాకూర్చుని తింటున్నాడు. కాసేపుఅలాకూర్చుని బయలుదేరాడు చిట్టి. ఉన్నట్టుండి వాడికి ఘుమఘుమవాసన వేసింది. అటుచూశాడు. అక్కడ గులాబీపువ్వులు వున్నాయి. ఒకదాన్ని తెంచి వాసన చూసుకుంటూ బయలుదేరాడు.

చిట్టి షికారు

కాసేపు అలా వెళ్తూ వెనక్కు చూశాడు. ఏమయిందో తెలుసా! వాడిశత్రువు పోలయ్యే. గుండె దడ దడ లాడింది. ఎలాగా అనుకుని ఒక్క ఉరుకు ఉరికి పరుగెత్తాడు. వెనక్కుచూశాడు. పోలయ్య ఇంకా వస్తూనే ఉన్నాడు. పరుగెత్తాడు. అంతా బురదగా వుంది. ఎలా? వాడికి చెప్పులు కూడా వున్నాయి. చెప్పులు బురదలో చిక్కుకు పోయాయి. ఎలాగ? వెనక్కెళ్తే పోలయ్యకు చిక్కుతాడు. పోతే పోయాయని వెళ్ళిపోతే అమ్మ కొడ్తుంది. అది వాడి పుట్టినరోజు నాటిచెప్పులు. మొన్నవాడి పుట్టిన రోజున వాళ్ళమ్మ కొత్తచొక్కా కొత్తలాగులు కొనిపెట్టింది. ఇప్పుడు చెప్పులు పోయాయి. ఇంక చొక్కా లాగులు వున్నాయి. ఇంకా పరుగెత్తాడు. అక్కడ ఒక ముళ్ళపొద ఉంది. వాడి చొక్కాలాగూలు, దానికి రాసుకుపోయి చిరిగి పోయాయి. ఇంక ఇంటికి వెళ్ళితే అమ్మ కొడుతుంది. అందుకని ఇంటికి వెళ్ళద్దనుకున్నాడు చిట్టి. అవి అక్కడే పడేసి పరుగెత్తాడు. అక్కడ ఒకపాక ఉంది. అందులో దూరాడు. అందులో నీళ్ళకాగు ఒకటి ఉంది. అందులో దూరాడు. అందులో నీళ్ళున్నాయి కాబోలు. వళ్ళంతా తడిసిపోయింది. అసలే శీతాకాలం బాగా చలివేస్తోంది. అందులో చల్లటి నీళ్ళల్లో దిగాడు. బాగా చలి వేస్తోంది.

పోలయ్య వీడిని వెతుక్కుంటూ పాకలోకి వచ్చాడు. వాడిని చిట్టి చూశాడు. గబుక్కున బయటకు చూశాడు పోలయ్య. చిట్టి బయటకు రాగానే త్రొక్కి చంపుదామని చూశాడు. కాని చిట్టి కిటికీలోంచి ఒక్కసారి దూకాడు. బాగా చలి వేస్తోంది. పోలయ్య చిట్టి ఇంకదొరకడని వెనక్కివెళ్ళి పోయాడు. చిట్టి అక్కడే ఉన్న చెరువులో ఒకచేప మెరుస్తూ ఉండటం చూశాడు. గట్టు దగ్గర ఒకపిల్లి ఆ చేపకోసం అటూ ఇటూ తిరుగుతోంది. అక్కడికి వెళ్దామనుకున్నాడు చిట్టి. కాని వాడికి పిల్లిని నమ్మకూడదని గుర్తుకు వచ్చింది. ఇంకెక్కడా దారిలేదు. ఎక్కడికి వెళ్తాడు. ఆ తలుపు దగ్గరకు వెళ్దామని చూశాడు. కిటికీ లోంచి పాకలోకి దూకాడు. వెళ్తున్నాడు. వచ్చేదారిలో పోలయ్య ఒక కఱ్ఱకు చొక్కా, లాగూ, చెప్పులూ కట్టడం చూశాడు. మెల్లిగా తలుపు దగ్గరకు వెళ్ళి దూరి గబగబా ఇంటికి వెళ్ళాడు.

అక్కడ వాళ్ళమ్మ వీళ్ళకోసం మిఠాయిలూ, రొట్టెలూ తెచ్చింది. చిట్టి ఇంటికి వెళ్ళేసరికి వాళ్లమ్మ వీడు ఇలా ఉన్నాడేమిటని చెయ్యి చూసింది. జ్వరం వచ్చింది. రాదూ మరి నీళ్లల్లో నానితే! వాళ్లమ్మ అందుకని వైద్యుణ్ణి పిలిచింది. వైద్యుడు వచ్చి "ఫరవాలేదు. ఇవాల్టికి లంఖణం పెట్టండి!" అన్నాడు. గున్ని,



పొన్ని, చిన్ని చక్కగా చిట్టి వాటా కూడ తిని ఆడుకున్నారు. మరి చిట్టి అమ్మ వెళ్లద్దన్న చోటికి వెళ్లి జ్వరంతో వచ్చాడు. అందుకని వాడికి ఏమీ లేవు. చిన్ని, పొన్ని, గున్నిలకు తిండితోపాటు చొక్కాలాగులు, చెప్పులు కూడా వున్నాయి. పాపం! చిట్టికి ఏమీ లేవు. "ఏం చేద్దాం!" అని చెప్పి తాతయ్య కథ ముగించాడు. అప్పుడు చంద్రం "తాతయ్యా నిన్నటికథ కంటే ఇవాల్టిది బావుంది. ఇంకో వీరగాథ ఏమన్నా ఉంటే చెప్పు" అన్నాడు. అప్పుడు తాతయ్య "అన్నీ ఇప్పుడే నట్రా తర్వాత చెప్పుతానురా" అన్నాడు. చంద్రం ప్రక్కగదిలోకి వెళ్ళినకాస్సేపటికి ఆగదిలోనుంచీ ఒక కేక విన్పించింది. "ఏమిట్రా" అని తాతయ్య, సీత, బాల, సూర్యం, చలపతి, రాఘవులు వెళ్ళారు. చంద్రం అక్కడపడక కుర్చీలో కూర్చోబోయాడు. కాని, దానిగుడ్డ ఎవరో తీసేశారు. అందుకని వాడా వూపు తట్టుకోలేక అరచాడు. తాతయ్య "ఎవరు దాని గుడ్డ తీశార్రా" అన్నాడు. అధికారపూర్వకంగా. అప్పుడు బాల "చిన్నతమ్ముడు బాబ్జీ దానిని తీసేశాడు. ఎందుకంటే వాడిని పక్కబ్బాయి కొట్టాడు. వాడికి కోపమువచ్చి దీనికఱ్ఱను వాడిని కొట్టడానికి తీసుకొనిపోయాడు" అన్నది.

అప్పుడే బాబ్జీగాడు వచ్చాడు బొగ్గు పూసుకున్న మసిముఖంతో. వాడిని చూచేసరికి నవ్వు వచ్చింది. "ఏమిట్రా" అంటే పక్కింటిఅబ్బాయి తనని పడేసి బొగ్గు పూశాడట. "సరేగాని రాత్రవుతోంది పడుకోండ్రా" అన్నాడు తాతయ్య. ★


దురాశ

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

చాలా కాలము క్రిందట
జాలరి వాడొక్కడుండె
పాలలోన నివసించుచు
ఆలితోడ సంతృప్తిగ
దినదినము సముద్రములో
తనకు దొరకు చేపలన్ని
కొనితెచ్చుచు విక్రయించి
దినవెచ్చము తీర్చుకొనును.
ఒకదినమున తనవలలో
నికి వచ్చెను పెద్దచేప
చకితుండయి వల లాగగ
సకరుణముగ చేప పలికె.
"నేను చేపనంచు దంచి
పూనితిపినావు నీవు;
కాని సముద్రపు రాజును
మౌని శాపమున మారితి.
"కృపతో నను విడిచిన వో
ఎపుడు కృతజ్ఞుడను నీకు;
ఉపకారం బేదైనను
నిపుణత నొనరింపగలను."
"నిను జూచిన జాలి గలిగె
చనుము యథాస్థానమునకు
మనసున నేకోర్కె లేదు
నిను నర్థింపంగ నాకు."
అని జాలరి తనయింటికి
చని జరిగిన వృత్తాంతము
తన భార్యకు చెప్పినంత
మనమున నుప్పొంగె నామె.
"వనధిరాజు కడకు నేగి
మనకొక చక్కని గృహమును
మనవిచేసి అడిగి రమ్ము
తనివితీర నివసింపగ."
అని సతి ఆజ్ఞాపింపగ
చని ఆతడు జలధి కడకు
వనధిరాజు వరమీయగ
తనయింటికి మరలివచ్చె.

తన తొల్లిటి పాల పోయి
ఘనతర సౌధమ్ము నిలిచె
తనసతి యెదురై స్వాగత
మునుపల్కుచు ముదము నింపె.
కొంత కాల మిటు లేగగ
కాంతకు సంతృప్తిలేక
చింతిలి ఆజలధిరాజు
చెంతకేగ పతినంపెను.
"ఈ సౌధము మద సౌఖ్యపు
వాసమునకు పనికిరాదు
భాస మానమగు కోటను
ఆ సంద్రపు రాజు నడుగు."
అని జాలరి నంపగ నె
మ్మనమున నిష్టంబు లేక
తన సతి కోపించు నేమొ
అని భయమున బయలుదేరె
జలధిరాజు వరమిచ్చెను
కలకల లాడెడు కోటను
తులదూగెడు సౌఖ్యరాశి
వెలలేని ముదంబుగూర్చె.

సతిదురాశ కంతులేదు
పతిని మరల పోవుమనియె
క్షితి కంతటికిని రాణిగ
నతని వేడి చేయుమనుచు
జాలరి కోరికను దీర్చి
చాలును, మరి వరము లడుగ
బోలదంచు నబ్ధిరాజు
చాల నిష్ఠురముగ పలికె.
తానింటికి పోవు సరికి
మానిత సింహాసనమున
కానుపించె తన సతి ఆ
సీన యగుచు కొలువు దీర్చి.
"ఈ రాణీ పదవి నాకు
నేరీతిని చాలదింక
ఆ రవి చంద్రులపై నధి
కార మడిగి రమ్మువేగ"
అని సేవకు నాజ్ఞాపిం
చిన విధమున పతిని తరిమె
వనధి రాజు కోపగించి
చనియె నిజావాసమునకు.
తనదురాశ ఫలిత మపుడు
అనుభవించె జాలరి సతి
తన రాణీత్వము కోటయు
ఘనసౌధము నేలగలిసె. ★



చిత్రకారుడు—పి. ఎస్. శాస్త్రి (గుల్బర్గా)



జూల్స్ వెర్న్ నవల

80 రోజులలో భూప్రదక్షిణం

అనువాదం :

ఎస్. పార్థసారథి

1842 నాటి యుద్ధం తరువాత నాన్‌కింగ్ సంధి ఫలితంగా ఇంగ్లండ్, హాంకాంగ్‌ను తనపరంగా జమపరచుకుంది. వలసలు అల్లుకుపోవడంలో, వాటిని బాగా వృద్ధిచేసుకోవడంలో బ్రిటన్‌ది పెట్టింది పేరు. చేతి కొచ్చిన కొద్ది కాలంలోనే వారు హాంకాంగ్ ద్వీపాన్ని చక్కని వలసగా తీర్చి, అక్కడ పోర్టు విక్టోరియాపేరిట ఒక పెద్ద రేవునీ, పట్టణాన్నీ నిర్మించి వృద్ధి చేశారు. ఆ రేవుకి వాణిజ్యరీత్యా మంచి ప్రాముఖ్యం సంపాదించిపెట్టారు. హాంకాంగ్, కాంటన్ నదీ ముఖద్వారానికి అభిముఖంగా ఉంది. ప్రసిద్ధమైన పోర్చుగీసు రేవుపట్టణం మకావో దీనికి 60 మైళ్ళ దూరంలోనే ఉంది. అందువల్ల ఆ రెండిటికీ పోటీ తప్పదు. పోటీ వస్తే ఏదో ఒకటి గెలవకా తప్పదు. హాంకాంగ్ ఆ పని చేసింది. ఇప్పుడు చైనా వ్యాపారం అంతా ఈ ఇంగ్లీషు రేవుమీదుగానే సాగుతోంది. పెద్ద పెద్ద రేవులు, గోడౌన్‌లు, ఆస్పత్రులు, ఒక గోతిక్ కెతిడ్రల్, ప్రభుత్వ కార్యాలయం వగైరా భవనాలతో విక్టోరియా నిండుగా సందడిగా కనిపిస్తుంది. ఇంగ్లండ్‌ను ఎరిగున్నవారికి, కెంట్, సర్రేలలోని ప్రముఖ వాణిజ్య కేంద్రం ఏదో భూప్రదక్షిణం చేస్తూ ఎగిరివచ్చి చైనాలో ఈ కొసన వాలింది కాబోలనిపిస్తుంది.

క్లబ్ హోటల్‌నుంచి, 'కర్నాటిక్' లో కాబిన్‌లు తీసుకోవడానికి బయలుదేరిన పాస్పర్తూ ఉరకలు పరుగులు పెడుతూ నురగలు కక్కుతూ వెళ్ళి ఆపని చెయ్యలేదు. కొంచెం నెమ్మదిగానే నడక సాగించాడు దిక్కులు, మేడలు, వీధులు, వింతలు చూస్తూ. తెరలు వేసిన పల్లకీలు, బగ్గీలు చురుగ్గా తిరుగుతున్నాయి. వీధులు నానాజాతి సమితులులా ఉన్నాయి — చైనీయులు, జపానీయులు, యూరప్ దేశాలవారూ తమతమ పనుల మీద సందడిగా తిరుగుతున్నారు. కొన్నిందాల చూస్తే ఏ బొంబాయో, కలకత్తావో, సింగపూరో మళ్ళీ ఇక్కడ తగిలిందేమో ననిపించింది పాస్పర్తూకు ... అలా తగులుతూనే ఉన్నాయి ఒకటి పోలిన దొకటిగా. భూగోళం చుట్టూరా ఈవిధంగా 'ఇంగ్లీషు పట్టణాలు' దారిపొడుగునా కనిపిస్తూ ఉంటాయి.

పాస్పర్తూ రేవులోకి వచ్చాడు. కాంటన్ ముఖద్వారం దగ్గర ఓడలు గుమిగూడినట్టున్నాయి. ఇంగ్లీషు, ఫ్రెంచి, అమెరికన్, డచ్చి, మొదలైన నానాదేశాల నౌకలూ ఉన్నాయి. కొన్ని యుద్ధ నౌకలు. కొన్ని వాణిజ్య నౌకలు. వాటి మధ్య జపాన్, చైనాల తెరచాప ఓడలు, పడవలు, తెప్పలు, పూలతెప్పలు, ఊగుతున్నాయి. కొన్ని తిరుగుతున్నాయి నీటిమీద తేలుతున్న పూదోటలలా ఉంది ఆ దృశ్యం.

దారి కిటూ అటూ చాలమంది స్థానికులు హడావుడిగా తిరుగుతున్నారు. పసుపువచ్చటి దుస్తులు ధరించారు వాళ్ళంతా. చాలమంది వయస్సు మళ్ళిన వాళ్ళే.

పాస్పర్తూ ఒక చైనీస్ క్షౌరశాలలోకి వెళ్ళాడు, చైనాపద్ధతి క్షురకర్మ యిచ్చట చూదామని. అక్కడి ఆసామి ఇంగ్లీషులో ధారాళంగా కబుర్లు చెబుతున్నాడు. తాను అంతక్రితం చూసిన వృద్ధుల సంగతి అడిగాడు పాస్పర్తు. వాళ్ళంతా పండు ముసలివాళ్ళనీ, వాళ్ళలో ఎవరికీ ఎనభైకి తక్కువుండదనీ చెప్పాడు స్థానిక ప్రవీణుడు. అలా వయస్సు మళ్ళినవాళ్ళకే ఈ పసుపు వస్త్రాలు ధరించే అధికారం ఉందట. పసుపు సామాన్యమైనది కాదు. రాజగౌరవం, రాజాదరణ పొందిన విశిష్టవర్ణం. పాస్పర్తూకు ఇది వింతగా తోచింది. నవ్వుకున్నాడు ఎందుకో తెలీకపోయినా.

గడ్డం చేయించుకోవడం కాగానే, తిన్నగా ఆ రేవులో 'కర్నాటిక్' బయల్దేరే వాడ కనుక్కొని అక్కడికి వెళ్ళాడు. అక్కడ డిటెక్టివ్ ఫిక్స్, అదే పని అన్నట్టుగా పచార్లు చేస్తున్నాడు. ఫిక్స్ అక్కడ కనబడినందుకు పాస్పర్తూ నిర్ఘాంత పోలేదు. అనుకున్నదేగదా....కాని ఫిక్స్ మాత్రం ఇతన్ని చూడగానే ఉసూరుమనిపోయాడు నిరుత్సాహంతో.

"భేష్, రిఫారం క్లబ్బు సభ్యులకు దెబ్బేనన్న మాట" అన్నాడు పాస్పర్తూ. ఫిక్స్ పడే యాతన ఏమీ గమనించనట్టే కులాసాగా దగ్గరకు వెళ్ళి నవ్వుతూ పలకరించాడు

ఫిక్స్ క్షోభ పడుతున్న మాట నిజమే. అందుకు కారణం కూడా ఉంది హాంకాంగ్ వచ్చేసినా ఇంకా అరెస్టు వారంటు మాత్రం అందలేదు. నిజానికి దానిదీ తప్పులేదు. అది ఫిక్స్ కోసం పరుగు పరుగున వస్తూనే ఉంది కాని ఫిక్స్ ఎక్కడా ఆగకుండా పరుగెడుతున్నాడాయె. అతను ఎక్కడైనా రెండు రోజులు ఆగితే వారంట్ అతన్ని, అతను వారంటునీ అందుకోవచ్చు. ఇప్పుడు ఇది ఆఖరి అవకాశం. ఫిలియాస్‌ఫాగ్ యాత్రలో చిట్టచివరి 'బ్రిటిష్ మజిలీ' హాంకాంగే. ఇది

దాటితే మామూలు వారంట్లతో అతన్ని అరెస్టు చెయ్యడం సాధ్యపడదు. అందువల్ల అది వచ్చే దాకా ఏదోవిధంగా ఫిలియాస్ ఫాగ్‌ని ఈ పట్టణంలో ఆపుచేయాలి.

"అయితే ఏ వంటా రింతకీ. మీరు మాతో గూడా అమెరికా దాకా వస్తున్నట్టేనా ?" అన్నాడు పాస్పార్తూ.

"అవును" అన్నాడు ఫిక్స్ పళ్ళ గిట్టగరచుకు చిరాకు దిగమింగుతూ.

"బలే .... అసలు నాకు తెలుసనుకోండి మీరు మమ్మల్ని వదిలిపోలేరని....రండి రండి మీరూ బెర్తు బుక్‌చేసుకుందురుగాని."

ఇద్దరూ బుకింగ్ ఆఫీసులోకి వెళ్ళి, నలుగురికని నాలుగు గదులు కుదుర్చుకుని డబ్బు కట్టేశారు.

'కర్నాటిక్' మరమ్మతులు అనుకొన్న దానికన్న ముందే తెమిలిపోయాయనీ, అందువల్ల ఆ ఓడ ఇంతకుముందు ప్రకటించినట్టు మర్నాడు పొద్దున్న కాక, ఆ రాత్రే ఎనిమిది గంటలకు బయల్దేరిపోతుందనీ తెలియచెప్పాడు అక్కడి ఉద్యోగి.

"వెరీ గుడ్ ! మా యజమాని ఇది వింటే పొంగిపోతాడు. కావలసిందే ఇది. వెళ్ళి చెప్పొస్తాను" అంటూ ఉత్సాహంగా బయల్దేరబోయాడు పాస్పార్తూ.

ఫిక్స్‌కి గుండె గుభేలుమంది. కొంప మునిగిపోతోంది. ఇక లాభంలేదు. తెగించి అసలు సంగతి అంతా వీడికి చెప్పెయ్యాలి అనుకున్నాడు. ఫిలియాస్ ఫాగ్‌ని ఇంకో రెండు రోజులు ఇక్కడ ఆపగలగాలంటే ఇదొక్కటే మార్గం.

ఫిక్స్ కూడా పాస్పార్తూతో ఇవతలకు వచ్చాడు. ఫాగ్ మాట అలా ఉంచి, ముందు పాస్పార్తూని ఆపాలి ఓ పది నిమిషాలు. కాస్త దాహం పుచ్చుకుందాం రమ్మన్నాడు. వ్యవధి ఉందిగదా అని పాస్పార్తూ ఒప్పుకున్నాడు.

రేవులోనే పానశాల ఒకటి ఉంది. రా రమ్మన్నట్టుంది. పదపదమని ఇద్దరూ అందులో జొరబడ్డారు. విశాలమైన గది. అందంగా అలంకరించి ఉంది. గది అవతల చివర ఒక పెద్ద మంచం వేసి దిళ్ళు అమర్చిఉంది. దానిమీద చాలమంది పడుకుని గాఢంగా నిద్రపోతున్నారు. హాలులో సుమారు ముప్ఫయి మంది ఎడమెడంగా కూర్చుని తీరుబాటుగా పానీయాలు సేవిస్తున్నారు.— ఇంగ్లీషు బీరు, ఏల్, పోర్ట్, జిన్, బ్రాందీ వగైరాలు. వారిలో చాలమంది ఎర్రటి పొడుగుపాటి పైపులు పీలుస్తున్నారు. అందులో హుక్కా నల్లమందు ఉండలు. గులాబీసారం కలిపి పరిమళభరితంగా చేసే ఆ మత్తు ముద్దని గొట్టంలో పీల్చి, ఒక క్షణం అటూ యిటూ వూగి, కొంచెం జోగి ఒరిగి పడిపోతున్నారు ధూమపీథులు. పడిపోయిన ప్రతి వాడినీ, అక్కడి జవానులు కాళ్ళొకడు, తల ఒకడు పట్టుకొని మోసి, గది చివర ఉన్న మంచంమీద పడేస్తున్నారు. అలా ఒళ్ళుపై తెలీకుండా మత్తుగా బండల్లా మూక ఉమ్మడిగా పడిఉన్న జనాభా ఇరవై మందేనా ఉంటారు.

ఇది జడులు, మందులు, మందభాగ్యులు చేరి మత్తు పదార్థాలను పొగబట్టి తాగి మత్తెక్కి పడిపోయే ధూమశాలల జాతిలోదే తప్ప, ప్రధానంగా పానశాల కాదని పాస్పార్తూ, డిటెక్టివ్ ఫిక్స్ గ్రహించారు. ఈ దేశానికి, ఈ జాతికి నల్లమందు అనే మత్తును మప్పి పెట్టి సరఫరా చేసేది ఇంగ్లండు దేశం. సాలీనా ఇంగ్లండ్ ఇక్కడ అమ్మే నల్లమందు 104 లక్షల పౌండ్ల విలువ చేస్తుంది. మానవుడికి అబ్బిన దుర్బుద్ధులలో మహా విధ్వంసకరమైన దానిని రెచ్చగొట్టి పెంచి పోషించగా వచ్చే ఈ లక్షల పౌండ్లలో ఒకొక్కటీ ఒకొక్క విషాదగాథ ....

ఈ దురాచారాన్ని నివారించడానికి చైనా ప్రభుత్వం చాలా గట్టిగా కృషి చేసింది. కాని ప్రయోజనం లేకపోయింది. ఆరంభంలో ఈ నల్లమందు ధనిక వర్గాలకే కేటాయించిన వైభోగం. కాని క్రమంగా అది మేడల పై అంతస్థుల నుండి దిగి వీధులలో పరుగెత్తి నాలుగు వాడలా తిరిగి బీదా బిక్కీ అందరినీ ఆకట్టుకుంది. ప్రజాబాహుళ్యంలో పడిన తరువాత ఇక దానిని అదుపు చెయ్యడం అసాధ్యం. చైనా అంతా అలవాటు అలవాట్లైపోయింది. మధ్య ప్రాంతంలో మరీను. స్త్రీలు పురుషులూ అంతా ఈ పొగ తాగుతారు. అది ఒక పట్టు పీల్చకపోతే వాళ్ళు ఉండలేరు. కడుపులో శూలనొప్పి పోట్లు వచ్చి గిలగిల తన్నుకుంటారు. బాగా అలవాటయిపోయి, దమ్ము ఉన్నవాడు రోజుకి ఎనిమిది పట్లు పట్టి పొగ తాగుతాడు. కాని అయిదేళ్లలో దమ్ము అంతా అయిపోతుంది. చనిపోతాడు.

హాంకాంగ్‌లో కూడా జీవితాలను నిర్ధూమధామాలు చేసే ఈ రకం ధూమధామాలు సమృద్ధిగా అల్లుకుని ఉన్నాయి. ఆ కోవ దుకాణంలోకే కాస్త పానీయం సేవించి వద్దామని ఫిక్స్ పాస్పార్తూలు జొరబడ్డారు. పాస్పార్తూ చేతిలో డబ్బు లేదు. కాని, చేతికి డబ్బు రాగానే మళ్ళీ సందర్భం వచ్చినప్పుడు తనూ అతనికి పానీయాలు కొని ఇవ్వవచ్చునన్న ధీమాతో, పాస్పార్తూ తన మిత్రుడి ఆతిథ్యానికి అంగీకరించాడు.

ఫిక్స్ రెండు బుడ్డీల పోర్ట్ తెప్పించాడు. ఫ్రెంచివాడు పాస్పార్తూ శ్రద్ధాసక్తులతో సీసాలను ఖాళీచేశాడు. ఫిక్స్ మాత్రం, ఫ్రెంచివాడితో మన కెక్కడ పోటీ అన్నట్టు తక్కువగానే పుచ్చుకుని, పాస్పార్తూ పురోగతిని, కవళికలను పరిశీలిస్తూ కూర్చున్నాడు. కబుర్లలో ఎన్నో విషయాలు దొర్లిపోయాయి. "కర్నాటిక్‌లో మీరూ మాతో రావడం, ఎంత బ్రహ్మాండంగా ఉంది !" అన్నాడు పాస్పార్తూ. "అవును ఎంత బ్రహ్మాండం" అన్నాడు ఫిక్స్. సీసాలు రెండు ఖాళీ కాగానే పాస్పార్తూ లేచి నిల్చున్నాడు. "ఓడ అనుకున్న వేళకన్న చాలా పెంద్రాళే వెళ్తుందని మా యజమానికి త్వరగా చెప్పాలి" అన్నాడు.

"ఒక్క నిమిషం" అన్నాడు ఫిక్స్ అతన్ని బలవంతాన కూర్చోబెట్టి.

"ఏమిటి విశేషం ? ఏం కావాలి ?" అన్నాడు పాస్పార్తూ ఉదారంగా.

"మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి."

"ముఖ్యమైన విషయాలా !" అంటూ, సీసా

జరిగిన కథ

80 రోజులలో భూప్రదక్షిణం సాధ్యమని 20 వేల పౌన్లు పందెం వేసి సేవకుడు పాస్పార్తుతో బయలుదేరుతాడు ఫిలియాస్ ఫాగ్. బాంకు దొంగ ఫాగ్ దొరికాడని, అరెస్టుకు బొంబాయికి వారంటు పంపమనీ లండన్‌కు టెలిగ్రామ్ పంపి, ఫాగ్ వెంట సూయజునుంచి బొంబాయికి చేరతాడు డిటెక్టివ్ ఫిక్స్. కాని వారంటు చేరలేదు. బొంబాయినుంచి కలకత్తాకు రైలుబండిలో ప్రయాణం అవుతాడు ఫాగ్. గోథాల్ వద్ద బండి ఆగిపోగా గత్యంతరం లేక ఏనుగుమీద అలహాబాదు వెళ్ళుతారు. దారిలో బలవంతంగా సహగమనానికి పోతూఉన్న అయూదాను రక్షించి ఆమెతో కలకత్తా చేరుకొంటాడు ఫాగ్. అక్కడ వారిని నిలపడానికి ఫిక్స్ చేసిన యత్నం విఫలమైంది. ఫాగ్ ప్రభృతులు 'రంగూన్' ఓడలో పయనం ప్రారంభించారు. ఆ ఓడలోనే ఉన్నాడు ఫిక్స్. ఫాగ్‌ను అరెస్టుచేయడానికి భోగట్టా సేకరించాలని పాస్పార్తును చేరదీశాడు. పాస్పార్తు వైఖరి ఫిక్స్‌కు కాని, ఫిక్స్ ధోరణి పాస్పార్తుకు కాని అంతు చిక్కలేదు. లండన్ విడిచిన 36 రోజులకు (అంటే అనుకొన్న దానికి ఒక్క రోజు అదనం) హాంకాంగ్ చేరుకొని, అయూదాతో 'కర్నాటిక్'లో యొకహోమా ప్రయాణానికి ఏర్పాటు చేసుకొన్నారు.

ఎత్తి చూసి అట్టడుగున ఉన్న రెండు చుక్కలూ నోట్లో పోసుకొని చప్పరించాడు పాస్పార్తూ. "రేపు మాట్లాడుకుందాం. ఇవ్వాళ తీరికలేదు" అన్నాడు తిరిగి లేవబోతూ.

"కూర్చోండి. నే చెప్పేది మీ యజమాని గురించే."

పాస్పార్తూ అదిరిపడి నవ్వు మానేసి, సూటిగా పరీక్షగా చూశాడు ఫిక్స్‌కేసి.

"ఏమిటి విశేషం ?" /

ఫిక్స్ మెల్లిగా పాస్పార్తూ చేతిమీద చేయి వేసి మృదువుగా అదిమి కంఠం స్థాయి తగ్గించి "నే నెవరినో మీరు పసిగట్టేశారు" అన్నాడు.

"శభాష్ !" అంటూ పకపక నవ్వాడు పాస్పార్తూ—ఇప్పుడా మీరీ సంగతి గ్రహించిందీ అన్నట్టు.

"అంచేత ఇప్పుడు మీకు అంతా చెప్పెయ్య దలచుకున్నాను" అన్నాడు ఫిక్స్ గుంభనగా.

పాస్పార్తూ నవ్వాడు. "సరే నాకిప్పు డంతా తెలిసిపోయింది కాబట్టి .... సరే మీరు చెప్పేదేదో

చెప్పండి .... అసలంతా శుద్ధ అన్యాయం....నిజాని కాదు .... దానికేంలెండి కానివ్వండి .... కాని ఒక్క మాట చెప్పదలుచుకున్నాను. మీవాళ్లున్నారే, మీ వాళ్లు ఉట్టి దండగకి డబ్బు ఖర్చుపెడుతున్నారు" అన్నాడు.

ఫిక్స్ గుండె గతుక్కుమంది.

"దండగ ఖర్చంటారేమిటి ? .... అసలు మీకు, అసలు మొత్తం ఎంతో తెలియనట్టుందే."

"ఇంకా నయం. నిక్షేపంలా తెలుసు. ఇరవై వేల పౌండ్లు" అన్నాడు పాస్పర్టూ.

"యాభై అయిదువేలు !" అన్నాడు ఫిక్స్ ఉద్వేగంతో.

"ఏమిటీ ! యాభై అయిదువేలా !" అన్నాడు పాస్పర్టూ ఎగిరి గంతువేసి. "ఏవి దుస్సాహసం. అయ్యో బాబోయ్. ఇంకా నయం. అలా అయితే నేను ఒక్క నిమిషం కాదు, క్షణం కూడా అలస్యం చేసేందుకు వీల్లేదు" అంటూ లేచి పరుగెత్తబోయాడు.

ఫిక్స్ అతని చేయి పట్టుకుని బలవంతాన కుదేశాడు. బ్రాందీ తెమ్మని పురమాయించాడు. "ఏమనుకున్నారు మరి యాభై అయిదువేలు. వేలు గనక నెగ్గామా అంటే అందులో రెండు వేలు బహుమతి వస్తుంది .... మీరు గనక నాకు కాస్త సాయంచేస్తే అందులో అయిదు వందలు ఇస్తాను. సరేనా ?" అన్నాడు.

"సాయమా ! సాయమేమిటి ?" అన్నాడు పాస్పర్టూ ఆశ్చర్యంతో కళ్లు విప్పార్చి.

"ఔను. మీ యజమాని ఫాగ్ని ఏదోవిధంగా హాంకాంగ్లో ఇంకో రెండు రోజులు ఆపివుంచాలి. అందుకు సాయం కావాలి"

"ఛ ఛ. ఏమిటి మీరనేది .... ? మా యజమాని నిజాయితీని శంకించడం చాలక, అతనిని వెంటాడించింది చాలక, చివరికి ఇలా ఆయనకి అడ్డంకులు కూడా పెట్టాలని చూస్తున్నారా మీ వాళ్ళు. దారుణం. సిగ్గుచేటు" అన్నాడు పాస్పర్టూ మండిపడి.

"ఆ ! .... అదేవిటి ! ఏవిటి మీ రనేది ?" అన్నాడు ఫిక్స్ తెల్లబోయి.

"ఏముంది అనేందుకు .... అమర్యాదకరమైన .... ఉట్టి మొరటుపని. మా యజమానిని నిలబెట్టి నిలువునా దోపిడీ చేసుకుపోవడమే కదా."

"ఆ ! అదే అదే. దోపిడీ గురించే. అదే నేనూ చెప్పొచ్చింది."

"నాకు తెలుసు. ఉచ్చు పన్నుతున్నారు మీరంతా విశార్సయిన ఉచ్చు" అంటూ కేకలు మొదలు పెట్టాడు పాస్పర్టూ. ఫిక్స్ నేర్పుగా పట్టేస్తున్న బ్రాందీ మంచి పట్టులో కొచ్చింది.

కేకలు పెట్టడం చూసి ఫిక్స్ కొంచెం కంగారు పడ్డాడు.

"సోదరులారా ! రిఫారం క్లబ్బు సభ్యులారా ! పాటివారా ! మేటివారా ! మా యజమాని చాలా పెద్దమనిషి. బహు మర్యాదస్థుడు. ఒక పందెం అంటూ వేస్తే సవ్యమైన, సబబైన విధంగానే అవి గెలవా లనుకుంటాడు. ఈ మాట మీరు మనసులో ఉంచుకోవాలి" అన్నాడు పాస్పర్టూ ఉపన్యాస ధోరణిలో.

80 రోజులలో భూ ప్రదక్షిణం

డిటెక్టివ్ ఫిక్స్కి కంగారు కలిగింది. కొత్త అనుమానం తగిలింది. మతి పోయింది.

"ఇంతకీ నే నెవర్ననుకుంటున్నావు ?" అన్నాడు పాస్పర్టూ ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

"బావుంది. శభాష్. రిఫారం క్లబ్బు తరఫు మనిషివి నువ్వు. మా యజమాని యాత్ర సాగకుండా అడ్డుపడి ఆటంకాలు పెట్టడానికి వచ్చావు వాళ్ల తరఫున. దారుణం. సిగ్గుచేటు. నా కిదంతా ముందరే తెలిసినా మా యజమాని ఇదేం పసిగట్టకుండా జాగ్రత్తపడ్డాను" అన్నాడు పాస్పర్టూ.

"ఆయన కేమీ తెలీదా ?" అన్నాడు ఫిక్స్ గుటక మింగి.

"ఏమ్మీ" అంటూ, గ్లాసులో ఉన్న మిగతాది కాస్తా గుటకేశాడు పాస్పర్టూ.

ఫిక్స్కి అంతా అయోమయం అయిపోయింది. ఏమి మాట్లాడితే ఏం చిక్కోనని ఒక నిమిషం తటపటాయించాడు. ఇప్పుడేం చెయ్యాలి.పాస్పర్టూ తనను చూసి రిఫారమ్ ఏజం టనుకుంటున్నాడు. వీడి పొరబాటు నిజమైనదే అయుండాలి. నిజాయితీ శంకించ నక్కరలేదు. దీనినిబట్టి వీడి కసలు ఫాగ్ బాంకుదోపిడీ గురించి తెలీదని తేలింది. అంటే వీడు తోడుదొంగ కాడన్నమాట— తను ఇంతవరకూ వీడినికూడా అనుమానించాడు.

"సరే ఫాగ్కి తోడుదొంగ కాడు కాబట్టి నాకు తోడుపడవచ్చును" అనుకున్నాడు ఫిక్స్.

పరిస్థితులు చెయి దాటలేదు. తనకి మంచి అవకాశం మళ్లీ కలిసొచ్చింది. ఇక ఆట్టే వ్యవధి కూడా లేదు. ఏదోరకంగా ఫాగ్ని హాంకాంగ్లో అట్టే పెట్టాలి.

"ఇదుగో చూడు పాస్పర్టూ !" అన్నాడు మిత్రుడి చెయ్యి పట్టుకుని. ఫిక్స్ కంఠస్వరం హఠాత్తుగా మారిపోయింది. "నే చెప్పేది కాస్త శ్రద్ధగా విను. నువ్వనుకుంటున్నట్టు, నేను రిఫారం క్లబ్బు వాళ్ల మనిషిని కాను—"

"ఆఁ. పోదురూ" అన్నాడు పాస్పర్టూ తమాషాగా నవ్వి.

"నేను పోలీసు డిటెక్టివ్ని. ఇంగ్లండ్ ప్రభుత్వంవారి పనుపున వారి పనిమీద వచ్చాను."

"మీరు .... డిటెక్టివా ! .... మీరు !"

"అవును. కావలిస్తే దాఖలా చూపిస్తాను. ఇదిగో నా అధికార ముద్ర. చూడు" అంటూ ఫిక్స్ తన జేబులోంచి ఒక పుస్తకం తీసి అందులో తనను ఇందుకు నియోగిస్తూ లండన్ సెంట్రల్ పోలీసు కమీషనర్ ఇచ్చిన అధికార పత్రం తీసి చూపించాడు. పాస్పర్టూకి మాట రాలేదు. గుడ్లు తేలవేసి నోరు వెళ్లబెట్టి కొయ్యబారి పోయాడు.

"మీ యజమాని ఫిలియాస్ఫాగ్ వేసిన పందెం నిజంగా పందెం కాదు. అది ఒక వంక. ఒక తెర. ఆ నాటకంలో మిమ్మల్ని, రిఫారం క్లబ్బు సభ్యులనీ తనకి కావలసిన విధంగా ఫాగ్ వాడుకుంటున్నాడు. ఆ సంగతి మీకు తెలీకుండా మిమ్మల్ని ఉపయోగించుకుంటున్నాడు" అన్నాడు ఫిక్స్.

"ఎందుకు ?" అన్నాడు పాస్పర్టూ అప్రయత్నంగానే.

"వినండి. సరిగ్గా సెప్టెంబరు 28 వ తేదీన బాంక్ ఆఫ్ ఇంగ్లండులో 55 వేల పౌండ్లు దొంగతనం జరిగింది. ఆ దోపిడీ చేసిన వ్యక్తి విగ్రహం రూపురేఖలూ ఎలా ఉంటాయో బాంకువారు తెలుసుకోగలిగారు వాకబుచేసి. ఇదుగో ఆ వర్ణనని వివరాలనీ చూడండి—అంతా అక్షరాలా ఫిలియాస్ఫాగ్ ప్రతిబింబమే" అన్నాడు ఫిక్స్.

"అంతా అబద్ధం, బుకాయింపు. మా యజమాని ఈ భూ ప్రపంచకంలో ఉన్నవా ళ్లందరిలోకీ పెద్ద పెద్దమనిషి" అన్నాడు పాస్పర్టూ ఉద్రేకంతో బల్ల గుద్దుతూ.

"అతని గురించి మీకేం తెలుసు—అంత గట్టిగా ఎలా చెప్పగలరు—మీ కసలు అతనితో పరిచయం కూడా లేదుగదా. అతను యాత్రకి బయలుదేరిన రోజునే మీరు అక్కడ కొలువుకి కుదిరారు. అవునా ? అతను ఎలా బయల్దేరాడు. మాటా మంచీ అనుకోడం ఉందా ? ఏమీ లేదు. ఉన్నట్టుండి బయల్దేరదాం అన్నాడు. ఎలాటి కారణం ? అసలది కారణమా. వంక. పెట్టే, బేడా సర్దటానికి కూడా తీరికలేదు. చేతిసంచీ పట్టుకున్నాడు. దాన్నిండా బాంకు నోట్లు కట్ట లెక్కట్టలుగా ఉన్నాయి. ఇలాటి మనిషిని పట్టుకుని మీరు పెద్దమనిషని అంటారా ? ఎంత సాహసమో మీరే ఆలోచించుకోండి" అన్నాడు ఫిక్స్.

"అవునవును" అన్నాడు పాస్పర్టూ యాంత్రికంగా. ఫిక్స్ మాటలతో అతనికి మతి పోయింది పూర్తిగా. నిశ్చేష్టుడై కూర్చున్నాడు.


"ఇక మీ సంగతి. అతనికి తోడు దొంగగా అరెస్టు కావా లనుకొంటున్నారా ?"

పాస్పర్టూ తల వాలిపోయింది. బల్లమీది చేతులు పట్టు జారిపోయాయి. డిటెక్టివ్కేసి చూడలేకపోయాడు....ఫిలియాస్ఫాగ్ .... అయినాదా

ఒకరు—చిత్రంగా ఉంది. నిన్న రాత్రి మా ప్రక్క ఇంట్లో దొంగపడి డబ్బు, బుష్ షర్ట్సు, పాంట్సు, పుస్తకాలు ఎత్తుకుపోయాడు. చీరలు ముట్టలేదట.

మరొకరు (ఆలోచించి)— అయితే ఆ దొంగ మగవాడు అయి ఉంటాడు.

పి. రంగారెడ్డి (రాజాపురం)



ప్రాణానికి ప్రాణం ఒడ్డిన సాహసి, ఉదారుడు. ఆయన దొంగా ?! .... కాదేమో కాని అవు నన డానికి సాక్ష్యాలు ఎన్ని ఉన్నాయి ! అవన్నీ అనుష్ఠానాలై మెల్లి మెల్లిగా పాస్పార్టూ బుర్రలో దూరి చోటు చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాయి. కాని ఫాగ్ గురించి చెడ్డగా అనుకుందుకు మనసు ఒప్పటం లేదు.

"ఇంతకీ ఇప్పుడు నన్నేం చెయ్యమంటారూ ?" అన్నాడు అతి ప్రయత్నంమీద మాటలు కూడ దీసుకుని.

"ఏంలేదు. ఒక్కటే . . ఫాగ్‌ని వెంట తరుముతూ ఇంతదూరం వచ్చానుగదా. ఇంతవరకూ అరెస్టు వారంటు నాచేతి కందలేదు. అది లండన్ నుంచి వస్తోంది. అంచేత అది వచ్చేవరకూ హాంకాంగ్‌లో ఫాగ్‌ని ఎలాగో అలా మనం అట్టే పెట్టగలిగితే—"

"అందుకు మద్దతు కావాలా ? నేనా ? నేను చెయ్యాలా ?"

"చేస్తే నా కొచ్చే బహుమతి రెండువేల పౌండ్లలోనూ అయిదు వందలు మీకిస్తాను."

"చస్తే అలా చెయ్యను" అంటూ ఉద్రేకంగా లేచి పోబోయిన పాస్పార్టూ వెంటనే కూలబడి పోయాడు. అతని నరాలు పట్టు తప్పి పోయాయి. సత్తువ చాలటంలేదు. ఒళ్లు మత్తుగా

"అయ్యా ఒక్కమాట వినండి ...." అన్నాడు. మాటకూడా తొట్రుపడుతోంది . . "ఇదిగో. మీరు చెప్పినవన్నీ ప్రతి ఒక్కటన్నీ నిజమే అయినప్పటికిన్నీ .... మీరు అంటున్నట్టు—మీరు అనుకుంటున్నట్టు—మా యజమాని దొంగే అయినప్పటికిన్నీ—నేను వారిదగ్గర పని చేసినవాణ్ణి—చేస్తున్నవాణ్ణి — వారిని ఎరిగున్నవాణ్ణి—ఆయన దయా దాక్షిణ్యాలు చూసిన వాణ్ణి—ఔదార్యం ఎరిగినవాణ్ణి—అంచేత — కావున— నేను ఆయనకి ద్రోహం—ఎన్నటికీ చెయ్యను. చచ్చినా చెయ్యను. మీరు లక్షపౌండ్లిచ్చినా చెయ్యను. ప్రాణమ్మీదికొచ్చినా చెయ్యను—నా కలాటి కూడు పడదు. హరాయించుకోలేను నీచపు తిండి—నేనే కాదు. మా వూరుకాదూ—మావూళ్లో ఎవ్వరికీ పడదు. ఎవ్వరికీ గిట్టదు."

"అయితే ఒప్పుకోరా ?"

"—కోను."

ఫిక్స్ నిట్టూర్చాడు. "సరే జరిగింది మర్చిపొండి. నే నసలేం చెప్పలేదనే అనుకోవాలి .... ఇంకొక్క తడవ కాస్త దాహం పుచ్చుకొని—"

"రైట్. అది బావుంది భేషుగ్గా ఉంది. కాస్త తాగుదాం" అన్నాడు పాస్పార్టూ ఉత్సాహంగా

క్షణక్షణానికీ పాస్పార్టూకి మత్తు ఎక్కువై పోతోంది.


ఒళ్లు స్వాధీనం తప్పిపోయింది.

ఏదోవిధంగా, ఇప్పుడు పాస్పార్టూ ఫాగ్‌ను కలుసుకోకుండానైనా జాగ్రత్తపడడం తక్షణ కర్తవ్యం అని తేల్చుకున్నాడు ఫిక్స్. అందుకు మార్గం ఇంకా మత్తెక్కించటడం ఒకటే. బల్లమీద, నల్లమందు నింపి సిద్ధంగా ఉంచిన పొగపట్టు గొట్టాలు కనిపిస్తున్నాయి కంటికి నదరుగా. ఫిక్స్ ఒకటి తీసి నేర్పుగా పాస్పార్టూ చేతిలో పెట్టాడు. పాస్పార్టూ మత్తులోనే దానిని నోట్లో పెట్టుకుని వెలిగించాడు. రెండు మూడు దమ్ములు పీల్చాడు. నోట్లో గొట్టం జారిపోయింది. తల తిరిగి తిరిగి దిమ్మెక్కి వాలిపోయింది. ఇంకో క్షణం తరవాత పాస్పార్టూ కూడా ముందుకు ఒరిగి పోయాడు.

డిటెక్టివ్ ఫిక్స్ తృప్తిగా నిట్టూర్చాడు. ఇక ఫరవాలేదు. కర్నాటిక్ ఇవ్వాళ రాత్రే బయలుదేరుతుందని ఇక ఫాగ్‌కు తెలిసే అవకాశం లేదు—పాస్పార్టూ ఇక్కడే పడుంటాడు కాబట్టి. అప్పుడు ఓడ తప్పిపోతుంది. అలా కాక ఒకవేళ ఫాగ్‌కు ఆ సంగతి తెలిసి ఓడ అందుకున్నా ఈ పాస్పార్టూను పట్టుకోలేడు. కనీసం తన రహస్యం ఫాగ్‌కు తెలీకుండా ఉంటుంది ....

డిటెక్టివ్ ఫిక్స్ లేచి, పానీయాలకు అయిన డబ్బు చెల్లించి, మెల్లిగా బయటకు వెళ్లిపోయాడు.

(ఇంకావుంది) ★



ఈఏడాది రాష్ట్రపతి రజతపతకం అందుకొన్న సారణీవారి 'మహాకవి కాళిదాసు'లో ఒక సన్నివేశం

క్రవులకు, రచయితలకు కడుపునిండి, కాలు సాగుతున్నది ఒక్క సినిమా రంగంలోనే ఈ మాట నిర్వివాదం

ఇతరేతరరంగాలలో కాలు సాగి ఆగిపోయిన సాహితీవ్రతులు అనేకులు సినిమారంగంలో ప్రవేశించారు కొందరు ఇటూ, అటూ కూడా పురోగాములుగా ఉన్నారు మరికొందరు ఈ రంగాన్నే తొలినుంచీ నమ్ముకున్నారు

దీనికి కారణం ఒకటే కావచ్చు ఈ రంగంలో మెలువుగా, సుఖంగా ధనం పుడుతుంది దానితో అనుభవమూ, హాయీ కూడా లభ్యం అవుతాయి

తెలుగు రచయితలకు ఏ రంగంలోనూ గొంతు ఎండవడంలేదంటే అతిశయోక్తి కాదు ఉన్నవాటిలోకి మెరుగు సినీ రంగమే ఇక గౌరవ మర్యాద అంటారా? వాటినిగూర్చి బెంగతో బెంబేలుపడే రచయితలు ప్రస్తుత కాలంలో లేనేలేరు కాగా ఒక ప్రసిద్ధ కవీ, సినీ కవీ ఓసారి సినీరంగంలో కవినిగూర్చి చెబుతూ నిర్మాత అనే సినీ రంగ నాయకుడు 'దయచేయండి అయ్యా కవిగారూ — అలా అలా కొంచెం ఆకూజా ఇలాపెట్టి మరీ కూర్చోండి' అని ఆదరిస్తాడని చెప్పారు

'ఆ చాప చుట్టండి కవిగారూ'—లాటి మాటలు వినబడటం వరిపాటే ఇవన్నీ బ్రతుకు తెరువులో గతులు కాకపోలేదుగాని కానుకునే కాలక్షేపం చేస్తున్నారు కవి రాజులు. కాని వచ్చిన చిక్కల్లా క్షమించరాని అపరాధమల్లా తాతకు దగ్గులు నేర్పడం! ఇది రెండు రకాలు.

నిర్మాత అనే నిర్మోహమాటం—పరమ కచ్చితంగా ప్రతిదాంట్లోనూ కల్పించుకుంటుంది.

"కవిగారూ ఆ పాటలో ఈ మాట బాలేదండీ" అనే రిమార్కు కూడా నిర్మాత పాస్ చేయగలడు. ఏ చిత్రంలో ఎక్కడ ఎటువంటి పాట ఉండాలో అది ఎలా వ్రాయాలో చెప్పేవాడు నిర్మాతే అందులో సాహిత్యానికి అతడే నిర్ణేత. దాని సంగీతానికి అతడే విధాత. మొత్తంమీద తన చిత్రానికి తనే మాత! అంతాతనే చేసుకుంటూ ఇతర్ల పేర్లు వేస్తున్నానని ఒకటే మోత!

ఈ బాదర బందీ బతుకు తెరువులో పైసాకు కరువులేదనే జవసత్వాలుతప్ప కవిత్వాలుకావు కవిని నిలబెడుతున్నవి—అని కొందరు తెర కవులే తెల్లం చేశారు.

అయినా తెలుగు తెరకు వెలుగు కానుకలు సమర్పిస్తున్న ఘనత కవి జనతదే కాదనలేము. అలనాటి కావ్య మధు మాధుర్యమూ, అధునాతన నవలా నవలావణ్యమూ దృశ్య కావ్యాలయిన సినిమాలలో వాచవిగానైనా వరలడానికి తెరకవులూ, రచయితలూ కారకులు

'అలలు కొలనిలో గలగలమనిన
దవ్వుల వేణువు సవ్వడివినిన
నీవు వచ్చేవని నీ పిలుపేవిని
కన్నులనీరిడి కలయజూచితిని'


వంటి వాక్యాలు సినీ నిర్మాతృలోక్యాలెన్నో దగాతుకుని మరీ వెలువడినవే

వలపు దుమారం, ఘాటుప్రేమ, ప్రేమగండం, వంటి మాటలూ తెలుగు చలన చిత్రంలో పుట్టినవే

"ఈ మహానుభావుడు పెట్టేది సప్పుచారూ అన్నం, పప్పునిండా రాళ్ళు, చారునిండా నీళ్ళూనూ డబ్బివ్వాలిట పైగా డబ్బు" వంటి ప్రహసన ప్రవచనాలూ ఈ రంగంలోవే

అయితే తెలుగు నాటకాల రోజులనాటి సాహిత్య స్థాయి నేటి సినిమాలలో లేదనీ, అది పీలవెళ్ళి పతనమైపోయిందని కొందరంటున్నారు దానికి కారణం జనం పద్యాలు, గ్రాంథికవాదాలూ ఆనాడు హృద్యాలు నేడు త్యాజ్యాలు అనుకుంది జనం

పాటలూ, మాటలు వచ్చాయి, తేట తెలుగులో. వీటుగా దీటుగా ఇవేనేటిపద్యాలూ, హృద్యాలూ ★



పంచదీప్ చిత్రవారి 'అంచల్'లో నిరూపారాయ్, అశోక్ కుమార్.

ప్రసిద్ధ మరాటీకథా రచయితలు, మద్గూల్కర్, జోగీల్కర్‌లు రచించిన 'అంచల్'— ఒక చక్కని సంసారుల కథ సంసార పక్షమైన కథ వెలుగు నీడలు, రాగ విరాగాలు కలనేతగా ఉండే బ్రతుకు తెరకు మరకలు చిరుగులు ఎలా పడతాయో వెలుగులు చెరిగి నీడలు, నీడలుపోయి వెలుగులు ఎలా మిగులుతాయో వివరించే ఈ కథ అపరిపక్వమైన దర్శకత్వంతోనే అయినా అసలు సరకు వున్నందున అసదృశంగా రాణించింది

రాముా (అశోక్‌కుమార్) ఇల్లు అనే స్వర్గానికి, ఇల్లాలు అనే దేవతకు ఇంద్రుడు, తల్లికి చల్లని కడుపు పంటగా కన్నుల పండువుగా హాయిగా భార్య (నిరూపారాయ్)తో కాపురం చేస్తున్నాడు అతనికి ఒక మిల్లులో ఉద్యోగం, ఉద్యోగంలో మంచితనం, పవితనం ఈ రెంటిద్వారా అభివృద్ధి సాధిస్తాడో ఇతని అభివృద్ధి చూసి సహించలేని ఒక నీచుడు పగబట్టి అతన్ని హత మార్చాలని కుట్రపన్ని ఏమార్చి వూరిబైట రైలు కట్టమీద కత్తితో పైకి దూకుతాడు సినీ కథాయుక్తంగా ఒక రైలు సరిగ్గా వేళకు అటువస్తుంది దుర్మార్గుడు ఆ పెనగులాటలో రైలుక్రిందపడి పాపఫలం అనుభవిస్తారు హంతకుడనిపించుకోవలసివచ్చే రాముా, ఒక నాట కాలరాయుడుతో కలిసి పట్నం వెళ్లిపోతాడు

ఇదంతా జరిగినది ఒక దీపావళి పండుగవేళ! మామూలుగా భార్య, తల్లి, అమ్మాయి, రాముా టపాకాయలూ, కొత్త బట్టలూ తెస్తాడని ఆశతో వుంటారు కాని ఆ దీపావళి వారికి శోభస్కరం కాదు. రాముాకు బదులు పోలీసులువచ్చి రాముా కోటు మొదలయిన వస్తువులు చూపి రైలుకిందపడి చనిపోయినది, రాముా అని చెబుతారు

చీకటి తెరలు రాముా సంసారమంతా నిండిపోతాయి పున్నమవంటివారి కాపురం అమావాస్య అయిపోతుంది

విధి అన్యథాకరించిన బ్రతుకుబాట మీదుగా ఆ దిక్కులేని ముగ్గురూ ఓ పట్నానికిపోయి ధరమ్‌దాస్ (ఓంప్రకాశ్) అనే పోలీసు ఇన్‌స్పెక్టర్ దయతో ఒక గూటికి చేరుకుంటారు

ధరమ్‌దాస్ కొడుకు, రాముా కూతురు అక్కడ ఒక బళ్లో చదువుకుంటారు మెల్లిగా వారు పెద్దవాళ్లై ధరమ్‌దాస్‌కొడుకు సుందర్ (సుదేష్ కుమార్) సబ్—ఇన్‌స్పెక్టర్ అవుతాడు రాముా కుమార్తె (నందా) అతన్ని ప్రేమిస్తుంది ధరమ్‌దాసూ, రాముా కుటుంబమూ వారిని ఒకింటివారు కావాలని ఆశీర్వదిస్తారు

ఇలా ఉండగా రాముా తల్లికి కంటి ఆపరేషన్ చేయించవలసి వస్తుంది అందుకు చేతిలో డబ్బు ఉండదు ఒక పక్కింటి పిన్నిగారివల్ల పట్నంలో 'డాన్స్' చేస్తే డబ్బు వస్తుందని తెలుసుకుని



"ప్యాసేపంఛీ" చిత్రంలో అమీతా.

అంచల్

రాముా కూతురు ఒప్పుకుంటుంది ఆ 'డాన్స్' విశేష జనాదరణ పొందుతుంది

ప్రపంచమంతా మంచివాళ్ల మయమే నను కుంటుంది పాపం పిచ్చిపిల్ల కాని ఆ నాటకాల యజ మాని ఆమెను బలాత్కారించబోతాడు మానం కోసం ఆ నీచుడితో హోరాహోరీ పోరు సాగు తుంది ఇంతలో తండ్రివంటి దయామయుడు ఒకడువచ్చి ఆదుకుని రక్షిస్తాడు

తీరా యింటికివచ్చి చూస్తే తల్లి, భార్య అతని గుర్తు పడతారు అతను రాముా అని తెలుసుకుం టారు కాని అతనికోరికపైనే బాబాయి అని కుమా ర్తెకు చెబుతాడు తిరిగి రాముా చల్లగా కాపురం చేస్తూ ఉంటాడు భార్య గర్భిణి అవుతుంది విధవ రాలు గర్భిణి ఎలా అవుతుందని వూరునాడూ ఆమెను దుమ్మెత్తిపోస్తారు అప్పుడు జరిగిన విచిత్ర సంఘటన లో రాముా నిజ స్వరూపం బయటపడుతుంది కథ సుఖాంతమవుతుంది

ఈ కథను పంచదీప్ చిత్రవారు వసంత్ జోగ్ ల్కర్ దర్శకత్వంలో రసవత్తరంగా నిర్మించారు కాని దర్శకత్వంలో అపరిపక్వత కొంత గోచరిస్తుంది అది కేవలం టేకింగ్‌కు చెందినదనే చెప్పాలి కథన విధానం బాగుంది మందగమనం దాని బాగుకు చిన్న డాగు అయిందనాలి

రాముా, అతని భార్యగా నటించిన అశోక్‌కుమార్ నిరూపరాయ్ కడు చక్కగా హృద్యంగా నటించారు లలితాపవర్, నందా, సుదేష్‌కుమార్, ఓంప్రకాశ్ ల నటన బాగుంది విపరీతపు హాస్యము, రసాంక ర్యమూ లేదు

ఉన్న నాలుగు పాటలూ చల్లగా హాయిగ ఉన్నాయి సి రామచంద్ర సంగీత దర్శకుడు

సంసారులు చూడతగిన సరసమైన చిత్రం 'అంచల్'

పి ఎ పి వారి 'భార్యా భర్తలు' తొలి తెలిపి నట్లు కాక మార్చి 31 కి విడుదల కాగలదు

* * *

కవితాచిత్రవారి "వాగ్దానం"లో నాగేశ్వర రావు, కృష్ణకుమారి, గుమ్మడి, రేలంగి, గిరిజ, పద్మనాభం నటిస్తున్నారు రచయిత, దర్శకుడు ఆత్రేయ సంగీతం పెండ్యాల నాగేశ్వరరావు

* * *

నలందాపిక్చర్స్‌వారు 'సవతితల్లి' అనే సాంఘికం నిర్మిస్తారు కథ మాటలు పినిసెట్టి దర్శకత్వం కోగంటి ఇతర వివరాలు ఇంకా తెలియ లేదు

* * *

అంజలి పిక్చర్స్‌వారు ఈసారి ఒక అపరాధ పరిశోధకచిత్రం నిర్మిస్తారని తెలుస్తోంది అందుకు తగిన మంచి కథనుకూడా ఎన్నుకొన్నా రట

* * *

ఉత్కళచిత్ర అనే సంస్థ తెలుగు, ఒరియా, సంస్కృతం—ఈ మూడు భాషలలో 'వసంతసేన' నిర్మించగలరని తెలిసింది జానకి కథానాయిక

బహుమానం

కె ఎల్ కె పిక్చర్స్‌వారు 'బహుమానం' అనే చిత్రం బహూకరిస్తారు స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కమలాకర కామేశ్వరరావు సహ దర్శకుడు గోటేటి శ్రీరామారావు కథ కె ఎల్ కె మాటలు, పాటలు సముద్రాల, గోటేటి సంగీతం నాగలాపురి, కళ శ్రీనివాసరావు, కెమెరా వీరబాహు, స్టూడియో గోల్డెన్, బాలయ్య, రాజనాల, రాజశ్రీ వగైరా నటి స్తున్నారు

జబక్

వసంత్ పిక్చర్స్ వారి వసంతమైన చిత్రం 'జబక్' మార్చి పన్నెండవతే పత్రికారచయితలకు చూపారు ఇది ఒక అరబ్బీ జానపదవీరుని కథ హోమీవాడియా దర్శకత్వంలో పూర్తి గేవా కలర్‌లో కడు రమ్యంగా ముస్తాబైన దీ చిత్రం ఈ చిత్రంలో జబక్‌గా మహీపాల్, అతని ప్రేయసి జైనబ్‌గా శ్యామా, దొంగలనాయకుని కూతురు సలీమాగా సాహిరా అనే నూతననటి నటించారు మాటలు, పాటలు శ్రీశ్రీ సంగీతం విజయభాస్కర్

అందమైన అవుట్‌డోర్ దృశ్యాలతో, పోట్లా లతో, లాస్యాలతో చిత్రం దర్శనీయంగా ఉంది ★

ముఖచిత్రం కథ

(15 వ పేజీ తరువాయి)

తెరమీద చోటు కలిగించిన గౌరవం ఈ సంస్థదే నేషనల్ ఆర్ట్ థియేటరు అంటే ఎన్. టి. రామారావూ, తమ్ముడు త్రివిక్రమరావూను రామ లక్ష్మణులవలె ఈ సోదరు లిద్దరూ చిత్రవనిలో విహరిస్తుంటే పెద్దలు వారి ఐక్యానికి హర్షించడం పరిపాటి.

రామారావు కేవలం అదృష్టవంతుడేకాదు కృషీవలుడు దృష్టఫలవంతుడు తెలుగు సినిమా రంగంలో అతను ధరించని పాత్రలేదు అతనిని వరించని దర్శకుడూ లేడని చెప్పాలి.

ప్రసిద్ధులయిన బి. యన్., కె. వి., హెచ్. ఎం. లతోపాటు ప్రసాద్, రామకృష్ణవంటి వారి చేతిలోను అతను పాత్రధారణ చేశాడు. ఇప్పుడు 'సీతారామ కళ్యాణం' చిత్ర నిర్మాణానికి ప్రాచీన రామకథ పురాణాలన్నీ గాలించి ఆ చిత్రానికి దర్శకత్వం వహించాడు. దర్శకుడనే పేరుమాత్రం కోరలేదు.

ఎన్నడూ అనవసర కార్యరంగాలకు అతను వెళ్ళడు. నిత్యమూ స్వధర్మకర్మ పరాయణుడు. ముక్తసరిగా ఉంటాడు. ప్రచారంకోసం ప్రాకులాట ఎన్నడూలేదు. తను చేసే మంచి ఏదైనా గుప్తంగా ఉంటేనే సంతోషిస్తాడు. మితిమించేలోక్యాలు, శ్రుతిమించే వాక్యాలూ అతని మతంకాదు.

దీక్ష, దక్షత, క్రమశిక్షణ అతని వర్తమాన భవిష్యత్ భూతకాలాలు.

శ్రమ, పరిశ్రమ అతని అహర్నిశలు.

మితభాషణం హిత భాషణం అతని అంద చందాలు. 'కల్పంపు చిరుపొడులుప్పని తీగగా నూదినట్లు' ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. అతని అదృష్టరేఖ హాసరేఖగా కన్పిస్తూ ఉంటుంది.

పేరుకు, తీరుకు సరిపోలిన 'స్మిత పూర్వాభిభాషీచ పూర్వ భాషీ' అన్న మాట అతనికెంతైనా తగును.

—సుందరరామమూర్తి

కేంద్ర పతి

సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు "మన రాష్ట్రపతి ఎవరురా?" అని ప్రశ్నించాడు.

"భీమ్‌సేన్ సచార్ అండి" అన్నాడు గోపి.

ఉపాధ్యాయుడు కోపంగా "మరి రాజేంద్రప్రసాద్ ఎవరురా" అని ప్రశ్నించాడు.

"కేంద్రపతి, సార్."

స్వామిరెడ్డి (గుంటూరు)



ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'భార్యాభర్తలు' లో గిరిజ, నాగేశ్వరరావు

శాంతికళా ఫిలిమ్స్ వారి 'శాంత' లో గుమ్మడి



న్యూఢిల్లీ లేఖ

(12 వ పేజీ తరువాయి)

చెప్పారు. వ్యాధినివారణకు దేశవ్యాప్తంగా సదుపాయాలు కల్పించే కార్యక్రమం ప్రారంభమైనది.

ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌ లన్నింటికీ వర్తించే చట్టం ఒకటి ఉండాలని కొందరు సభ్యులు చేసిన సూచనను అంగీకరిస్తూ, ఈ విషయమై సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఢిల్లీలో మశూచి వ్యాధి వ్యాప్తిని గూర్చి కూడా సలహా సంఘం చర్చించింది. ఈ సమస్యపై నిర్విరామంగా పరిశోధన సాగించవలసిందిగా ఆరోగ్యశాఖ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలోను, అనారోగ్యకర ప్రాంతాలలోను మశూచి బాగా ప్రబలింది. వ్యాధి ఉధృతంగా ఉన్న సమీపగ్రామాలనుంచి ప్రతినిత్యం వస్తున్న జనంవల్ల కూడా నగరంలో పరిస్థితి ఇంత ఇదిగా ఉన్నది. దీనిని నిరోధించేందుకు సాంఘిక సంక్షేమ సంస్థల సహకారం కోరాలని కొందరు సభ్యులు సూచించారు.

1960 నవంబరు 26 వ తేదీతో అంతమైన వారం నుంచి ఢిల్లీలో మశూచి వ్యాధి తీవ్రరూపం ధరించింది. 1961 జనవరి 7 వ తేదీ నాటికి పరాకాష్ఠ నందుకొన్నది. ఈ మధ్యకాలంలో మొత్తం 665 మందికి వ్యాధి సోకగా 165 మంది మరణించారు. అంటే నూటికి 25 మంది చనిపోయారన్నమాట. ★

హరి వంశము

నాందీపని పర్వం-8

అగ్నికార్యం పూర్తిఅయినది. హవ్యవాహనుడు సంతోషించినవానివలె ప్రదక్షిణ జ్వాలా జాలంగా ప్రకాశించినాడు. భగవంతుడు అగ్నిని ఇట్లా ప్రార్థించినాడు : "స్వస్తి శ్రద్ధాం మేధాం యశః ప్రజ్ఞాం విద్యాం బుద్ధిం శ్రియం బలంఆయుష్యం తేజ ఆరోగ్యం దేహి మే హవ్యవాహన" యస్యస్మృత్యాచ నామోక్త్యా తపోహోమ క్రియాదిషు, న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వన్దే హుతాశనం. మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం హుతాశన, యుద్ధుతన్తు మయాదేవ పరిపూర్ణం తదస్తుతే. తక్కిన వటువులు గూడ ఆయనను అనుసరించినారు.

ఒక్క భిక్షాకార్యం తప్ప తక్కిన ఉపనయన తంత్ర మంతము దాదాపుగా పూర్తి అయినది. శ్రీకృష్ణ బలరాములు, తక్కుంగల వటులు ముందు తల్లిదండ్రులకు, తరువాత తక్కుంగల గురు వృద్ధ బంధుజనులకు సాష్టాంగదండప్రణామములు ఆచరించినారు.

అప్పుడు వసుదేవుడు తన పుత్రులను సంబోధించి ఇట్లా శాసించి నాడు :

వసు : బ్రహ్మచార్యసి.

శ్రీకృష్ణుడు : బాఢ మస్మి.

వసు : కామచార వాదభక్షణకామో న భవామి. ఆపోశాన.

శ్రీకృష్ణుడు : బాఢ మశ్నామి.

వసు : కర్మకురు.

శ్రీకృష్ణుడు : బాఢం కరోమి.

వసు . మాసుషుప్తాః.

శ్రీకృష్ణుడు : బాఢం దివా నస్వపిమి.

వసు : భిక్షా చర్యంచర.

శ్రీకృష్ణుడు : బాఢం చరామి.

వసు : ఆచార్య దేవోభవ.

శ్రీకృష్ణుడు : బాఢం భవామి. భవద్భిః అననుజ్ఞాతస్సన్ యాజనాది కర్మన కరోమి.

ఆ వెంటనే భగవంతుడు భిక్షకు బయలుదేరినాడు. తక్కిన వటువులును భిక్షలకు బయలుదేరినారు. ఈ భిక్షఎత్తుటకు ఒక పద్ధతి యున్నది. ముందు తల్లిని గాని, పినతల్లిని గాని, మేనయత్తను గాని, సోదరిని గాని అర్థించవలెను భగవంతుడు ముందుగా తన తల్లియైన దేవకీదేవి వద్దకు పోయి నిలబడినాడు. తక్కిన వటువులును తమ తమ తల్లులను భిక్ష యడుగగా బయలుదేరినారు. బంధువులకు ఇది యంతయు పరమ ఉత్సాహ కారణముగా నున్నది. ఈ వటువులు తల్లిదండ్రుల వద్ద భిక్షను అర్థించి తరువాత తమ్ము దరిసెదరు. అప్పుడు తాము వారికి భిక్ష పెట్టవలెను. దేవకీదేవి పుత్రుడు తన ఎదుట నిలిచి భిక్ష యడుగగా ఆనందపడినది. పుత్రుని వలన తనకు జరుగుచున్న ప్రథమ మర్యాద ఇది. మరి ఆ పుత్రుడు ఎటువంటివాడు ? వాని లీలలను తాను విన్నది కాని చూడనేలేదు. చూచిన లీలయేమో లోకభీకరంగా వున్నది. అప్పటి ఆ శిశువునకు, ఇప్పటి ఈ శిశువునకు ఏమి సంబంధము ? ఆ శిశువు లోకకంటకులను సంహరించువాడు. పరమ సుందరుడు. పరమ భీకరుడు. ఇప్పుడు ఈ పుత్రుడు ఎట్టివాడు ? పరమ సుందరుడు. పరమ సౌమ్యుడు. శిష్యుడు పోలె, తన్ను సవిపించినాడు. ప్రవర చెప్పి :

"భిక్షాం భవతి దేహి."

అని అర్థించినాడు. తాను ఏమో భిక్షను ఈయవలయు ననుకొన్నది. నేను ఏమి ఈయగలను అనుకొన్నది. ఆమెకు ఏమి భిక్షగా నీయవలయునో ఆ సంతోషములో తెలియలేదు. గుర్గుడు అనినాడు: "తల్లీ! ఇదిగో పళ్లెము. యవధాన్య మున్నది. కొబ్బరిచిప్ప లున్నవి. రెండు చేతులతో రెండు కొబ్బరి చిప్పలను పట్టుకొని యవధాన్యమును కొలిచి వటువునకు భిక్ష దయచేయించు" అన్నాడు. శ్రీకృష్ణదేవుడు అంగవస్త్రమును పట్టినాడు. దేవకి అప్పుడు తాను అదితిని అనుకొన్నది. తన ఎదుట ఉన్నవాడు ఇంద్రావరజుడు. వానికి తాను ప్రథమ భిక్షను ఇస్తున్నది. కొబ్బరి చిప్పలతో యవలు కొలిచి వటువు పట్టిన అంగవస్త్రములో పోసినది. మరియు కొంత సువర్ణమును గూడా ఆ యవధాన్యముతో కలిపి కొలిచినది. భగవంతునకు ఆమె ఆ చేత చూడగా నవ్వు వచ్చినది.

తల్లి భిక్ష అయిన తరువాత తండ్రి భిక్ష. వటువులు తమ తమ తండ్రులముందు నిలబడినారు. ప్రవర చెప్పినారు.

"భిక్షాం భవాన్ దదాతు." అని ప్రార్థించినాడు.

తండ్రులును తల్లుల వలెనే యవధాన్యమును భిక్ష యిడినారు.

తరువాత బంధుజనుల వద్ద భిక్ష. వటువులు ఉగ్రసేనుని ముందు నిలబడి ప్రవర చెప్పినారు : "భిక్షాం భవాన్ దదాతు" అని అర్థించినారు. ఆయన శ్రీకృష్ణుని కన్నులలో కన్నులుంచి ఇట్లా అనినాడు : తాత ! నేను నీకు ఏమి ఈయగలను. ఈ రాజ్య మంతయు నీది. నన్ను రాజును చేసినావు. ఇప్పుడు ఈ రాజ్యమును తిరిగి నీకు ఇచ్చుచున్నాను. గ్రహించెదవా ?"

భగవంతునకు నవ్వు వచ్చినది. ఉగ్రసేనుని ఆ అనుటలో హాస్యమున్నది. హాస్యమును లేదు. భగవంతు డనినాడు : మహారాజ ! నేను క్షత్రియ వటువును. వటువులకు విద్య కావలయును గాని, రాజ్యము లెందుకు. నీవు వృద్ధుడవు. అనుభవజ్ఞుడవు. రాజ్యమును ఏలవలసినది నీవు. వటువులకు వేయు భిక్ష ఇట్టిదిగా ఉండునా !

ఉగ్రసేనుడు "ఉండదు" అనినాడు. "కంచుకీ" అని పిలిచినాడు. కంచుకి రత్నములతో నిండిన పళ్లెములను తేగా ఆ పళ్లెముతోనే ఉగ్రసేనుడు భిక్ష యిడినాడు.

తక్కిన యదువృద్ధులును ఉచిత భిక్షలను ఇడినారు. భగవంతుడు అప్పుడు యశోద ఎచ్చట నున్నదా అని చూచినాడు. ఆమె ఇందాకటి నుండియు కన్పించుటలేదు. రోహిణిని చూచి "తల్లీ ! యశోద కన్పించదేమి ?" అన్నాడు. "తండ్రి ! భిక్షను తీసుకురా పోయినది" అన్నది రోహిణి. అన్నంతలో యశోద వచ్చినది. ఆమె వెంట సర్వాభరణ శోభిత నీల ఉన్నది. ఆమె ఆ నీలను వెంటబెట్టుకొని వచ్చినది. భగవంతుడు యశోదను దరిసినాడు. "యశోదే !" అనినాడు. యశోద తలయెత్తి శ్రీకృష్ణదేవుని వంక చూచినది. ఆమె కన్నులలో ఆనందమున్నది. దుఃఖ మున్నది. ఆమె చిరు మంద హాసము చేసినది. "తండ్రీ ! నేను గూడా భిక్ష ఇత్తునా !" అన్నది.

భగవంతుడు ప్రవర చెప్పినాడు : "భిక్షాం భవతి దేహి" అని అర్థించినాడు. అంగవస్త్రమును పట్టినాడు. "తండ్రి నేను పట్టి చేతుల

హరిత శివశర్మ

పాదను. నావద్ద ఏమి ఉన్నది. నేను ఏమి భిక్ష ఈయగలను. నేను తల్లిని అనుకొని, తల్లిప్రేమ నంతయు నీకే అర్పించినాను. ఇప్పుడు నేను ఏమి ఇయ్యగలను. నావద్ద నున్న ధనము ఇది. ఇది నీల. ఇది నీ ధనము. ఆ ధనమును నావద్ద న్యాస ముంచినావు. దానిని భిక్ష ఇస్తాను. ఇది నీవు నాకు కుమారుడవైనపుడు సంపాదించిన ధనము. ఆ ధనమును ఇప్పుడు భిక్ష పెడుతున్నాను" అన్నది. నీలను శ్రీకృష్ణుని చేతులలో పెట్టినది.

ఈ భిక్ష యేమి! ఈ పద్ధతి యేమి! దేవకి కన్నులలో నీరు తిరిగినది. రోహిణి కన్నులు తుడుచుకొన్నది. అందరును దిగ్భ్రాంతి చెందినారు. వంటునకు దుఃఖమో, ఆనందమో తెరలు తెరలుగా పొక్కుచున్నది. "యశోద! యశోద! నీవు అమాయకవు. నీవు ఏమో అనుకొనినావు. ఇది యేమి భిక్ష. ఇది ఏమి ఆలోచన! తండ్రి నీలను ఎప్పుడో స్వీకరించినాడు. మరల స్వీకరించుట యేమిటి? తండ్రి! యశోద ఉన్మాదిని యగుచున్నది. నీళ! నీవు ఆరణ్యకవు. తండ్రి నాగరకుడు. యశోద నిన్ను నాగరికను చేయ తలవని చూచుచున్నది." అన్నాడు

నీల మాట్లాడలేదు. భగవంతుడు ఆమె వంక చూచినాడు. ఆమె భగవంతుని కన్నులలో కన్నులుగా చూచినది. ఆయన మందహాసము చేసినాడు. నీలయు మందహాసము చేసినది. భగవంతుడు యశోదతో అన్నాడు: "యశోద! నీవు ఇప్పుడు ఒంటరిదానవు. నీల నీకు తోడుగా నుండును. నీల నీ దగ్గర నున్నచో నేను నీ దగ్గర నున్నట్లే. నేను యిప్పుడు బృందావనమునకు రాముగదా! మరి ఆలమంద లేమైపోవును. అందుకు గూడా నీలను నీవు విల్చుకొనవలెను." యశోద మాటాడలేదు. మాటాడుటకు ఏమియు లేదు. ఆమె ఇప్పుడు పరమ దుఃఖిత. తాను ఎప్పుడో బృందకు పోవలెను. శ్రీకృష్ణుడు లేని బృంద బృందయా? శ్రీకృష్ణుడు లేని తాను తానా? ఈ ఒక్క భావము తప్ప అప్పుడు ఆమెలో మరి ఏ భావమును లేదు. ఈ ఒక్క భావముచేత ఆక్రమించబడిన మనస్సు కలదై యశోద లోపల కుమిలిపోయినది. ఇప్పుడు ఈ భిక్షవేళ ఆమెలో నా భావము కాష్ఠకెక్కి ఆమెయే అయిపోయినది. శ్రీకృష్ణుని, నా చిన్ని తండ్రిని, వదిలి నేను ఎట్లు మనగలను? యశోద ఆలోచన అది. ఆమె ఆలోచన మనస్సునకు పట్టి, శ్రీకృష్ణుడు గలగల నవ్వినాడు. "యశోద! నీవు పిచ్చిదానవు" అన్నాడు. "నేను ఎప్పుడును పశువులను కాచుచు కూర్చున్నచో నేమి యగును? ఈమాత్రము నీకు ఆలోచన వద్దా?" అన్నాడు. యశోద మాట్లాడలేదు. భగవంతుడు మరల అనినాడు. "రోహిణి తల్లీ! మా యశోద వట్టి మునిగుబ్బి అయిపోయినదండీ! ఆమెకు నన్ను చూచి యిప్పుడు ఏడ్పు వచ్చుచున్నది." యశోద నిజముగా అప్పుడు ఏడ్చినది. "తండ్రి! తండ్రి! నన్ను ఏమి చేస్తావు?" అన్నది. "ఏమి చేస్తాను. బృందావనానికి పంపిస్తాను" అన్నాడు శ్రీకృష్ణదేవుడు. అని గల్లున నవ్వినాడు. "నీలను గూడ నీతో పంపుతాను" అన్నాడు. "యశోద! నీవు నవ్వగా యిప్పుడు నేను చూడవలెను" అన్నాడు. యశోద దుఃఖములో నవ్వగా, నవ్వులో దుఃఖముగా నవ్వినది. రోహిణి అన్నది: అది: మా యశోద చాల మంచిదమ్మా." "అవును! తల్లీ! అవును" అన్నది యశోద.

వడుగు నాల్గురోజులు జరిగినది. రెండవ రోజున అగ్నికార్యముతో సరి. మూడవ రోజున అగ్నికార్యమును, సదస్యమును. ముహూర్తము రోజును, సదస్యము రోజునను వసుదేవుడు భూరి సంభావనలతో భూమిదేవులను సంతృప్తిపరచెను. వడుగు నాల్గుదినములును ఎడతెరపిలేని అన్నసత్రములు నడిపించెను. ప్రతి కార్యమును తాను చూచుకొనవలయునని ఆయన ఆశ. కాని కార్యము పట్ల ఎప్పుడును అట్లా జరుగదు. రోహిణి అంధకునితో "తాత! ఆయన ఆశకు అంతు లేదు. అంతయు తాను చూచుకొనవలయునని. మరి నీవు వూరుకొన్నచో పని జరుగదు" అన్నది. ఆ తరువాత అంధకుడు వసుదేవుని మందలించెను. "తాత! వసుదేవ! మేము ఇంతమందిమి ఉండగా నీకు ఈ అలుపు దేనికి! మేము యివి యన్నియు, చూడమా?" అన్నాడు. ఆ తరువాత వసుదేవునికి రెండే పనులు. ఒకటి బిడ్డలచేత గాయత్రిని పఠింప జేయటము. రెండు, దగ్గర ఉండి అగ్నికార్యమును చేయించడము.

యదువంశపువారి ఇండ్లలో జరుగుచున్న వడుగుల వృత్తాంతము దేశదేశములకు ప్రాకెను. సర్వ దేశములనుండియు బ్రాహ్మణ జనములు వటువులను ఆశీర్వదించి, తగు సంభావనములను అందు కొనిపోగా వచ్చినారు. వారిలో సాందీపని గూడ యుండెను సాందీపని తక్కిన బ్రాహ్మణుల వంటివాడు కాడు. ఆయన కులపతి. కాని దుఃఖితుడు. ఆయనకు లేకలేక ఒక కొడుకు కల్గెను. ఆ కుమారుడు ఒక్క రోజున ప్రభాస తీర్థమునకు స్నానార్థమై పోయెను. మరి తిరిగి రాలేదు. ఏ ఉగ్రగ్రాహమో అతనిని మ్రింగె ననుకొన్నారు. అదిమొదలు సాందీపని శిష్యులతో గూడా తీర్థయాత్రలకు దిగెను. ఆయన మహాపండితుడు. సర్వ శాస్త్రవేత్త. చతుర్వేదపారగుడు. ధనుశ్శాస్త్రవిత్తు. ఆయన రాగా సర్వాయయాదవులును సంతోషించినారు. ఆయనను సంతోషపెట్టగా చూచినారు. ఎవ్వరికిని ఆయన రాకకారణము తెలియలేదు. దక్షిణ అందుకోగా వచ్చినా డనుకున్నారు. వసుదేవుడు ఆయనకు భూరి దక్షిణ నీయబోయెను. ఆయనవద్దనెను. 'అయ్యా నాకు ఎందుకు! నేను నీ బిడ్డలను ఆశీర్వదించి పో వచ్చినాను. బాదరాయణులు ఇక్కడికి వచ్చినారని విని, వారి దర్శనము చేసుకొనగా వచ్చినాను. నాకు అదియే చాలు. అంతకన్న వేరు సంభావన మేమియున్నది" అనినాడు.

సాందీపని అక్కడ భోజనము గూడ చేయలేదు. స్వహస్తపాకులయిన బ్రాహ్మణయాజకులు ఆయనను బ్రతిమలాడిరి గాని, ఆయన వినలేదు. వటువులను ఆశీర్వదించి, తాంబూలము మాత్రము పుచ్చుకొని, కదలిపోయెను. భగవంతునకు ఆయనను చూడగా ఆశ్చర్యమయ్యెను. భగవంతుడైన వ్యాసుడు ఆయన అనగా చూపించిన గౌరవమును చూచి ఆశ్చర్యపోయెను. ఆయన గూర్చి తనకు ఏమి తెలియును. కాని శ్రీకృష్ణదేవుని మనస్సులో అన్పించినది. "ఈయనవద్ద నేను శుశ్రూష చేయవలెను. విద్యలను అభ్యసించవలెను ఆయన నాకు శిక్షాగురువు కావలెను." ఆ అనుకొన్న ఆలోచనను అప్పటికి ఆయనలోననే ఉండిపోయెను.

వడుగు నాల్గవ దినమున పాలాశహోమమును చేయుట ఉన్నది. కుమారులకు మేధాజనన సిద్ధ్యర్థం ఈ పాలాశ హోమం జరుగుతుంది. కొందరు ఈ హోమమును చేయరు గూడ. ఉపనయనము ప్రథమ దినాదిత్ర్యాపికమే గాని నాల్గవ దినము లేదను ఆచారము గూడ నున్నది. వసుదేవుడు పాలాశ హోమమును గూడ చేయవలయుననియే సంకల్పించెను. కుమారులు కృతశౌచులయిన తర్వాత గాయత్రిని పఠింపజేసి, అగ్నికార్యమును పూర్తి చేయించి, పాలాశ కర్మకు ఆయన పూనిక వహించెను. పలాశ వృక్ష మూలమును అలంకరింపజేసి సహపత్నీకుడై ఆయన పాలాశకర్మకు దిగెను. పలాశమునకు ఉత్తరముగా పీటలు వేయబడినవి. వసుదేవుడు తాను ఉత్తరతః ఆసీనుడై, దక్షిణమున భార్యలు, వారికి దక్షిణమున బిడ్డలుగా పీటలపై కూర్చుండెను. తిరిగి విఘ్నేశ్వరపూజ జరిగినది. పాలాశమునకు ప్రాగ్భాగమున ఉపనయనాగ్ని ప్రతిష్ఠాపించ బడినది. పరిస్తరణాది కర్మలు జరుపబడినవి. అగ్నికి పూర్వదేశముగా, ఈశానదేశముగానూతనవస్త్రములతో మంటపము ఆపాద్యము చేయబడినది. మంటపములపై పంచప్రస్థపరిమితముగా యవలు ఉంచబడినవి. ప్రాగపవర్గములుగా, ఉదగపవర్గములుగా మూడు స్థండిలములు ఏర్పాటు చేయబడినవి. అప్పుడు ప్రణవశ్రద్ధా మేధావాహనార్చా నమస్కార క్రియలకు వసుదేవుడు ఉపక్రమించినాడు. ప్రథమస్థండిలమున ప్రణవాన్ని ఆవాహనం చేసి, స్థాపించి, పూజించి, అర్ఘ్యము, పాద్యము, ఆచమనీయము మొదలైన మర్యాదలను నడిపినాడు. ద్వితీయ స్థండిలమున శ్రద్ధను ఆవాహనము చేసి, స్థాపించి, పూజించి, అర్ఘ్యాధిక మర్యాదలు పొనర్చినాడు. తృతీయ స్థండిలమున మేధను ఆవాహనము చేసి, స్థాపించి, పూజించి, అర్ఘ్య పాద్యాచమనీయాది మర్యాదలు ఆచరించినాడు. ప్రణవశ్రద్ధా మేధా దేవతలను ఆహ్వానించి, ప్రాణ ప్రతిష్ఠాపనము చేసి "ప్రణవ శ్రద్ధా మేధా దేవతాభ్యోన్నమః, స్థిరోభవ, వరదోభవ, సుముఖోభవ, సుప్రసన్నోభవ, స్థిరాసనంకురు" అంటూ ఉపచార పురస్సరముగా అభ్యర్థనం చేసినాడు. ధ్యానావాహనాది షోడశోపచారములు పూర్తి యైనవి. అప్పుడు కుమారమేధాజనన సిద్ధ్యర్థం పాలాశహోమం ఆరంభమైనది. కుమారులచేత వసుదేవుడు పదకొండు ఆహుతులచేత అగ్నిని సంభావనం చేయించినాడు. హోమప్రతిష్ఠాసిద్ధ్యర్థం,వృద్ధికాములైనపుత్రకులచేత జయాదిహోమం జరిపించాడు.

అక్కడితో ఉపనయనం పూర్తి అయింది. తిరిగి మరియు అగ్ని ప్రజ్వలింపజేసి వటువులచేత మేఖలలను, అజినములను, దండమును పాలాశమూలమున పెట్టించినారు. తిరిగి వటువులకు నూత్న మేఖలములను, నూత్న అజినములను, నూత్న దండములను ధరింపజేసినారు. తదుపరి మంటపస్థిత దేవతాపూజ జరిగినది. ఆ దేవతలకు తిరిగి ధ్యానావాహనాది పూజా పురస్కారములు జరుపబడినవి. ఆ తరువాత అగ్నిప్రదక్షిణము. తిరిగి మంటపస్థిత దేవతాపూజ. అప్పుడు కంకణ విమోచనము. తుదకు, ఆచార్య వటువులకు ఆశీర్వచనము. ఈ క్రమముగా యదువంశ కుమారుల ఉపనయనములు పూర్తి అయినవి. ★


ఆధారాలు

అడ్డం


1. దీని తర్వాత కంటె, కంటె తర్వాత వట్టి !
3 అరుగదదేమి ? సగం సువాసనద్రవ్యమైనా ?
5. ఏడిచి.
7. మధ్య ఆయుర్దాయ మనవచ్చునా ?
8. చక్రవాకములు.
9. మధ్య అచ్చైన బియ్యము. ఉడికినతర్వాత; కలిగావులగ మైనది కూడా.
12. అటునుంచి వేళను తెలిపే పరిమాణము.
14. దగ్గు, నాటకాలలో వచ్చేది.
15. స్వరాలదండి !
16. అమ్మలకలలో లాక్షావిశేషం !
17. ఆ పెరుగుతోటకూరలో ఆమె ఎవరు ?
20. ఇది—అంటే వరుస—తప్పిపోయింది !
4. ఒక చిన్నపురుగు ఇలా అయితే మాట్లాడదంటారు.
,. హితునని చెప్పి కొండనుచేర్చి మంచిపర్వతముగా మారాలి.
26. ముగ్గురి గీతలు, సగం తగ్గించి అలంకరణలు నేలమీద కనుపిస్తాయి.
27. వా డప్పులు తీర్చకపోయినా శబ్దం బాగా చేస్తాయి.
28. రాక్షసులు.

నిలువు

1. వనము దగ్గరగా ముఖము.
2. నడకవేగంబట్టి ప్రవర్తనా ?
3. ఇప్పుడు తెలుగు వ్రాసేప్పుడు సగం పెట్టకపోయినా పూర్తిని ఇవ్వడంలేదు.
4. రక్తము.
5. ఒకవిధమైన ఏనుగు.
6. చిరు, ఎలుక.
7. ఎప్పుడూ !
తలక్రిందులైన ఆరటి.
13. చేయు— (లేము).
18. పెద్దతనములో రెండవ అంశం కొంచెం మార్చి కలుగజేసుకొనటమా ?
19. వగడము.
20. జీవితం గడపమను, తెలుస్తుంది !
21. యజ్ఞములు.
22. ముఖమున ఆనేము !
23. ఇక్కడి మంట నెత్తి కెక్కుతుందా ?



44 వ గళ్ళనుడికట్టుకు జవాబులు



గళ్లనుడికట్టు-43
ఆధారాల పోటీ ఫలితం

శ్రీ బి. రామిరెడ్డి (వెంకటాద్రిపల్లె) పంపిన ఆధారాలు ఉత్తమమైనవిగా నిర్ణయించి, ఆయనకు బహుమతిగా రు 5 లు పంపుతున్నాం.

శ్రీ రామిరెడ్డి పంపిన ఆధారాలు ఇవి : 2-నిలువు : కోకిల కన్నా లకన్న మధురంగాపాడుతుంది. దగ్గరఎక్కడో వీణావిశేషం ఉంచుకున్నది కాబోలు! (మేము ఇచ్చినది - కింపురుషుల వంటివారా?) జవాబు - కిన్నెర. 30-అడ్డం : వినయంలో విశేషయమైతే లాభం అంటారా? (మేము ఇచ్చినది - ఇంకా "లాభము" ప్రమాదం జరగలేదంటారా? జవాబు - నయము.

చిల్లరమాట?

బస్సు ఆగింది. దిగేవారు దిగుతున్నారు. ఎక్కేవారు ఎక్కుతున్నారు. కండక్టర్ వరసగా అందరికీ టిక్కెట్లు ఇస్తున్నాడు. అంతలో ఒకకుర్రవాడు కంగారుగా జేబులు తడుము కొంటూ ముఖం వేల వేశాడు. అతని అవస్థ చూచి, జాలిపడి కండక్టర్ ఉచితంగా ఒక టిక్కెట్ ఇచ్చి ముందుకు వెళ్ళబోయాడు.


ఆ కుర్రాడు "ఏమండోయ్" అని కేక వేశాడు.

కండక్టర్ వెనక్కుతిరిగి "ఏ" మని ప్రశ్నించాడు.

"మిగతా చిల్లర ఏదండీ" అనడిగాడు ఆ కుర్రవాడు.

—సోంభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి
(అమలాపురం)

—బహుమతి పొందిన కార్టూన్—



చిత్రకారుడు—ఎగ్గోని శ్యామసుందర్ (గుత్తి)

లాభం ఎవరికి?

చాలాకాలం న్యాయవాదిగా పనిచేసి, బోలెడు గడించి, చివరికి విసుగుచెంది, తన కేసులన్నీ కొత్తగా ఆవృత్తిలో చేరిన తమ్మునికి అప్పగించి, వానప్రస్థ ఆశ్రమంలో చేరాడు ఆయన.

ఆరునెలలు అయినా గడవకుండానే తమ్ముడు విజయగర్వంతో అన్నగారి దగ్గరికి వెళ్ళి "ఏళ్ళతరబడి కొరకరాని కొయ్యగా ఉన్న (తమ క్లయింటు) జమీందారుగారి కేసులో ఆయనకు విజయం చేకూర్చినట్లు" చెప్పుకొన్నాడు.

అన్నగారు చాలా విచారపడి ఇలా అన్నాడు:- "ఎంత పని చేశావురా, తమ్ముడూ! జీవితాంతం నీకు పింఛనుగా ఉంటుందని ఇన్నాళ్ళూ నిలబెట్టిన కేసును ఇట్టే ఫైసలు చేశావుగదా! ఇదా నీ వివేకం!"

—తటవర్తి ప్రసాదరావు
(హైదరాబాదు)

* * *

ఆమాంతం తెలియదా?

ఒకానొక పెద్దమనిషి తన భార్య పుట్టినరోజు కానుకగా ఒక చక్కని చిలుక ఇచ్చాడు. ఆ చిలక కాళ్ళకు దారాలు కట్టి ఉండడం చూచి భార్య "ఏమండీ, ఈ దారాలు ఏమిటి, ఎందుకు" అనడిగింది. "ఒక్కొక్క దారమూ లాగి చూడు. నీకే తెలుస్తుంది" అన్నాడు అతగాడు.

ఆమె ఒక దారం లాగే సరికి "నమస్కారం తల్లీ!" అంది చిలక.

ఆమె సంబరపడి రెండో కాలుకు కట్టినదారం లాగింది. "మిమ్మల్ని చూడ్డం చాలా సంతోషంగా ఉంది" అన్నది చిలుక.

భార్య ఆశ్చర్యం అణచుకో లేకపోయింది. "ఏమండీ రెండు దారాలూ ఒక్కసారే లాగితే ఏమౌతుంది" అని అడిగింది భర్తను. "లాగిచూడు. నీకే తెలుస్తుంది" అన్నాడు అతడు.

ఆమె లాగింది.

"క్రిందపడి పోతాను, వెర్రిదానా!" అంది ఆ చిలక.

—గడ్డం పద్మనాభం (గొల్లప్రోలు)

* * *

మృత్యుదేవత దయ


ఒకానొక వృద్ధుడు ప్రతిరోజూ అడివికి పోయి కట్టెలు కొట్టి తెచ్చి విక్రయించి లభించినదానితో పొట్టపోసుకుంటూ ఉన్నాడు. అతడు మామూలుగానే ఒకనాడు అడివికి వెళ్ళాడు. కట్టెలు కొట్టాడు. మోపు కట్టాడు. శ్రమ సహించలేక పోయాడు. క్రింద చతికిలబడి తనలోతాను "ఓ మృత్యుదేవతా! నీకైనా నామీద దయరాదే"మని ఘోషించాడు.

వెంటనే మృత్యుదేవత ప్రత్యక్షమై, "నన్ను ఎందుకు పిలిచావు" అని అడిగింది.

"ఈ కట్టెలమోపు ఎత్తి నాతలమీద పెట్టడానికి" అన్నాడు ఆవృద్ధుడు.

—తటవర్తి ప్రసాదరా
(హైదరాబాదు)

Printed and Published for NageswaraRao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



త్రిమూర్తి శిల్పం

—చిత్రకారుడు : వై. సుంకిరెడ్డి.


మార్చి 23 వ తేదీ విడుదల
సాహసోపేత ప్రేమ గాధ
బసంత్_వాడియా బ్రదర్స్ వారి
అరబ్బీ వీరుడు
జబక్
పూర్తి పంచరంగుల చిత్రం (తెలుగు)
మాటలు-పాటలు
శ్రీ శ్రీ
నిర్మాత-దర్శకుడు
హోమీవాడియా
సంగీతం
విజయభాస్కర్
పూర్ణా రిలీజ్......
నైజాం-చిత్రా రిలీజ్
FLOODLIGHT
STUDIO